ఆంధ్రప్రభ
Estd. 1938
www.prabhanews.com
Journalism first!


**ముహూర్తం**

శ్రీ విళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ షష్ఠి సా.5.28 వరకు అనంతరం సప్తమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర (పూర్తి); అమృతకాలం: రా.2.15 నుండి 3.55 వరకు; వర్జ్యం: మ. 3.40 నుండి 5.23 వరకు; దుర్ముహూర్తం: ఉ. 6.00 నుండి 7.36 వరకు; రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ.6.00 నుండి 7.36 వరకు




సంపుటి:57 • సంచిక:268 • శనివారం 12 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur |




# హైకోర్టు సీజే బదలీ ప్రతిపాదన

## సుప్రీంకోర్టు కొలీజియం తీర్మానం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న జస్టిస్ టీబీఎన్.రాధాకృష్ణన్ ను కల కత్తా హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా బదిలీ చేయాలని సిఫారసు చేసేందుకు సుప్రీంకోర్టు కొలీజియం తీర్మానించింది. కలకత్తా హైకోర్టు

5వ పేజీలో...

# సీఎంకు కొత్త కాన్వాయ్

- టయోటా ప్రాడోకు సంసిద్ధత
- 10 కార్ల కొనుగోలుకు ప్రణాళిక
- ఫార్ఛ్యూనర్ల స్థానంలో అన్నీ ప్రాడోలే
- తెల్లరంగు కార్లకే ప్రాధాన్యత



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ సీఎంగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కార్ల కాన్వాయ్ కొత్త రూపు సంతరించుకో నుంది. ఆయన కాన్వాయ్‌లో కొత్త కార్లు చేర్చేలా సాధారణ పరిపాలనా శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత

3వ పేజీలో...

# 14 ఎమ్మెల్సీ సీట్లు

# అసెంబ్లీ తర్వాత అభ్యర్థులు



- ఎలక్షన్ కమిషన్ కసరత్తు
- ఫిబ్రవరిలో నోటిఫికేషన్
- మార్చిలో ఎన్నికలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెరాసలో ఎమ్మెల్సీల సంక్రాంతి పండుగ మొదలైంది. ఒకేసారి 14 ఎమ్మెల్సీ ఖాళీలు ఏర్పడడంతో ఈ పదవులను చేజిక్కించుకునేందుకు పార్టీలో తీవ్ర పోటీ నెలకొని ఉంది. వచ్చే రెండు, మూడు మాసాల్లో ఎమ్మెల్సీ ఖాళీల భర్తీ చేయవలసి ఉండడంతో ఆశావహులు ఇప్పటి నుంచే తమ లాబీయింగ్‌ను ముమ్మరంచేసి ఎలాగైనా సరే ఈ పదవులను సాధించేందుకు తమదైనశైలిలో పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. పార్టీలోని సీనియర్లతో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ముఖ్య నేతలు, అటు తెరాస అధినేత కేసీఆర్, ఇటు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావును కలుస్తూ ఎమ్మెల్సీలుగా తమ పేర్లను పరిశీలించాలని కోరుతున్నారు. ఎమ్మెల్సీలుగా అభ్యర్థిత్వాలు ఖరారైతే గెలుపు ఖాయమన్న అభిప్రాయం ఏర్పడడంతో ఈ అవకాశం చేజారకుండా ప్రయత్నాలను ముమ్మరం చేయాలని ఆశావహులు భావిస్తున్నారు. ఈ దిశగా వారు ప్రయత్నాలను వేగవంతం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. 40 ఎమ్మెల్సీ స్థానాలున్న తెలంగాణ శాసనమండలిలో వచ్చే రెండు, మూడు మాసాల్లో భారీగా ఖాళీలు ఏర్పడుతున్నాయి. అతి త్వరలోనే ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్సీల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ రానున్నడంతో ఈ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు డజనుకుపైగా అభ్యర్థులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కోటాలో మూడు ఎమ్మెల్సీ స్థానాలు ఉన్న వారి పదవీకాలం ఈ ఏడాది మార్చి నెల ముగుస్తుంది. స్థానిక సంస్థల కోటాలో నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. మార్చి చివరి నాటికి మూడు స్థానాలు, మే నెలలో మరొకటి ఖాళీ అవుతోందని అధికారులు చెబుతున్నారు. ఎమ్మెల్యే కోటాలో ఆరు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. శాసనమండలి చైర్మన్ వి.స్వామి గౌడ్, మండలిలో చీఫ్‌విప్‌గా ఉన్న పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పూల రవీందర్ పదవీకాలం మార్చిలో

3వ పేజీలో...

# సంక్రాంతి కష్టాలు!



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల కిటకిట



# పండక్కి పిండేస్తున్నారు

## ప్లాట్‌ఫామ్ టిక్కెట్ ధర రెట్టింపు

- విమాన టిక్కెట్లకు దీటుగా ప్రైవేటు బస్సు టిక్కెట్ల ధరలు
- టోల్ ప్లాజాల వద్ద ప్రత్యేక కౌంటర్లు

2లో



నా తప్పేంలేదు

నా వాదన వినలేదు

# మనస్తాపంతో రాజీనామా

అలోక్ వర్మ ప్రకటన

5లో

# గ్రామ పాలన పటిష్టం కావాలి



- కొత్త పంచాయతీ చట్టంపై అవగాహన కల్పించాలి
- ఫిబ్రవరి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు
- సర్పంచ్‌లందరికీ తెలుగు ప్రతులు పంచండి
- పచ్చదనం, పరిశుభ్రతే వారికి ప్రధానం కావాలి
- పంచాయతీ ఎన్నికలపై ప్రగతిభవన్‌లో సీఎం సమీక్ష

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్ర ఆర్థిక ప్రగతికి, వృద్ధిరేటు పెరిగేందుకు గ్రామీణ పాలన ఎంతో ముఖ్యమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అభిప్రాయపడ్డారు. కొత్త పంచాయితీరాజ్ చట్టం అమల్లోకి వచ్చినందున గ్రామ పంచాయితీల ప్రాధాన్యతను గుర్తించి చైతన్యపరచాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. అదే సమయంలో పంచాయితీ ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగమంతా సమిష్టి భాగస్వామ్యంతో, సమన్వయంతో పని చేయాలని సూచించారు. కొత్తగా ఎన్నికయ్యే సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు చట్టాలు, వాటి ఉపయోగాలు, అధికారాలు, బాధ్యతలు, ప్రగతి సాధన, స్థానిక వనరుల వినియోగం, ఆదాయ వనరుల పెంపు తదితర అంశాలపై శిక్షణ ఇప్పించాల్సిన అవసరాన్ని ఉన్నతాధికారులకు గుర్తుచేశారు.

ఈ అంశంపై శుక్రవారం ప్రగతి భవన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడు తూ, ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయితీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామాలను అద్భుతంగా తీర్చిదిద్దే విషయంలో వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచడం లక్ష్యంగా కొత్తగా రూపొందించిన చట్టంపై పంచాయితీలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయితీకి కొత్త చట్టం తెలుగు ప్రతులను

5వ పేజీలో...

# జులై నుంచి గిరిజన వర్శిటీ తరగతులు

- జాకారంలోని యువజన శిక్షణా కేంద్రంలో నిర్వహణ
- స్థానిక విద్యార్థులకు 30% సూపర్ న్యూమరీ సీట్లు

2లో



# 2021లో గగన్‌యాన్

ఈ ఏప్రిల్ చివరలో చంద్రయాన్-2

రూ. 800 కోట్లతో ప్రయోగం

ఇస్రో చైర్మన్ కె.శివన్

వివరాలు 10లో...

**కమలంతో మోడీ**



# కమలమే గెలుస్తుంది

- మోడీ గెలుపే మన లక్ష్యం కావాలి
- బీజేపీ జాతీయ మండలి సమావేశాల్లో అమిత్‌షా

10లో

# మనమే గెలుస్తున్నాం

- యుద్ధం మొదలైంది
- దుబాయిలో భారతీయ వ్యాపారవేత్తలతో రాహుల్ ముఖాముఖి

9లో

**సెల్ఫీలో రాహుల్**






# సుందరంగా దాదాగిరి

## ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల అడ్డగోలు మోసాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి:** ప్రైవేటు రంగంలో ఆర్థిక, బీమా సంస్థల్ని ప్రోత్సహించిన ప్రభుత్వం బకాయిల వసూళ్ళలో మరిన్ని వెసులుబాట్ల కోసం ఈ సంస్థలకనుకూలంగా కొన్ని నియమనిబంధనల్ని రూపొందించింది. వాటిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ఫైనాన్స్, ఇనూరెన్స్, చిట్‌ఫండ్ కంపెనీలు వినియోగదార్లను అడ్డగోలుగా మోసం చేస్తున్నాయి. వడ్డీలు, చక్రవడ్డీలు, వడ్డీలపై వడ్డీలు రాబడుతూ రుణగ్రహీతల్ని గుల్ల చేసేస్తున్నాయి. నిబంధనల్లోని చిన్ని చిన్ని సానుకూల అంశాల్ని వినియోగించు కుని వినియోగదార్లను అడ్డగోలుగా మోసం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో పేజీలుండే నియమ నిబంధనల్లో బూతద్దంతో వెదికినా కంటికి కనిపించని సైజ్‌లో ఎక్కడెక్కడో తమకనుకూల అంశాల్ని ముద్రించి వినియోగదార్ల అవసరాల్ని, విశ్వాసాన్ని తమకనువుగా లాభాల రూపంలో మార్చేసుకుంటు న్నాయి. ఇటీవలె బజాజ్ కంపెనీ అతిచిన్ని అక్షరాల్తో ముద్రించిన నియమనిబంధనల్ని సాకుగా చూపి వినియోగదార్లను అడ్డగోలుగా మోసం చేసిన విషయం విధితమే. కాగా దక్షిణభారతంలోనే వాహనాల ఫైనాన్సింగ్ విభాగంలో అగ్రగామిగా ఉన్న సుందరం ఫైనాన్స్ కంపెనీ ప్రభుత్వం కల్పించిన వెసులుబాట్లను అడ్డగోలుగా, అక్రమంగా, అవినీతిచర్యలకు తమకనుకూలం గా మలచుకుని చిన్న చిన్న రుణాలు పొందిన వ్యక్తులకు చెందిన స్థిరాస్తుల్ని కూడా తన పరం చేసుకుంటోంది. ఆఖరకు గతంలో వారెప్పుడో ఇతరులకు విక్రయించేసిన భూములు, స్థలాల్ని కూడా తప్పుడు డాక్యుమెంట్ల సృష్టితో స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తోంది. ఇందుకోసం ఈ సంస్థ ప్రత్యేకంగా రౌడీలు, గూండాల్తో

3వ పేజీలో...



# పండక్కి పిండేస్తున్నారు

## సంక్రాంతి కష్టాలు!

## ప్లాట్‌ఫామ్ టికెట్ ధర రూ 20

## రైళ్లు కిటకిట!

పల్లెలకు వెళ్ళే వారికి మొదలైన పండుగ కష్టాలు

బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో రద్దీ షురూ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సంక్రాంతి పండుగను స్వగ్రామాలలో బంధు మిత్రుల మధ్య జరుపుకునేందుకు తరలి వెళ్ళే వారికి కష్టాలు మొదలయ్యాయి. పండగ ఎప్పుడు వస్తుందా, స్వగ్రామాలకు వెళ్ళి చిన్న నాటి మిత్రులను ఎప్పుడు కలుసుకుందామా అని ఎదురు చూసిన వారికి ఆరంభంలోనే ఆటంకాలు ఎదురవుతున్నాయి. గ్రామాలకు వెళ్ళేందుకు బస్టేషన్లు, రైల్వే స్టేషన్లకు వెళ్ళిన వారు సీట్లు దొరకక, రద్దీని తట్టుకోలేక అవస్థల పాలవుతున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వే, ఆర్టీసీలు అదనపు బస్సులు, రైళ్ళను ఏర్పాటు చేసినప్పటికీ ప్రయాణికులకు ఏ మాత్రం సరిపోక పోవడంతో నానా ఇక్కట్లకు గురవుతున్నారు. సంక్రాంతి పండుగ మంగళవారం అయినప్పటికీ వరుస సెలవులు రావడంతో చాలా మంది శుక్రవారం స్వగ్రామాలకు వెళ్ళేందుకు క్యూ కట్టారు. ఇలా బస్టాండ్లు, రైల్వే స్టేషన్‌లకు వెళ్ళిన వారు టికెట్లు దొరకక అవస్థల పాలవుతున్నారు. నగరంలోని ఇమ్లిబన్, జూబ్లి బస్టేషన్‌లతో పాటు శివారు ప్రాంతాలలోని ఎల్‌బీ నగర్, ఉప్పల్, ఆరాంఘర్ తదితర ప్రాంతాలలోనూ తీవ్ర రద్దీ నెలకొంది. ముందుగా టికెట్లను బుక్ చేసుకున్న వారు తప్ప అప్పటికప్పుడు టికెట్లను కొనుగోలు చేసి గ్రామాలకు వెళ్ళాలనుకునే వారికి ఎదురు చూపులు మిగులుతున్నాయి. ప్రయాణ ప్రాంగణాలలో వందల సంఖ్యలో ప్రయాణికులు బస్సులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు. రైల్వే స్టేషన్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్లాట్ ఫాంలపైకి బస్సులు, రైళ్ళు వచ్చినప్పటికీ బలమున్న వాడికి తప్ప బలహీనుడికి సీట్లు లభించని పరిస్థితి నెలకొంది. రద్దీ నివారణ కోసం ఆర్టీసీ, రైల్వే అధికారులు పలు చర్యలు తీసుకున్నప్పటికీ అవి ఏ మాత్రం ఫలితాలివ్వడం లేదు. అదనపు బస్సులలో అదనపు చార్జీలను అమలు చేస్తున్నప్పటికీ ప్రయాణికులకు సరిపోయే విధంగా సర్వీసులు లేకపోవడంతో కొన్ని రూట్లలో అధికారులు చేతులెత్తేసే పరిస్థితి నెలకొంది. విజయవాడ మార్గంలో రద్దీ తీవ్రంగా ఉండటంతో జిల్లాల నుంచి బస్సులను తెప్పించేందుకు అధికారులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మరో మూడు రోజులు కూడా ఇదే పరిస్థితి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

### ఫ్లైట్ టికెట్ ధరలకు ధీటుగా ప్రైవేట్ బస్సు టికెట్లు

ఆర్టీసీ బస్సులు, రైళ్ళలో టికెట్లు దొరకక, అక్కడి రద్దీని తట్టుకునేందుకు ఇష్టపడని చాలా మంది ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. వాస్తవానికి ప్రైవేట్ బస్సులలో టికెట్లు ఎప్పుడో బుక్ అయిపోయాయని పేర్కొంటున్న ఆపరేటర్లు ఇష్టం వచ్చినట్లు డబ్బులు వసూలు చేస్తున్నారు. పైగా మీరడిగారు కాబట్టి ఏదో ఒక రకంగా రెండు సీట్లను సర్దుబాటు చేస్తున్నామని ముక్తాయింపు ఇస్తున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్ళాలంటే సాధారణ రోజులలో రూ. 500 నంచి రూ. 600 వసూలు చేసే ప్రైవేట్ ఆపరేటర్లు పండుగ వేళ రూ. 2500 ల వరకు వసూలు చేస్తున్నారు. సాధరణ రోజులలో అయితే విమానం టికెట్ రూ. 1500 నుంచి రూ. 1800 వరకు పలుకుతుంది. ప్రైవేట్ ఆపరేటర్ల చార్జీలు విమానచార్జీలను మించిపోతున్నాయని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు.

### టోల్ ప్లాజాల వద్ద ప్రత్యేక కౌంటర్లు

పండగకు బస్సులు, రైళ్ళతో పాటు ప్రైవేట్ వాహనాలు కూడా గ్రామాల బాట పట్టాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచే వరంగల్, విజయవాడ, కర్నూలు రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల వద్ద రద్దీ తీవ్రమైంది. అదనపు రద్దీని ముందే ఊహించిన ప్లాజాల యాజమాన్యాలు సాధారణ రోజులలో ఉన్న గేట్లకు అదనపు గేట్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ రద్దీ తీవ్రంగానే కనిపిస్తోంది. ప్లాజాల వద్ద పరిస్థితిని అంచనా వేస్తున్న పోలీసులు అవసరమైతే టోల్ వసూలును నిలిపివేయాసని యాజమాన్యాలను ఆదేశించారు.

### టికెట్ ధరను పెంచిన రైల్వే శాఖ

సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ప్రయాణాల కోసం రైల్వే స్టేషన్‌లకు వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సెండాఫ్ ఇచ్చేందుకు వచ్చే వారిని కంట్రోల్ చేసేందుకు ప్లాట్ ఫాం టికెట్ ధరలను రైల్వే అధికారులు పెంచారు. సాధారణ రోజులలో ప్లాట్ ఫాం టికెట్ ధర రూ. 10 కాగా రద్దీ దృష్ట్యా రూ. 20 కి పెంచారు. ప్లాట్‌ఫాంలపై రద్దీని నివారించాలన్న ఉద్దేశ్యంతో ప్లాట్ ఫాం టికెట్ ధరను పెంచడం జరిగిందని అధికారులు అంటున్నారు.



# దక్షిణమధ్య రైల్వే విస్తృత ఏర్పాట్లు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు వీలుగా దక్షిణ మధ్య రైల్వే విస్తృత ఏర్పాట్లను చేసింది. హైదరాబాద్ నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని స్వస్థలాలకు వెళ్ళేందుకు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ స్టేషన్‌ల నుంచి విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్టణం, విజయనగరం, తిరుపతి తదితర పట్టణాలకు రాకపోకలు సాగించే 203 ప్రత్యేక రైళ్ళను జనవరి 25 వరకు నడపనుంది. ప్రత్యేక రైళ్ళలో రిజర్వేషన్ అవసరం లేని రెండవ తరగతి కలిగిన 60 జనసాధారణ్ రైళ్ళను ప్రవేశపెట్టారు. బస్ టికెట్ కంటే చవకైన ధరలతో కేవలం చివరి నిమిషంలో ప్రయాణం చేసే వారి కోసం అనుకూలంగా ఉండే జనసాధారణ్ ప్రత్యేక రైళ్ళకు మామూలుగా నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్ళ చార్జీలు వర్తించనున్నాయి. సువిధ ప్రత్యేక రైళ్ళతో సహా అన్ని ప్రత్యేక రైళ్ళకు రెండవ తరగతి సాధారణ బోగీలను జత చేసి మాములు ఎక్స్‌ప్రెస్ రైళ్ళ చార్జీలతో నడుపుతున్నారు. ప్రధాన స్టేషన్‌లలో అదనపు బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేశారు.



# జులై నుంచి గిరిజన వర్శిటీ తరగతులు

- జాకారంలోని యువజన శిక్షణా కేంద్రంలో నిర్వహణ
- స్థానిక విద్యార్థులకు 30% సూపర్ న్యూమరీ సీట్లు
- భూసేకరణ కోసం భూపాలపల్లి కలెక్టర్‌కు రూ. 10కోట్లు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఈ ఏడాది జూలై మొదలుకుని గిరిజన యూనివర్శిటీలో తరగతులు ప్రారంభం కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకు ముందుగానే అడ్మిషన్ల ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. ఒక్కో కోర్సులో 30 మంది విద్యార్థుల చొప్పున ఆరు కోర్సులను తప్పనిసరిగా ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై శుక్రవారం సచివాలయంలో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

గిరిజన సంక్షేమశాఖ, విద్యాశాఖ, అటవీ శాఖ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ అధికారులతో సమావేశమై చర్చించారు. గిరిజన యూనివర్శిటీలో స్థానిక గిరిజన విద్యార్థుల కోసం 30శాతం సూపర్ న్యూమరీ సీట్లను కేటాయించాలని ఆదేశాలు ఇచ్చారు. గిరిజన యూనివర్శిటీ ఆధ్వర్యంలో జాకారం వద్ద యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను నెలకొల్పి తరగతులను నిర్వహించాలన్నారు. అందుకు అనుగుణంగా సెంట్రల్ యూనివర్శిటీ అధికారులు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. బీఏ హోటల్ మేనేజ్‌మెంట్, బీసీఏ, ఎంసీఏ, ఎంబీఏ (మార్కెటింగ్, ప్యాకేజింగ్, ఫారెస్ట్ ప్రొడ్యూస్), బీబీఏ, మాస్టర్ ఇన్ ట్రైబల్ కల్చర్ కోర్సుల్లో తరగతులు ప్రారంభించాలన్నారు. యూనివర్శిటీ కాపౌండ్ వాల్ నిర్మాణ పనులను గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం చేపట్టాలని సీఎస్ ఆదేశాలిచ్చారు. భూ సేకరణకు సంబంధించి గిరిజన సంక్షేమశాఖ రూ.10 కోట్లను భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌కు మంజూరు చేయాలన్నారు. స్థానికంగా ఉన్న అటవీ భూముల్లో చట్టం నిబంధనలు అనుమతించిన మేరకు గిరిజన సంస్కృతికి సంబంధించిన కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. గిరిజన యూనివర్శిటీ కమిటీలో ఉన్నత విద్య, గిరిజన సంఓఏమం, అటవీ శాఖల ముఖ్య కార్యదర్శులను సభ్యులుగా చేర్చాలని జోషి ఆదేశాలు జారీ చేశారు.

ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి మహేష్ దత్ ఎక్కా, కమిషనర్ క్రిస్టీనా చోంగ్తు, భూపాలపల్లి కలెక్టర్ వెంకటేశ్వర్లు, అటవీశాఖ అదనపు ముఖ్య సంరక్షణాధికారి రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుడిని కలిసిన శివసాయి

- ఫిబ్రవరి మొదటి వారంలో శస్త్రచికిత్స

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రామగుండంకు చెందిన పోలియో బాధిత బాలుడు శివసాయి అపరేషన్‌కు సంబంధించిన పూర్తి బాధ్యతలు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రక్రియలో భాగంగా శుక్రవారం శివసాయి సికింద్రాబాద్‌లోని సన్‌షైన్ ఆస్పత్రి డాక్టర్ గురవారెడ్డిని కలిశాడు. బాలుడిని పూర్తి స్థాయిలో పరీక్షించిన డాక్టర్ ఫిబ్రవరి మొదటి వారంలో శస్త్ర చికిత్స చేస్తామని చెప్పారు. బాలుడు ఖచ్చితంగా నడుస్తాడన్న ధీమాను డాక్టర్ వ్యక్తం చేశారు. ఈ బాధ్యతను తనకు అప్పగించినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. జీహెచ్ఎంసీ నేత శ్రీనివాస్‌యాదవ్ ఆస్పత్రిలో పనులు తొందరగా పూర్తయ్యేనట్లు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



# శాసన మండలి ఎన్నికలపై ఈసీ కసరత్తు

- ఫిబ్రవరిలో నోటిఫికేషన్.. మార్చిలో ఎన్నికలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల సందడి కొనసాగుతుండగానే.. మరోవైపు శాసనమండలి సభ్యుల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలు పెట్టింది. జనవరి 30న పంచాయతీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఫిబ్రవరిలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. మార్చి 29నాటికి 8, మే 1 నాటికి ఒక ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియనుంది. ఆయా స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నహాలు మొదలు పెట్టినట్లుగా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా విజయం సాధించిన మైనంపల్లి హనుమంతరావు, పట్నం నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. వరంగల్ స్థానిక సంస్థల ద్వారా ఎమ్మెల్సీగా టీఆర్ఎస్ నుంచి గెలిచిన కొండా మురళీ కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కొండా మురళీ కూడా తన పదవికి రాజీనామా చేశారు. దీంతో శాసన మండలిలో మొత్తం 13 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్న నేపథ్యంలో వాటిని భర్తీ చేసేందుకు ఈసీ వేగవంతం చేసింది. ఫిబ్రవరి మూడో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి మార్చి రెండో వారం నాటికి ఎన్నికల ప్రక్రియను ముగించాలని భావిస్తున్నది. ఎమ్మెల్సీల పదవీ కాలం పూర్తి కావడానికి పది రోజుల ముందే కొత్త ఎమ్మెల్సీల ఎన్నిక ప్రక్రియ ముగియనుంది.

శాసనమండలికి సంబంధించిన 13స్థానాల ఖాళీలపై ఇప్పటికే స్పష్టత వచ్చింది. ఇక మరో మూడు స్థానాల్లో మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన రాములు నాయక్, ఆర్. భూపతిరెడ్డి, కె. యాదవరెడ్డిల సభ్యత్వాలను రద్దు చేయాలని టీఆర్ఎస్ పార్టీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు ఫిర్యాదు చేసింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నేతలు కోరారు. ఈ ముగ్గురు నేతలపై చర్యలు తీసుకుంటే మరో మూడు స్థానాలు ఖాళీ అవుతాయి. దీంతో ఇప్పటికే ఖాళీగా ఉన్న 13 స్థానాలతో పాటు మరో మూడు స్థానాలు ఖాళీ అయితే మొత్తం 16 స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయనుంది.

# పార్టీ మారిన ముగ్గురు ఎమ్మెల్సీలపై వేటుకు రంగం సిద్ధం

- స్వామిగౌడ్ ఎదుట విచారణకు హాజరైన రాములు నాయక్, న్యాయవాది శ్రీనివాస్
- రెండు గంటలకుపైగా వాద ప్రతివాదనలు
- నెల సమయం కోరిన రాములు నాయక్
- వేటువేస్తామంటూ హెచ్చరిక
- నేడు విచారణకు హాజరుకానున్న భూపతిరెడ్డి, యాదవరెడ్డి







**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్సీలపై వేటుకు రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికలకు ముందు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికైన రాములు నాయక్ తెరాసతో విభేదించి రాహుల్ గాంధీ సమక్షంలో ఆ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. నిజామాబాద్ జిల్లా నుంచి తెరాస తరఫున ఎమ్మెల్సీగా ఉన్న భూపతిరెడ్డి కూడా ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా ఇటీవలె శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ తరఫున ఎన్నికల బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. రంగారెడ్డి జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ఉన్న యాదవరెడ్డి చేవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డితో పాటు తెరాసకు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మారిన ఈ ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలని తెరాస శాసనసభాపక్షం శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై మండలి చైర్మన్ స్వామిగౌడ్ శుక్రవారం విచారణ చేపట్టారు. తొలిరోజు రాములు నాయక్ తరఫున ఆయన న్యాయవాది శ్రీనివాస్ విచారణకు హాజరయ్యారు. రాములు నాయక్ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారని తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదని వాదించారు. గవర్నర్ కోటాలో ఎంపికైన ఎమ్మెల్సీపై అనర్హత వేటు ఎలా వేస్తారని ఆయన ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే తాము సమాచార హక్కు చట్టం కింద ప్రభుత్వాన్ని పూర్తి వివరాలు అడిగామని, ఈ సమాచారం అందేందుకు మరింత సమయం పడుతుందని అందుకు విచారణను నెల రోజులపాటు వాయిదా వేయాలని న్యాయవాది శ్రీనివాస్ కోరినట్టు సమాచారం. అయితే ఎటువంటి వాయిదా వేసేది లేదని రాములు నాయక్‌పై అనర్హత వేటు వేస్తామని స్వామిగౌడ్ ప్రకటించినట్టు సమాచారం. రెండు గంటలపాటు సాగిన విచారణలో అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చాయని తెలుస్తోంది. 2016 జూన్ 23వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా ఉన్న ఫరూక్ హుస్సేన్ ఆ పార్టీకి రాజీనామా చేసి తెరాసలో చేరారని ఆ సమయంలో పార్టీ మారిన హుస్సేన్‌పై అనర్హత వేటు వేయాలని మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రాములు నాయక్ ఆరోపించారు. గిరిజన సామాజికవర్గానికి చెందిన వాడిని కావడంవల్లే కేసీఆర్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 20 ఏళ్ళ పాటు తెరాసకు ఎన్నో సేవలు చేశానని, అయినా తనపై నీచంగా వ్యవహరించిందని రాములు నాయక్ వాపోయారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ఎందుకు ప్రయోగించడానికి ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. తనపై అనర్హత వేటువేస్తే న్యాయ పోరాటం చేస్తానని హెచ్చరించారు. పార్టీ మారిన ఫరూక్ హుస్సేన్‌కు ఒక న్యాయం, తనకు ఒక న్యాయం ఉంటుందా అని ప్రశ్నించారు.భూపతిరెడ్డి, యాదవరెడ్డిపై తెరాస శాసనసభాపక్షం చేసిన ఫిర్యాదుపై శనివారం విచారణ జరగనుంది. మరో ఎమ్మెల్సీ కొండా మురళీపై అనర్హత వేటు వేయాలని ఫిర్యాదు చేసినా ఆయన తన పదవికి చేసిన రాజీనామాను మండలి చైర్మన్ స్వామిగౌడ్ ఆమోదించడంతో శనివారంనాటి విచారణకు ఆయన వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. భూపతిరెడ్డి, యాదవరెడ్డి తరఫున న్యాయవాదులు శనివారం నాటి విచారణకు హాజరై వాదనలు వినిపించే అవకాశం ఉంది. రాములు నాయక్ తరపున న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును మండలి చైర్మన్ స్వామిగౌడ్ రిజర్వులో పెట్టారు. భూపతిరెడ్డి, యాదవరెడ్డిల విచారణ పూర్తయ్యాక న్యాయ కోవిదులతో చర్చించి ఈ ముగ్గురిపై వేటువేస్తూ నోటిఫికేషన్ ప్రకటించే అవకాశం ఉంది. వీలైతే శనివారం సాయంత్రమే ఈ ప్రక్రియను ముగించాలని లేనిపక్షంలో ఆది, సోమవారాల్లో నోటిఫికేషన్‌ను జారీచేయాలని భావిస్తున్నట్టు సమాచారం. శాసనసభ కార్యదర్శి వేదాంతం నరసింహాచార్యులు కూడా విచారణలో పాల్గొన్నట్టు సమాచారం.

# 337 మంది బీసీ విద్యార్థులకు విదేశీ విద్యానిధి

**• రూ.53.23 కోట్లు మంజూరు • 10 దేశాల్లో ఉన్నత విద్యకు ఆర్థిక సాయం • యూనివర్సిటీలు మారుతున్న విద్యార్థులు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల(బీసీ)కు ప్రభుత్వం ప్రవేశపెట్టిన విదేశీ విద్యా నిధి ద్వారా 337 మంది విదేశాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. వారిలో ఇప్పటికే రెండో విడత నిధులను కూడా కొందరికి మంజూరు చేశారు. రెండేళ్లల్లోనే 337 మందిని విదేశాలకు పంపిం చినట్టు అధికారులు చెప్పారు. మహాత్మా జ్యోతిబాపూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా బీసీ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యను అందించ డం కోసం రూ. 20 లక్షలను ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ తరపున విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తోంది. అందులో భాగంగా 2016-17, 2017-18 విద్యా సంవ త్సరంలో రెండు సంవత్సరాల్లో కలిపి 337 మందిని ఎంపిక చేసినట్టు బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ అనితా రాజేంద్ర తెలిపారు.

### 1250 మంది దరఖాస్తు

రెండు సంవత్సరాలకు కలిపి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడం కోసం సుమారు 1250 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఇప్పటి వరకు 337 మందిని ఎంపిక చేసి వారికి రూ. 53,23, 88,794 మంజూరు చేశారు. వీరిలో కొందరికి రెండో ఇన్‌స్టాల్‌మెంట్ కూడా మంజూరు చేశారు.



### ఒక్కొక్కరికి రూ.20లక్షల పైనే..

విదేశీ విద్యానిధిని ప్రపంచ వ్యాప్తంగా 10 దేశాల్లో చదవడం కోసం నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. 10 దేశాల్లో అమెరికా, కెనడా, జర్మనీ, జపాన్, సింగపూర్, బ్రిటన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా దేశాల్లో పీజీ కోర్సులను చదవడం కోసం నిధులను మంజూరు చేస్తున్నారు. విదేశాల్లో విద్యానిధి కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు విమానఛార్జీలతో పాటు, వీసీ ఖర్చులను కూడా ప్రభుత్వమే మంజూరు చేస్తోంది. రూ. 20 లక్షలు కాకుండా అదనంగా ఛార్జీలు, వీసీ ఖర్చులు బీసీ సం క్షేమ శాఖ మంజూరు చేస్తోంది.

### యూనివర్సిటీలు మారినా ఆగని సాయం

వివిధ యూనివర్సిటీల్లో ఉన్నత విద్య కోసం దరఖాస్తు చేసుకుని విదేశాలకు వెళుతున్న విద్యార్థులు అక్కడికి వెళ్లిన తరువాత వారు యూనివర్సిటీ మారుతున్నారు. వెళ్లే సమయంలో ఆర్థికసా యం కోసం ఒక యూనివర్సిటీలో ఒక కోర్సును చదవడం కోసం వెళుతున్నట్టు దరఖాస్తు చేస్తా రు. ప్రభుత్వం వారిని ఎంపిక చేసిన తరువాత వారు ఆ యా దేశానికి వెళుతున్నారు. వెళ్లిన తరువాత మొదటి సెమిస్టర్ పూర్తికాక ముందే ఆ యూనివర్సిటీ నచ్చక మరొక యూనివర్సిటీకి మారుతున్నారు. దీంతో వారికి రెండో సంవత్సరంలో నిధులు ఇవ్వడానికి బీసీ సంక్షేమ శాఖ ఇబ్బంది పడాల్సివస్తోంది. ఇలా మారిన సంద ర్భంలో విద్యార్థులకు అధికారులు ఫోన్ చేసి సంప్రదిం చగా వారు తాము యూనివర్సిటీ మారామని చెబుతున్నారు. దీంతో విదేశాలకు పంపించిన తరువాత వారి చదువు మధ్యలో ఆగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం వారికి మిగిలిన నిధులను కూడా మంజూరు చేస్తున్నారు.

### నిధులను పెంచాలి..

బీసీ, ఈబీసీలకు కలిపి విదేశీ విద్యానిధిని అమలు చేస్తున్నారు. ఏడాదికి కేవలం 300 మందికి మాత్రమే ఎంపిక చేయాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. బీసీలు జనాభాలో 54 శాతంగా ఉన్నారు. వీరికి తోడు ఈబీసీ విద్యార్థులను కూడా ఇందులో చేర్చడంతో దరఖాస్తు చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం విదేశాలకు పంపించే వారి సంఖ్యను పెంచడంతో పాటు.. కేటాయించే నిధులను కూడా పెంచాలని విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### 16 నుంచి దరఖాస్తులు

మహాత్మాజ్యోతిబా పూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధికి సంబంధించి దరఖాస్తులను 16 నుంచి స్వీకరించనున్నట్టు బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ అనితా రాజేంద్ర తెలిపారు. దరఖాస్తులను ఫిబ్రవరి 15 వరకు స్వీకరించనున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్ప్రింగ్‌సీజన్(వసంత) కాలానికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. అర్హతలున్న బీసీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# పల్లెల అభివృద్ధే లక్ష్యం

**• స్థానిక సంస్థలకు భారీగా నిధులు**

**• ప్రత్యేకంగా రూ.1500 కోట్లు కేటాయింపు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్ర ఖజానాకు సమకూరిన స్థానిక పన్ను ఆదాయాలనుంచి తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎప్పటికప్పుడు నిధులను మళ్లీస్తోంది. సకాలంలో నిధులను బదలీ చేసి సమగ్ర గ్రామీణాభివృద్ధికి తెలంగాణ సర్కార్ రాష్ట్ర ఆవిర్భావంనుంచే కృషి చేస్తోంది. 2014-15నుంచి 2017-18 ఆర్థిక ఏడాది వరకు వివిధ శాఖలద్వారా స్థానిక పన్నులు, పన్నేతర ఆదాయాల రూపంలో భారీగా నిధులురాగా సింహ భాగం గ్రాంట్‌ల రూపంలో పంపిణీ పూర్తి చేసి గ్రామీణ సాధికారితకు పెద్ద పీట వేసింది. 2014-15లో పన్నుల రూపంలో రూ. 6446కోట్లు, 2015-16లో రూ. 14,414 కోట్లు, 2016-17లో రూ. 9781కోట్లు సమకూరగా స్థానిక సంస్థలకు సెస్‌లు, గ్రాంట్‌ల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులను మళ్లించి వాటి ఆర్థిక బలోపేతానికి అండగా నిల్చింది. 2014-15నుండి పంచాయతీరాజ్‌కు సీనరేజీ ద్వారా రూ. 3336కోట్ల ఆదాయం, 2017-18 వరకు అందజేసినట్లు తేలింది. రూ. 57.83కోట్ల నిధులను స్థానిక సంస్థలకు బదలీ చేశారు. మరో రూ. 2169 కోట్ల నిధులు బదలాయించాల్సి ఉన్నట్లుగా ఆర్థిక శాఖ పేర్కొంది.

ట్రాన్స్‌ఫర్ ఆఫ్ అసైన్డ్ రెవెన్యూ లోకల్ బాడీస్ వివరాలను గమనిస్తే 2014-15నుండి 2017-18 వరకు రూ. 2907 కోట్లు వసూలుకాగా స్థానిక సంస్థలకు రూ. 2794 కోట్లను కేటాయించారు.

రూ.112 కోట్లు కేటాయించాల్సి ఉంది. కాగా సీఎం కేసీఆర్ కూడా స్వయంగా పంచయతీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేకంగా రూ. 1500కోట్ల నిధిని కేటాయించాలని నిర్ణయించారు. ఆయా నిధులన్నీ ఆర్థిక సంఘం ద్వారా పంపిణీ చేసి సమన్వయం చేయనున్నారు.



# ఎర్రవల్లిలో మరో యాగం

**చతుర్వేద పురస్సర మహారుద్ర సహస్ర చండీయాగం**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** చండీయాగంతో సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే నమ్మకంతో మరో యాగానికి సిద్ధమవుతున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సకల సంపదలతో దేశంలోనే అగ్రగామిగా నిలవాలన్న ఆకాంక్షతో చతుర్వేద పురస్సర మహారుద్ర సహస్ర చండీయాగానికి ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రం ముస్తాబైంది. 200 మందికిపైగా రుత్విక్‌లతో ముఖ్యమంత్రి మహారుద్ర సహిత చండీయాగాన్ని చేయనున్నారు. ఈనెల 21 నుంచి 25 వరకు ఐదు రోజులపాటు నిరాటంకంగా ఈ యాగం కొనసాగుతుంది. అందుకోసం వ్యవసాయ క్షేత్రంలో వైభవాన్ని తలపించేయాగశాలను నెలకొల్పారు. తెలంగాణలో సకాలంలో వర్షాలు పడాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలన్న ఆకాంక్షతో కేసీఆర్ ఈ యాగానికి పూనుకున్నట్టు అధికార పార్టీవర్గాలు తెలిపాయి. బంగారు తెలంగాణ కలను సాకారం చేసేలా అమ్మవారి అనుగ్రహం కోసం ఈ యాగంలో భాగంగా సహస్ర హోమాలు నిర్వహించనున్నారు. యాగశాల నిర్మాణం, ఇతర ఏర్పాట్లు, వీవీఐపీల ఆహ్వానం తదితర అంశాలను సీఎం కేసీఆర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రతిష్టను దేశం నలుమూలలకు ప్రతిబింబించేలా సహస్ర చండీయాగాన్ని నిర్వహించి రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉండాలన్న తపనతోనే భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ యాగానికి పండితులు, యోగులు, స్వామీజీలు, పీఠాధిపతులను కేసీఆర్ ఆహ్వానిస్తున్నారు. ఈనెల 25న యాగం ఆఖరు రోజుకు పూర్ణాహుతి ఉంటుందని సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి.

# సుందరంగా దాదాగిరి



(మొదటిపేజీ తరువాయి)

గ్రూపులు కూడా నిర్వహిస్తోంది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన మల్లిబాబు అనే ఓ ప్రభుత్వోద్యోగి సుందరం ఫైనాన్స్ గుప్పెట చిక్కి విలవిల్లాడుతున్నాడు. ఆయనిప్పటి ఆస్తులే కాదు. గతంలో ఆయన అమ్మేసిన భూముల్ని కూడా కొనుగోలుదార్ల ప్రమేయం ఏమాత్రం లేకుండానే సుందరం ఫైనాన్స్ స్వాధీనం చేసుకునే ప్రక్రియ మొదలెట్టింది. దీనిపై కొనుగోలుదార్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుందరం ఫైనాన్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌తో సహా కీలక నిర్వాహకులందరిపై చీటింగ్ కేసులు నమోదు చేశాడు.

దేశంలో ఫైనాన్సింగ్, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్ కంపెనీలు ప్రజల్ని ఏ విధంగా, ఎంతగా దోచుకుంటున్నాయో వివరించేందుకు ఆంధ్రప్రభ పాఠకులకు ఈ కథనాన్ని యదావిధిగా అందిస్తోంది.

తూర్పుగోదావరి జిల్లా నేమాంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న మల్లిబాబు చిన్న ప్రభుత్వోద్యోగి 2007లో ఓ చిన్నకారు కొని కుటుంబానికి అందుబాటులో పెట్టాలనుకున్నాడు. ఇందుకోసం సుందరం ఫైనాన్స్ సంస్థను ఆశ్రయించాడు. లబ్ధిదారుని వాటాధనం మల్లిబాబు చెల్లించగా మిగిలిన మొత్తానికి సుందరం సంస్థ ఫైనాన్స్ చేసింది. ఈ మొత్తాన్ని నెలవారీ పద్దులుగా మల్లిబాబు తిరిగి చెల్లించేశాడు. దీంతో ఇక అప్పుడు తీరిపోయిందని ధీమాగా ఉన్నాడు. ఈ దశలో సుందరం ఫైనాన్స్ తనకింకా వడ్డీ బకాయి ఉన్నాడని, ఆ వడ్డీపై వడ్డీ, దానిపై అపరాదరుసుం అంటూ మొత్తం 40వేలకు నోటీసులు జారీ చేసింది. అలాగని దీనిపై నేరుగా మల్లిబాబును చర్చలకు పిలవలేదు. కేంద్రం ప్రైవేటు ఆర్థిక వ్యవస్థ వెసులుబాటు కోసం ఏర్పాటు చేసిన ఆర్బిట్రేషన్ కోర్టులో ఏకంగా కేసు దాఖలు చేసేసింది. ఈ కోర్టు ఈ 40వేలకు తిరిగి వడ్డీలు, అపరాద రుసుం అంటూ దీనిపై 1.70లక్షలకు డిక్రీ ఇచ్చేసింది. ఈ మొత్తాన్ని కూడా మల్లిబాబు నుంచి వసూలు చేసేందుకు సుందరం సంస్థ ఆసక్తి చూపలేదు. కారు ఫైనాన్సింగ్ సమయంలో మల్లిబాబు స్థిరచరాస్తుల వివరాల్ని తీసుకున్న సుందరం సంస్థ ఆస్తుల వివరాల్లో ఉన్న ఎకరంన్నర భూమి స్వాధీనానికి డిక్రీ ఇవ్వాలంటూ కోర్టులో పిటీషన్ వేసి సాధించుకుంది. వాస్తవానికి 2007లా సుందరం సంస్థ వద్ద మల్లిబాబు కారు ఫైనాన్స్ చేయించాడు. అతనికి అంతకుముందెప్పుడో ఉన్న ఎకరంన్నర భూమిలో ఎకరం భూమిని ఇతరులకు అమ్మేశాడు. ఈ విషయాన్ని కూడా 2007లో కారు ఫైనాన్స్ సమయంలో అందించిన రికార్డుల్లో మల్లిబాబు స్పష్టంగా పేర్కొన్నాడు.తనకున్న భూమి అరఎకరంగానే చూపాడు. అయితే సుందరం సంస్థ రికార్డుల్ని కూడా తారుమారు చేసింది. తప్పుడు ఇసిలను సృష్టించింది. మల్లిబాబు పేరిట ఎకరంన్నర భూమి యదావిధిగా ఉన్నట్లుగా నకిలీ ధృవీకరణ పత్రాల్ని కోర్టుకు సమర్పించింది. ఈ మేరకు డిక్రీ పొందింది. ఆర్బిట్రేషన్ కోర్టు ఇచ్చిన ఆదేశాల్ని జిల్లా కోర్టులు యదావిధిగా అమలు చేయాల్సిన పరిస్థితుంది. దీంతో తూర్పుగోదావరిజిల్లా కాకినాడ రూరల్ మండల పరిధిలోని మల్లిబాబుకు చెందిన అరఎకరంతో పాటు 2002లోనే అతను అమ్మేసిన ఎకరం భూమిని కలిపి స్వాధీనం చేసుకునే ప్రక్రియకు సుందరం ఫైనాన్స్ శ్రీకారం చుట్టింది. దీంతో ఎకరం భూమి కొనుగోలుదార్లు అడ్డంపడ్డారు. తమ భూమిపై తప్పుడు ధృవీకరణ పత్రాలు తెచ్చారని తెలుసుకున్నారు. వెంటనే కోర్టును ఆశ్రయించారు. న్యాయ ప్రక్రియ ఓ వైపు సాగుతుంటే సుందరం సంస్థ తన రౌడీలు, గుండాల్ని బరిలో దింపింది. ఈ భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది.

కొనుగోలుదార్లు సామాజికంగా, రాజకీయంగా శక్తివంతులు కావడంతో వార్నుంచి సుందరం సంస్థ ఈ ఎకరం భూమిని స్వాధీనంచేసుకోలేక పోయింది. అదే సాధారణ వ్యక్తులైతే ఈ పాటికి ఈ భూమి సుందరం సంస్థ పరమయ్యేది. దేశంలో ప్రైవేటు ఆర్థిక బీమా సంస్థల్ని ప్రోత్సహించాలన్న సదాశయంతో ప్రభుత్వం వీటికి కొన్ని వెసులుబాట్లు కల్పిస్తే ఫైనాన్స్ సంస్థలు ఈ వెసులుబాటును దుర్వినియోగం చేసుకుంటూ ప్రజల్ని పీడిస్తున్నారు. రుణగ్రహీతల పాలిట యమకింకర్లుగా మారుతున్నాయి. వారి స్థిర, చరాస్తుల్ని కబళిస్తున్నాయి.

తాతలకాలం నాటి వారసత్వ సంపదల్ని దోచేస్తున్నాయి. చిన్న చిన్న అప్పుల కోసం వీటి తలుపులు తడుతున్న వినియోగదార్లను నిట్టనిలువునా దోచేస్తున్నాయి. ఈ సంస్థలు చట్టబద్ధమైన రీతిలో వడ్డీల రూపంలో ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సుంది. కానీ అందుకు భిన్నంగా ఆస్తుల్ని కబళిస్తూ పెద్దెత్తున సంపద కూడేస్తున్నాయి. సమాంతర ఆర్థిక వ్యవస్థను నిర్వహించే స్థాయికి చేరుకుంటున్నాయి. వీటి ఆగడాల్ని, అక్రమ విధానాల్ని అరికట్టని పక్షంలో ఇవి సమాజానికి మరింత శత్రువులుగా మారిపోనున్నాయి. దోపిడీ వ్యవస్థలుగానే కొనసాగుతాయి. వీటికిచ్చిన వెసులుబాట్లను ప్రభుత్వాలు సమీక్షించాలి. అలాగే వీటిపై స్పష్టమైన నియంత్రణ చర్యలు కూడా చేపట్టాలని సామాజిక నిపుణులు సూచిస్తున్నారు.

# 14 ఎమ్మెల్సీ సీట్లు అసెంబ్లీ తర్వాత అభ్యర్థులు

(మొదటిపేజీ తరువాయి)

ముగుస్తోంది. ఈ మూడు స్థానాల్లో ఎవరిని ఎంపిక చేస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది. తెరాస అధినేత కేసీఆర్ ఎవరికి అవకాశం ఇస్తారన్న విషయంలో చర్చోపచర్చలు సాగుతున్నాయి. పాతూరి సుధాకర్‌రెడ్డికి మరో అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతుండగా, అధినాయకత్వం కూడా ఆయనవైపే మొగ్గు చూపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ విషయంలో తెరాస రెండు ప్రతిపాదనలు తెరపైకి తీసుకువస్తున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్సీగా మరో దఫా అవకాశం ఇవ్వాలా లేక చేవెళ్ళ లోక్‌సభ నుంచి ఆయనను అభ్యర్థిగా నిలబెట్టాలా అన్న అంశంలో పార్టీలో చర్చ జరుగుతోంది. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి సబిత తెరాసలో చేరితే ఆమె తనయుడు కార్తీక్‌రెడ్డిని చేవెళ్ళ నియోజకవర్గం నుంచి తెరాస అభ్యర్థిగా బరిలోకి దింపే అవకాశాలు లేకపోలేదని అప్పుడు ఎమ్మెల్యే కోటాలో స్వామి గౌడ్‌ను ఎమ్మెల్సీగా ప్రతిపాదించే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### మల్కాజ్‌గిరికి మైనంపల్లి రాజీనామా

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఎమ్మెల్సీ పదవికి మైనం పల్లి హనుమంతరావు రాజీనామా చేశారు. దీంతో ఈ స్థానం ఖాళీగా ఉంది. దీనికి తోడు ఎమ్మెల్యే కోటాలో మరో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కాబో తున్నాయి. మహమూద్ అలీకి మరోసారి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకా శం దక్కనుంది.కేసీఆర్‌కు ప్రత్యేకాధికారిగా పనిచేసిన దేశపతి శ్రీనివాస్‌ను ఈ కోటాలో ఎంపిక చేయాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమా చారం. కేసీఆర్‌కు రాజకీయ సలహాదారుగా ఉన్న ఆయన సన్నిహితులు శేరి సుభాష్‌రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి ఆకుల లలితతో పాటు తెరాసలో చేరిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ సంతోష్ కుమార్‌కు మరో సారి ఎమ్మెల్సీ అవకాశం ఖరారైనట్టేనని తెరాసలో ప్రచారం జరుగుతోంది.

### నాలుగు నియోజకవర్గాలకు తీవ్ర పోటీ

మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ పదవికి పోటీ తీవ్రంగా ఉంది. గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్‌తో పాటు సంగారెడ్డికి చెందిన మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, కరీంనగర్ నగర మేయర్ రవీందర్ సింగ్, సరోజిని కంటి ఆసుపత్రి విశ్రాంత సూపరింటెండెంట్ లయన్ డాక్టర్ రవీందర్ గౌడ్ ఎమ్మెల్సీగా పోటీచేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈ నలు గురు ఎవరికి వారే తమ అభ్యర్థిత్వాలు ఖరారయ్యాయని తెరాస అధినేత కేసీ ఆర్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎమ్మెల్సీగా పోటీకి దిగేందుకు తమకు హామీ ఇచ్చారని ప్రకటించుకుం టున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇటీవల నిర్వహించిన కంటి వెలుగు కార్య క్రమంలో రవీందర్ గౌడ్ విశేష సేవలు అందించారని, లయన్స్ క్లబ్‌లో కీలకంగా పని చేసి ఎన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహిం చిన ఆయనకు ఈ పదవిని కట్టబెట్టాలని వైద్యుల సంఘం ఇప్పటికే కేటీఆర్‌ను కలిసి కోరినట్టు సమా చారం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పూల రవీందర్ విషయంలో సంబంధిత ఉపా ధ్యాయ సంఘం ప్రతిపాదనలు వస్తే ఆయన పేరును పరిశీలించాలని తెరాస నిర్ణయించింది. పీఆర్‌టీయూ తరపున గతంలో ఆయన ఎమ్మెల్సీగా బరిలోకిదిగి విజయం సాధించారు. ఆ తర్వాత తెరాసలో చేరారు.

### చెన్నూర్ నుంచి ఓదేలుకు అవకాశం!

చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా నాలుగున్నరేళ్లపాటు కొనసాగి ప్రభుత్వ విప్‌గా పనిచేసిన నల్లాల ఓదేలుకు కూడా ఎమ్మెల్యే కోటాలోనే ఎమ్మెల్సీ పదవి ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెద్దపల్లి ఎంపీగా ఉన్న బాల్క సుమన్‌కు చెన్నూరు అసెంబ్లీ టికెట్‌ను కేటాయించిన సంగతి తెలిసిందే. అభ్యర్థులను ప్రకటించేసమయంలో ఓదేలు కేసీఆర్‌ను కలిసి తన రాజకీయ భవిష్యత్తు ఏంటని అడిగిన సమయంలో ఎమ్మెల్సీ పదవిని ఇస్తానని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగానే ఓదేలుకు ఎమ్మెల్సీ ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

### ఇప్పటికే 3 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ

స్థానిక సంస్థల కోటాలో మూడు ఎమ్మెల్సీ స్థానాలు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. నల్గొండ జిల్లా స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా కొనసాగిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ఉన్న పట్నం నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడంతో వారు తమ పదవులకు రాజీనామా చేశారు. రాజగోపాల్‌రెడ్డి మునుగోడు, నరేందర్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసి గెలుపొందిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి, తాండూరు మాజీ ఎమ్మెల్యే పట్నం మహేందర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీకి దిగే అవకాశం కనిపిస్తోంది. ఒకవేళ కాదనుకుంటే ఆయనను చేవెళ్ళ లోక్‌సభ బరిలోకి దింపే అవకాశాలు లేకపోలేదని తెరాస వర్గాలు చెబుతున్నాయి. వరంగల్‌లో కొండా మురళీ స్థానంలో పోచంపల్లి శ్రీనివాసరెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తుండగా, ఈ పదవి కోసం జిల్లాకు చెందిన ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు పోటీ పడుతున్న వారిలో ఉన్నారు. గతంలో ఆయన వరంగల్ స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా పోటీచేసి ఏకగ్రీవంగా విజయం సాధించారు. నల్గొండ స్థానిక సంస్థల నుంచి కోదాడకు చెందిన శశిధర్‌రెడ్డి ఇదే నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. కోదాడ అసెంబ్లీ ఎన్నికల్లో చివరిదాకా టికెట్‌ను ఆశించి భంగపడ్డ శశిధర్‌రెడ్డి ఈ దఫా ఎమ్మెల్సీ పదవి తనకేనని భావిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి తెదేపాలో ఉండి తెరాసలో చేరిన బొల్లం మల్లయ్య యాదవ్‌కు అభ్యర్థిత్వం ఖరారుచేసి పోటీకి పెట్టిన విషయం తెలిసిందే. నిజామాబాద్ జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ఉన్న భూపతిరెడ్డి తెరాసను వీడి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ ఫిరాయించిన భూపతిరెడ్డిపై అనర్హత వేటు వేయాలని తెరాస శాసనసభాపక్షం మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. కమ్మ సామాజికవర్గం నుంచి ఒకరిని ఎమ్మెల్సీగా ఎంపిక చేయాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. తుమ్మల, బండి రమేష్, మరో నేత తాతా మధు పేర్లు పరిశీలనలో ఉన్నాయి.





**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** వికారాబాద్ జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీలో వార్డుల సంఖ్యను పెంచాలని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావును కోరారు. అలాగే ఎంఎంటీఎస్ రైలును వికారాబాద్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ప్రగతి భవన్‌లో సీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కూడా ప్రగతి భవన్‌లో కేసీఆర్‌ను కలిశారు.

# సీఎంకు కొత్త కాన్వాయ్

(మొదటిపేజీ తరువాయి)



ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే అప్పటివరకు కొనసాగిన మహీంద్రా స్కార్పియో వాహణ శ్రేణిని తొలగించారు. వాటిని చివరి ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వినియోగించారు. వాటిని వద్దనుకున్న కేసీఆర్ 2014లో టయోటా ఫార్చ్యూనర్, ఒక టయోటా ప్రాడో కారుతో కొత్త కాన్వాయ్‌ను ఏర్పాటు చేశారు. రెండోసారి ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్ కాన్వాయ్‌లో అన్ని కార్లు ఒకే రకంగా, ఒకే కంపెనీవి ఉండాలని ఇంటెలిజెన్స్ శాఖ సూచించింది. అన్ని ఫార్చ్యూనర్లు, సీఎం ప్రయాణించే ఒకే వాహనం టయోటా ప్రాడో కావడంతో గుర్తుపట్టడం సులువవుతుందని భద్రతా కారణాల దృష్ట్యా ఇది మంచిదికాదని ఇంటెలిజెన్స్ అధికారులు నివేదించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఫార్చ్యూనర్ కార్ల స్థానంలో కొత్తగా ఇతర కార్లను చేర్చాలని నిర్ణయించింది. దీంతో ఇంటెలిజెన్స్, సాధారణ పరిపాలనా శాఖలు పలు కంపెనీలకు చెందిన రకరకాల కార్లను పరిశీలించారు. తొలుత భద్రత, లగ్జరీకి చిహ్నమైన మెర్సిడెస్ బెంజ్ కార్లను కొనుగోలు చేయాలని భావించారు. మెర్సిడెస్, ఆడీ, జాగ్వార్ కార్లు ఉపయుక్తం కావని భావించి చివరకు టయోటా ప్రాడో కార్లను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఇందుకు 7 నుంచి 10 టయోటా ప్రాడో కార్లను కొనుగోలు చేయాలని యోచిస్తున్నారు. దీని ధర ప్రస్తుతం హైఎండ్ మోడల్ సుమారు రూ. 93 లక్షలకు పైగా ఉంది. వీటికి అదనంగా ఒక్కో కారుకు మైన్, బుల్లెట్ ప్రూఫింగ్ చేయించాల్సి రానుంది. ఇందుకు పుణెలోని రక్షణ శాఖ నేతృత్వంలో ఈ పనిని పూర్తిచేస్తారు. ఇందుకు ఒక్కో కారు ధరలో దాదాపుగా సగం వ్యయం అదనంగా ప్రూఫింగ్‌కే ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే కేసీఆర్‌కు అధునాతన మినీ బస్సుతోపాటు ఫార్చ్యూనర్, ప్రాడో వాహన కాన్వాయ్ ఉంది. తాజాగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కూడా సీఎం కేసీఆర్ కోసం ఒకకాన్వాయ్ సిద్ధం చేయాలని ప్రతిపాదనలు రూపొందించారు. ఆయన ఫెడరల్ ఫ్రంట్ పేరుతో దేశంలోని అనేక రాష్ట్రాల్లో పర్యటించిన సందర్భాల్లో అదనంగా ఉండే వాహన కాన్వాయ్‌ను వాడాలని భావిస్తున్నారు. కొత్తకాన్వాయ్‌కు రూ.13 కోట్లకుపైగా ఖర్చు కానున్నట్లు సమాచారం.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 12 జనవరి 2019

# ఓటమి దెబ్బతో జిఎస్‌టి తగ్గింపు!

వస్తు, సేవా పన్ను (జిఎస్‌టి ) పన్ను మినహాయింపు పరిమితిని 20 లక్షల రూపాయిల నుంచి 40 లక్షల రూపాయిల వరకూ పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశంలో లక్షలాది మంది చిన్న వ్యాపారులకు ఊరట కలిగిస్తుంది. లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ జనాకర్షక పథకాలు, చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం వేగాన్ని పెంచింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం పెద్ద పారిశ్రామిక వేత్తలూ, కార్పొరేట్ శక్తుల కొమ్ము కాస్తుందనే అపవాదును తొలగించుకునేందుకు ప్రధాని నరేంద్రమోడీ చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. అగ్రవర్ణాల్లో పేదలకు పదిశాతం రిజర్వేషన్లకు పట్టుపట్టి పార్లమెంటు ఆమోద ముద్ర వేయించిన వెంటనే ప్రభుత్వం ఈ చర్య తీసుకున్నదంటే లోక్‌సభ ఎన్నికలను బిజెపీ ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోందో వేరే చెప్పనవసరం లేదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో పరాజయం పాలు కావడంతో లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఓటమి తప్పదేమోనన్న భీతి కమలనాథులను వెంటాడుతోంది. ఈ మూడు రాష్ట్రాల్లో పది పదిహేనేళ్ళుగా అధికారంలో కొనసాగుతున్న బిజెపి పట్ల సాధారణంగా ఉండే ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి ప్రభావం ఎక్కువగా పని చేసింది. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ తోసి పుచ్చినా, వాస్తవాన్ని మరుగున పర్చలేరు. జిఎస్‌టి సాలుసరి మినహాయింపు 40 లక్షలకు పెంచడం వల్ల సూక్ష్మ, లఘు, మధ్యతరగతి (ఎంఎస్‌ఎంఈ) రంగానికి చెందిన వారు ఎక్కువగా నష్టపోయారు. ఈ రంగానికి చెందిన వేలాదిమంది తమ సంస్థలు మూతబడటంతో పెద్ద మాల్స్‌లో సేల్స్‌మన్ ఉద్యోగాలుగా మారిపోయారు. తక్కువ లాభాలతోనైనా ఇంతవరకూ గౌరవప్రదంగా జీవనం సాగించిన వారంతా పెద్ద సంస్థల్లో ఉద్యోగులుగా చేరిపోవడం వల్ల వారిలో ఆత్మస్థయిర్యం దెబ్బతింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ ఎన్నికలలో చిన్న వ్యాపారులూ, వారి కుటుంబ సభ్యులంతా బిజెపీకి వ్యతిరేకంగా ఓటు వేశారు. జిఎస్‌టి మినహాయింపుపై ప్రభుత్వం ఇంత హడావుడిగా నిర్ణయం తీసుకోవడానికి అసలు కారణం ఇది. రాజకీయ ప్రయోజనం ఉంటేనే ఏ ప్రభుత్వమైనా ఇలాంటి నిర్ణయాలను వేగంగా తీసుకుంటుంది. అయితే, ఇది తమ పోరాట ఫలితమంటూ కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం చేసిన ప్రకటనలో కూడా రాజకీయ లాభాపేక్ష ఉంది. దీనికి తోడు ఒక శాతం కాంపోజిషన్ స్కీమ్ టర్నోవర్ పరిమితిని 1.5 కోట్లుగా గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. కాంపోజిషన్ స్కీము కింద 50 లక్షల రూపాయిల ఆదాయానికి ఆంరు శాతం పన్నుచెల్లిస్తే సరిపోతుంది. ఈ నిర్ణయం ఏప్రిల్ నుంచి అమలులోకి వస్తుంది. కనీవినీ ఎరుగని వరదల్లో తీవ్రంగా నష్టపోయిన కేరళకు ఒక శాతం సెస్సు విధించుకునే అవకాశాన్ని జిఎస్‌టి మండలి కేరళ ప్రభుత్వానికి కల్పించింది.

రియల్ ఎస్టేట్‌పై జిఎస్‌టి రేటు విషయంలో ఏడుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించాలన్న నిర్ణయం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఊరట కలిగిస్తుంది.ప ర్వత ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలలో మినహాయింపు పరిమితిని పది నుంచి 20 లక్షలకు జిఎస్‌టి మండలి పెంచింది. ఈ మినహాయింపుల వల్ల ప్రభుత్వానికి వచ్చే రాబడి 5,200 కోట్ల మేర తగ్గినప్పటికీ ఎంఎస్‌ఎంఈలు, సేవలు వర్తకులకు మేలు చేకూరుస్తాయని ప్రధాని నరేంద్రమోడీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయాన్ని తీసుకున్నప్పటికీ ప్రభుత్వానికి రాబడి తగ్గినా, ప్రజాప్రయోజనమే ముఖ్యమని ఆయన అనడంలో గడుసుదనం ఉంది. జిఎస్‌టి పన్ను రేట్లను ప్రభుత్వం దశలవారీగా తగ్గిస్తూ వచ్చింది. ఇది కూడా తమ పార్టీ పోరాట ఫలితమేనంటూ చిదంబరం చేసిన వ్యాఖ్యని తోసి రాజనలేం అలాగే, జిఎస్‌టి ఆలోచన తమ పార్టీదేనంటూ చిదంబరమే కాకుండా ఇటీవల పలు సభల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా పలు సభల్లో స్పష్టం చేశారు. తమ పార్టీ అయితే, గందరగోళం లేకుండా మొదటి నుంచి వ్యాపార వర్గాలకు అనుకూలమైన రీతిలో జిఎస్‌టిని అమలు జరిపి ఉండేదంటూ చిదంబరం చేసిన ప్రకటన కూడా రాజకీయ లబ్ధితో కూడినదే. అప్పట్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి ఈ సంస్కరణలను అమలుజేసి ఉంటే బిజెపీ అధికారంలోకి వచ్చే అవకాశమే ఉండేది కాదు. అయితే, అప్పట్లో అధికారంలో ఉన్న యూపీఏ కూటమికి నేతృత్వం వహించిన కాంగ్రెస్‌కు సొంత బలం లేకపోవడం వల్ల ప్రాంతీయ, చిన్నపార్టీల ఒత్తిడులకు లోను కావల్సి వచ్చేది. అంతేకాక చిన్న, మధ్యతరహా వ్యాపారులకు పది లక్షల రూపాయిల మేరకు బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు యత్నాలు జరుగుతున్నాయి. ఇది తమకు మోడీ ఇచ్చిన సంక్రాంతి కానుకగా ఈ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఈ పథకాన్ని అమలు జేస్తోంది. మధ్యతరగతి, నిరుపేద వర్గాలకు తాయిలాలను ప్రకటించే ప్రక్రియను రానున్న మూడు మాసాల్లో మోడీ మరింత తీవ్రతరం చేయవచ్చు. శనివారం ఢిల్లీలోని రామలీలా మైదానంలో ప్రారంభమైన బిజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో బిజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఈ కార్యక్రమాలన్నింటినీ ఏకరవు పెట్టి, గడిచిన 60 సంవత్సరాలుగా కాంగ్రెస్, తదితర పార్టీలు పేదలకు సాయమందించే విషయంలో చొరవ తీసుకోలేదనీ, లోక్‌సభలో పూర్తి మెజారిటీ తమ పార్టీకి ఉన్నప్పటికీ, సంకీర్ణ ధర్మాన్ని పాటించి అందరినీ కలుపుకుని పోతున్నామని అన్నారు. జిఎస్‌టి రేట్లు తగ్గింపు, మినహాయింపు పరిమితి పెంపుతో వ్యాపార వర్గాలన్నీ ఇక తమ పార్టీకే మద్దతు ఇస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు తమ ప్రభుత్వాన్ని విమర్శించే అవకాశం ఇవ్వబోమని ఆయన స్పష్టం చేసినప్పటికీ, కాంగ్రెస్ చేతిలో రాఫెల్ అస్త్రం మిగిలిన అన్ని అస్త్రాల కన్నా పదునైనది, శక్తివంతమైనది. అయితే, కాంగ్రెస్ నాయకుల అపరిపక్వత వల్ల ఆ అస్త్రాన్ని ఎప్పుడు ఎలా ప్రయోగించాలో తెలియక, అధికార పార్టీ విమర్శలకు గురి అవుతున్నారు. రానున్న రోజుల్లో విమర్శలూ, ఆరోపణలను ఇరువర్గాలు మరింత పదునుగానూ, తీవ్రంగానూ చేసుకునే అవకాశం ఉంది.

# అసోంలో మరోసారి ఆసు ఉద్యమం!




అసోంలో మళ్ళీ పౌరసత్వ అంశం తెరమీదికి వచ్చింది. రాష్ట్రంలో విదేశీయుల సమస్య రాజకీయ నాయకులకు ఒక అస్త్రంగా ఉపయోగపడటం ఇది కొత్త కాదు. బహుశా చివరిసారి కూడా కాబోదు. ఈ అంశానికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు అస్సామీ సాహితీవేత్త హిరైన్ గొహైన్, స.హ.కార్యకర్త అఖిల్ గొగొయ్, సీనియర్ పాత్రికేయుడు మణ్‌జిత్ మహంతాలపై రాజద్రోహ నేరం కింద కేసు నమోదు అయింది. ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించిన వెంటనే అమలులోకి వచ్చింది. ఈ బిల్లుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ ) ఆమోదం తెలిపింది. బిల్లు ముసాయిదాను ఎటువంటి సవరణలు లేకుండానే ఆమోదించింది. ఈ బిల్లుకు ప్రతిపక్షాలు చేసిన సవరణలను తోసిపుచ్చింది. జేపీసీలో ప్రతిపక్ష సభ్యులు కూడా ఉన్నారు, అయితే, బీజేపీకే ఆ కమిటీలో మెజారిటీ ఉంది. ఈ బిల్లును కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతిపక్షసభ్యులు సవరణలను ప్రతిపాదించగా, ప్రభుత్వం తోసిపుచ్చింది. ఈ బిల్లును ప్రభుత్వం ప్రతిపాదించిన రోజునే లోక్‌సభ ఆమోదించడం విశేషమే. మొక్కుబడిగా చర్చ జరిగింది. ప్రభుత్వ మొండి వైఖరికి ప్రతిపక్షసభ్యులు వాకౌట్ చేశారు. బంగ్లాదేశ్ నుంచి మన దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన హిందూ వలసవాదులకు, పాకిస్తాన్ నుంచి మన దేశంలోకి చొరబడిన ముస్లిమేతరులకు పౌరసత్వం ఇచ్చేందుకు ఈ బిల్లు ప్రభుత్వానికి అధికారమిస్తుంది. 35 సంవత్సరాల క్రితం కుదిరిన అసోం ఒప్పందాన్ని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్‌డిఏ-2 ప్రభుత్వం తిరిగి పరిశీలన జరిపింది.అస్సామీలకు రాజ్యాంగ పరమైన, పాలనా పరమైన, చట్టపరమైన రక్షణలను కల్పించేందుకు దోహదం చేసే ఈ ఒప్పందంలోని ఆరవ క్లాజును అమలు జరిపే విషయమై పరిశీలన జరిపేందుకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించడానికి, ఒప్పందంలోని క్లాజు ఆరును పరిశీలించేందుకు ఉన్నత స్థాయి కమిటీని నియమించడానికి సంబంధం ఉందా అంటే ఉంది. ఈ రెండింటిని ఒకేసారి తీసుకుని రావడంలో ప్రభుత్వ ఉద్దేశ్యం ఈ ఒప్పందం పట్ల తన చిత్తశుద్ధిని లోకానికి తెలియజేయడమే. అసోం అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి ప్రజలు బీజేపీకి భారీ మెజారిటీ ఇచ్చారు. దానికి ప్రతిఫలంగా బీజేపీ అసోం ప్రజల పక్షాన ఉందని తెలియజేయడం.

1980వ దశకంలో విదేశీయుల అక్రమ ప్రవేశానికి వ్యతిరేకంగా ఆలిండియా అస్సాం స్టూడెంట్స్ యూనియన్, అసోం గణ పరిషత్ వంటి సంస్థలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాయి. ఆ ఆందోళనను చల్లార్చేందుకు ఆనాడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఆందోళన కారులతో అసోం ఒప్పందాన్ని కుదుర్చుకుంది. శరణార్థులకు ఆశ్రయం కల్పించే విషయంలో భారత్ ఏనాడూ వెనకబడి లేదని రుజువు చేయడమే ప్రభుత్వ ఉద్దేశ్యం. అస్సామీల, ఈశాన్య రాష్ట్ర ప్రజల భావోద్వేగాల గురించి ప్రభుత్వానికి, ముఖ్యంగా బీజేపీకి బాగా తెలుసు. కొత్త పౌరసత్వ చట్టం ప్రకారం శరణార్థులకు పౌరసత్వం కల్పించడం ద్వారా ప్రజల ఆగ్రహాన్ని తటస్థం చేయడమే ప్రభుత్వ ముఖ్యోద్దేశ్యం. హిందూ శరణార్థులకు పౌరసత్వాన్ని ఇచ్చే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అస్సామీలకు భరోసా కల్పించడమే బీజేపీ లక్ష్యం. అస్సామీలు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కోరుతున్నారు. తాత్కాలికమైన ఏర్పాట్ల వల్ల ప్రయోజనం లేదని వారు స్పష్టం చేస్తున్నారు. అస్సామీల ప్రయోజనాలు, హక్కులకు రాజ్యాంగపరమైన, చట్టపరమైన రక్షణలు కల్పించాలన్నది వారి ప్రధాన డిమాండ్. ప్రభుత్వం ఈ విషయంలో మాట నిలబెట్టుకోవడం లేదని కినుక వహించిన అస్సాం గణ పరిషత్ బిజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏ నుంచి వైదొలగింది. అస్సాం ఒప్పందంలోని క్లాజు ఆరు గురించి ఉన్నతాధికార కమిటీని ప్రభుత్వం నియమించడాన్ని ఆసు (అస్సాం స్టూడెంట్స్ యూనియన్) తోసిపుచ్చింది. ఇలాంటి కమిటీలను పూర్వపు కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా నియమించాయనీ, వాటివల్ల ప్రయోజనం లేదని ఆసు స్పష్టం చేసింది. ఆసు నాయకుడు సముర్ఝుల్ భట్టాచార్య ఈ ఉన్నతాధికార కమిటీ వల్ల ప్రయోజనం లేదని కొట్టివేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కమిటీని ఏర్పాటు చేసి ఉంటే దాని సిఫార్సులు ఈ పాటికి అమలులోకి వచ్చేవనీ, ఎన్నికల గిమ్మిక్ అని అన్నారు. ఈ విషయం మోడీకి తెలుసుననీ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారం సందర్భంగా అస్సామీల హక్కులకు రక్షణ కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారనీ, బీజేపీ అధికారంలోకి వచ్చి చాలా నెలలు అవుతున్నా, ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదనీ, మళ్ళీ లోక్‌సభ ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా కమిటీని ప్రభుత్వం నియమించిందని ఆయన ఆరోపించారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిని గుర్తించడం మొదలు పెడితేనే అస్సామీలకు రక్షణ లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఉన్నతాధికార కమిటీ కాలపరిమితిని ఆరునెలలుగా ప్రకటించారనీ, ఆ కమిటీ గడువు పూర్తి అయ్యే నాటికి ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం అధికారంలోకి వస్తుందనీ, ఆ ప్రభుత్వం ఈ కమిటీ సిఫార్సులను గౌరవిస్తుందన్న నమ్మకం లేదని ఆయన అన్నారు. అంతేకాక, జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌లో పేర్లు నమోదు కాని వారి విషయాన్ని ప్రభుత్వం సందిగ్ధంలో ఉంచిందనీ, దీనిని బట్టి ఈ కమిటీ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టం అవుతోందని ఆసు నాయకులు అన్నారు. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన హిందూ మైనారిటీల పేర్లు ఈ రిజిస్టర్‌లో నమోదు కాలేదనీ, అందువల్ల ఈ ప్రక్రియ పూర్తి కావడానికి చాలా గడువు పడుతుందని ఆసు నాయకులు పేర్కొంటున్నారు. అసోం అసెంబ్లీలో మొత్తం 126 సీట్లు ఉండగా, బీజేపీ బలం దాదాపు సగం (60) ఉన్నందున ప్రభుత్వానికి ఢోకా లేదనీ, అందువల్లనే రాష్ట్ర ప్రభుత్వం ఈవిషయాన్ని పట్టించుకోవడం లేదని ఆసు నాయకులు అంటున్నారు. అసోం గణపరిషత్‌కు బ్రహ్మపుత్ర లోయలో మాత్రమే ఉంది. అందువల్ల ఆ పార్టీ కటిఫ్ చేసుకున్న బీజేపీకి వచ్చే నష్టం ఏమీ లేదు. అందుకే, ఎన్‌డిఏ నుంచి ఎజిపి తప్పుకున్నా బీజేపీ ఆందోళన చెందలేదు. ఎజిపి నాయకులను బుజ్జగించేందుకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. పౌరసత్వం విషయంలో బీజేపీ, ఇతర రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న క్షుద్ర రాజకీయాల వల్ల ప్రజలకు నమ్మకం చెదిరిపోతోంది. పైగా, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హిందూ వలస వాదులకు మాత్రమే పౌరసత్వాన్ని కల్పించాలని బిజేపీ నిర్ణయించడం వల్ల ప్రభుత్వం మత పరంగానే తీసుకుంటోందన్న అభిప్రాయం అసోం పౌరుల్లో ఏర్పడింది. అందువల్ల ఇది మరో ఉద్యమానికి దారి తీసినా ఆశ్చర్యం లేదు.

-తేజోస్మయ్

# వడి వడి అడుగులు!



ఫీనిక్స్ పక్షి దాని బూడిద నుంచి కూడా తిరిగి లేస్తుందని అంటారు. కాంగ్రెస్ పార్టీ కూడా అలాంటిదే అని 2018వ సంవత్సరం రుజువు చేసింది. రెండు మూడు రాష్ట్రాలకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీకి గత సంవత్సరం పునరుజ్జీవం పోసిందని చెప్పాలి. ఎన్నికల్లో విజయాలకు మొహం వాసిపోయిన హస్తం పార్టీ ఎట్టకేలకు గుడ్డిలో మెల్లలాగా, చావు తప్పి కన్నులొట్టపోయిన విధంగా మూడు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం 2018 సంవత్సరం ప్రత్యేకతగా భావించాలి. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో అధికారం ఏర్పాటు చేయడానికి అవసరమైన కనీస మెజారిటీ రాకపోవడంతో బీఎస్పీ అండదండలతో ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ చత్తీస్‌గఢ్‌లో మాత్రం బీజేపీని బాగా వెనక్కి నెట్టేసింది.

ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఎక్కడ ప్రచారం చేస్తే అక్కడ బీజేపీ గెలుస్తుందనే సెంటిమెంట్‌కి గత సంవత్సరం చరమగీతం పాడింది. బీజేపీని గెలిపించడానికి ప్రధాని మోడీ, అమిత్ షా అక్కర్లేదని, రాహుల్ ప్రచారం ఒక్కటి చాలనే రాజకీయ హస్యానికి ఎట్టకేలకు తెరపడింది. గత ఏడాది కర్నాటకలో బీజేపీ అధికారంలోకి రాకుండా చేయడంలో రాహుల్ టీమ్ ప్రదర్శించిన చాణక్య నీతి ఫలించింది. తాను ముఖ్యమంత్రిని అవుతానని కలలో కూడా ఊహించని కుమారస్వామికి పగ్గాలు అప్పచెప్పి, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కాకుండా కర్నాటకలో కాంగ్రెస్ రచించిన వ్యూహం ఫలించడంతో ఆ పార్టీ హవా మొదలైంది. కుమారస్వామి ప్రమాణ స్వీకారానికి యూపీఏ భాగస్వామ్య పక్షాలతో పాటు మరికొన్ని బీజేపీయేతర పార్టీలు కూడా హాజరవడంతో జాతీయ స్థాయిలో దాదాపు తడుచుపెట్టుకపోయినా కాంగ్రెస్‌కి పూర్వ వైభవం వస్తుందనే సంకేతాలు ఇచ్చినట్లైంది. అధికారంలోకి తాను రాకపోయినా బీజేపీని మాత్రం దూరంగా ఉంచాలని, దానికి అవసరమైన సంఖ్యా బలం కోసం జేడీఎస్ వంటి చిన్న పార్టీకి పగ్గాలు అప్పుచెప్పే దూకుడు నిర్ణయంతో కాంగ్రెస్ పార్టీ తన వ్యూహాల స్వభావాన్ని మార్చుకుందనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమైంది. ఏఐసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత రాహుల్‌గాంధీ రాజకీయ పరిణితి మరింత మెరుగు పడుతోందనడానికి కర్నాటక ప్రయోగాన్ని ఉదాహరణగా చూపుతున్నారు.

**కూటమి ధర్మమెరిగి..**

ఇక అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 2018 సంవత్సరంలోనే వీటి కన్నా ముందు కర్నాటక ఉప ఎన్నికలు కూడా కాంగ్రెస్ జోరుకి నిదర్శనంగా నిలిచాయి. ఎంతో కాలంగా బీజేపీకి కంచుకోటగా ఉన్న బళ్లారిలో ఆ పార్టీ ఓటమి కూడా కాంగ్రెస్ - జేడీఎస్ కూటమి పనిచేసింది. కాంగ్రెస్ ఎంతోకాలం అధికారానికి దూరంగా ఉండలేదని, తాత్కాలిక అవసరాలకు కుమారస్వామికి సీఎం పదవి ఇచ్చినా.. అది మూణ్ణాళ్ల ముచ్చటే అనే అభిప్రాయాలను రాహుల్‌గాంధీ తప్పని నిరూపించారు. కొన్ని అసంతృప్తులున్నప్పటికీ కర్నాటకలో కాంగ్రెస్ - జేడీఎస్ కూటమి స్థిరంగా కొనసాగడం కీలకమైన పరిణామం. అంతే కాకుండా 2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇంతే కలిసికట్టుగా పోటీచేయాలని ఆ రెండు పార్టీలూ దృఢ నిశ్చయంతో ఉండడం విశేషం.

**అంతర్గత విభేదాల పరిష్కారంలో రాహుల్ సక్సెస్**

ఏఐసీసీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తి చేసుకున్న రాహుల్‌గాంధీ 2018 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలను తగ్గించడంలో, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఒక తాటిపైకి తీసుకొని రావడంపై పెట్టిన దృష్టి సత్ఫలితాలిచ్చిందనే చెప్పాలి. మధ్యప్రదేశ్‌లో 2013 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీజేపీకి ఓడిన కాంగ్రెస్ పార్టీకి మధ్య ఓట్ల శాతం స్వల్పం. అప్పటికే పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీపై ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని ఒపీనియన్ పోల్స్‌లో వ్యక్తమైనా.. దాన్నుంచి లబ్ధి పొందడంలో కాంగ్రెస్ విఫలం కావడానికి మధ్యప్రదేశ్ పార్టీలో ముఠా కక్ష్యలే కీలక పాత్ర పోషించాయని రాహుల్ టీమ్ గుర్తించింది. దిగ్విజయ్ సింగ్, కమల్‌నాథ్, జ్యోతిరాదిత్య సింధియా వర్గాల మధ్య సమన్వయలేమి కాంగ్రెస్ ఓటమి కారణమవుతోందని అర్థం చేసుకున్న రాహుల్‌గాంధీ ప్రధానంగా దీనిపైనే దృష్టి పెట్టారు. గత ఏడాది మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన తరువాత రాహుల్‌గాంధీ ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లా అధ్యక్షుడికి స్వయంగా ఫోన్ చేసి వర్గ విభేదాలను విడనాడాలని కోరారు. మధ్యప్రదేశ్‌లో ఆ మాత్రం విజయం సాధించడం వెనుక రాహుల్ ప్రయత్నాలు ఫలించడమేనని విశ్లేషకులు అంటున్నారు.

**ప్రధాని పదవి కన్నా.. మోడీని ఓడించడమే ముఖ్యం!**

ఇక ప్రధాని పదవి విషయంలో కూడా రాహుల్‌గాంధీ ఒక స్పష్టతతో ఉన్నట్లే తెలుస్తోంది. అప్పుడు అత్యవసరం దేశ అత్యున్నత పదవిని అలంకరించాలనే ఆతృత రాహుల్‌లో లేకపోవడం మరో రాజకీయ దృగ్విషయంగా చూడాలి. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే ప్రధానిగా ఎవరుండాలన్నది తనకు ముఖ్యం కాదని, బీజేపీని ఓడించడమే తన ముందున్న ప్రాధాన్యతా కర్తవ్యమని రాహుల్ అంతరంగిక సమావేశాల్లో, బాహాటంగానూ పదేపదే చెబుతూ వస్తున్నారు. గడిచిన ఏడాదిలో వివిధ సందర్భాల్లో, సమావేశాల్లో, వేదికలపైనా ఇదే అభిప్రాయాన్ని రాహుల్ వ్యక్తం చేశారు. బీజేపీని ఓడించడమే తమ ముందున్న పెద్ద లక్ష్యమని రాహుల్ చెప్పారు. వైవిధ్యం, బహుళత్వాలకు పెద్దపీట వేసే గాంధీ సిద్ధాంతాలకు, దేశాన్ని ఒకే మూసలోకి తీసుకొని రావాలనే బీజేపీ - ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు మధ్య యుద్ధం జరుగుతోందని రాహుల్ ప్రకటన వెనుక.. ప్రధాని పదవి తనకు కీలకం కానే కాదనే భావన వ్యక్తమైంది.

**రాహుల్ జోరు పెరిగిందీ 2018లోనే..**

ఇక గత ఏడాది రాహుల్ జోరు పెరిగింది. బీజేపీ - ఆర్ఎస్ఎస్ మరీ ముఖ్యంగా ప్రధాని నరేంద్రమోడీపై ఆయన దూకుడు పెంచారు. రాఫెల్ విషయంలో రాహుల్ నేరుగా ప్రధానిని లక్ష్యంగా చేసుకొని విమర్శనాస్త్రాలు సంధించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ, ఆ తరువాత రాఫెల్ గురించి ప్రస్తావించకుండా రాహుల్ ప్రసంగం లేదన్నది అతిశయోక్తి కాదు. దేశానికి కాపలాదారుగా ఉంటానన్న ప్రధాని మోడీ.. వేల కోట్ల రూపాయల రాఫెల్ కాంట్రాక్ట్ అనిల్ అంబానీకి దక్కేలా చేయడంలో ప్రత్యక్ష ప్రమేయముందని పలు వేదికల మీద విమర్శలు ఎక్కుపెట్టారు. రాఫెల్‌ను ప్రధాన ప్రచారాస్త్రంగా చేయడంలో కాంగ్రెస్ యువ అధ్యక్షుడు విజయవంతమయ్యారని విశ్లేషకులంటున్నారు.

**కొత్త, పాత తరాల మధ్య సమతుల్యత!**

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా టీమ్ కూడా దూకుడుగానే పనిచేసిందని చెప్పాలి. పార్టీ అధ్యక్షుడి భావనను నెటిజన్ల దగ్గరకు తీసుకెళ్లడంలో చురుగ్గా వ్యవహరించిందనే భావన వ్యక్తమైంది. కాంగ్రెస్ యువతరంగం జోరును ఒకవైపు కొనసాగిస్తూనే.. వృద్ధ తరానికి పెద్దపీట వేయడంలోనూ రాహుల్ నిర్లక్ష్యం చేయకపోవడం ఆయన పరిణితికి నిదర్శనమని సొంత పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ సీఎం పగ్గాలను పాత తరం నేతలకు అప్పచెప్పడంలో 2019 పార్లమెంటు ఎన్నికలే కారణమనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. రాజస్థాన్‌లో సచిన్ పైలెట్, మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియా వర్గాన్ని బుజ్జగించడంలోనూ రాహుల్‌గాంధీ విజయవంతమయ్యారంటారు. కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని తీసుకొని రావడానికి రాహుల్ ప్రయత్నం చేస్తున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

**విపక్షాల ఐక్యత సాధించడంలో ముందడుగు!**


1977లో ఇందిరాగాంధీని ఓడించిన ప్రతిపక్ష కూటమి ఐక్యత ఇప్పుడు మరోసారి కనిపిస్తోందని, దానికి వెళ్లిపోయిన ఏడాదే సాక్షీభూతంగా నిలుస్తోందని కాంగ్రెస్ నేతలంటున్నారు. 2018 పొడవునా కాంగ్రెస్ పార్టీ దాదాపు 22 విపక్ష పార్టీలను మచ్చిక చేసుకోవడానికి ప్రయత్నించింది. ముందు నుంచి కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలుగా ముద్రపడ్డ ఆమ్ ఆద్మీ పార్టీ, తెలుగుదేశం పార్టీలు యూపీఏ కూటమిలోకి చేరడం 2018 సంవత్సరం విశేషంగా చెప్పాలి.

**మిజోలో చేదు అనుభవం!**

మిజోరంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గత ఏడాది మిజో నేషనల్ ఫ్రంట్ చేతిలో ఓడిపోవడం.. బీజేపీకి ఆనందాన్నిచ్చే విషయంగా మారింది. ఈశాన్య రాష్ట్రాల్లో మిజోరంలో మాత్రమే ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్షంగా పని చేసిన బీజేపీ వ్యూహం ఫలించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో ఎస్పీ, బీఎస్పీలతో పొత్తు పెట్టుకోవడంలో, శీతాకాల పార్లమెంట్ సమావేశాల ముందు నిర్వహించిన విపక్షాల సమావేశానికి ఆ రెండు పార్టీలను రప్పించడంలోనూ కాంగ్రెస్ విఫలమైంది.

-ఎ.జి.దత్తా

# సర్వం సమస్తం - వివేకానందం!




ఈరోజు (జనవరి, పన్నెండు) భారతజాతికి ఓ శుభదినం. ఓ మహోదయం. స్వామి వివేకానందుడిగా పేరుగాంచిన నరేంద్రుడు జన్మదినం. హిందూ సంస్కృతి విశ్వవ్యాప్తం కావడానికి, విశ్వామోదం పొందటానికి కారణమైన మహనీయుడు - భరతమాత ముద్దుబిడ్డడుగా అవతరించిన రోజు. హిందూ మతం ఓ మతం కాదనీ, అది సంస్కృతి సారస్వతాల మూలమనీ ప్రపంచానికి తెలియజేసిన కారణ జన్ముడు స్వామి వివేకానందుడు. 1863 డిసెంబర్ పన్నెండున కోల్‌కతాలో విశ్వనాథ దత్తా, భువనేశ్వరీదేవి పుణ్యదంపతులు వంశాంకురంగా జన్మించిన రోజు. రామకృష్ణ పరమహంస గురు నిర్దేశంలో... ఓ మహనీయునిగా శ్రీ వివేకానంద తనని తాను ఆవిష్కరించుకున్నారు. ఆవిష్కృతులయ్యారు.

హిందూ మత ఔన్నత్యాన్ని, విశిష్టతను విశేషణాన్ని ప్రపంచ దేశాలన్నిటికీ తెలియజెప్పే హిందూ మతానికి ఓ గుర్తింపుని, ఓ గొప్ప దనాన్ని ఆవిష్కరించిన భారతదేశ వివేక మణిదీపం స్వామి వివేకానందుడు. హిందూ మతం తత్వాన్ని, తాత్వికతను, లక్షణాన్ని, లక్ష్యాన్ని పాశ్చాత్య దేశాలకు తెలియజెప్పి, విశ్వయవనిక మీద హిందూ తాతాత్వికతా పతాకాన్ని సగర్వంగా ఎగురవేసిన స్రష్ట, ద్రష్ట స్వామి వివేకానందుడు. తారీఖులు దస్తావేజుల ప్రస్తావనకు పోకుండా, స్వామి వివేకానందుడు అందించిన సందేశాన్ని, సంకల్పాన్ని, ఆయన పథాన్ని, విధాన్ని, విధానాన్ని రేఖా మాత్రంగా స్పృశించుకునే ప్రయత్నం చేద్దాం. ఎందుకంటే విస్తృత పరిధిలో ఆవిష్కృతమైన ఆయన మార్గాన్ని, గమనాన్ని, ప్రామాణికతను పూర్తిగా అందించడం, అందించగలగటం ఆషామాషీ వ్యవహారం కాదు. అదొక బృహత్తర కార్యక్రమం. ఆ కార్యంలో, కార్యక్రమంలో ఎన్నో ఘటనలు ఎన్నెన్నో సంఘటులు!! మరెన్నో ప్రసంగాలు. ఇంకెన్నో సందేశ పాఠాలు. అవన్నీ చెప్పుకుంటేనే ఆయన విస్తృత రూపం మనకు సందర్శనమవుతుంది. చిన్ని చిన్ని మాటలతో చిట్టిపొట్టి సన్నివేశాలతో అనంతమైన ఆదర్శాన్ని, శక్తియుక్తుల్ని, ధృఢత్వాన్ని స్థిరత్వాన్ని, అమృతత్వాన్ని మనకి అందించిన ధన్యజీవి కారణజన్ముడు స్వామి వివేకానంద. అందుకనే ఆయన జన్మదినాన్ని జాతీయ యువదినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఆయనని స్మరించుకుంటున్నాం.


మై డియర్ సిటిజెన్స్ అనో మైడియర్ లేడీస్ అండ్ జంట్స్ అంటూ పాశ్చాత్య పద్ధతిలో సాగుతుండే సంభోదనను మొట్టమొదటిగా మైడియర్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్ (ప్రియమైన సోదర సోదరీమణులారా) అని సంభోదించి మానవతావాదాన్ని మానవ హితాన్ని, సమ్మితాన్ని, హిందూమత సారస్వత సంపదలోని ఔన్నత్యాన్ని పాశ్చాత్యులకు రుచిచూపించిన మహితాత్ముడు స్వామి వివేకానంద.

మహా పర్వతాన్ని చిన్ని అద్దంలో చూపించే ప్రయత్నంలో భాగంగా... ఆ మహోన్నతుని గురించి కొంచెం పరిశీలిద్దాం. ఆయన జీవితంలో జరిగిన అత్యద్భుత సంఘటనతో విచారణ చేద్దాం. ఆయనను ప్రముఖంగా దేశభక్తి గల సాధువు (పేట్రియాటిక్ సెయింట్‌గా) అభివర్ణిస్తారు. కనుక దేశభక్తి కోణంలోనే ఓ సంఘటన ఆసరాగా, ఆయన దేశభక్తి ఔన్నత్యాన్ని వివరించే ప్రయత్నం చేసుకుందాం. స్వామి వివేకానంద... ఓ పర్యాయం సుమారు నాలుగు సంవత్సరాలు పాశ్చాత్య దేశాలలో పర్యటించేరు. ఆ దేశాలలోని విజ్ఞానాన్ని సకల సంపదలను వారి అధునాతన టెక్నాలజీని వారి ప్రాభవాన్ని, వైభవాన్ని, ఆ దేశాల అగ్రగామితనాన్ని స్వయంగా పరిశీలించేరు. పర్యటనలలో చూసేరు. తిరిగి భారతదేశానికి వస్తున్నారు స్వామి. విమానాశ్రయంలో ఓ విలేకరి స్వామి దగ్గరకి వచ్చారు. స్వామీ గత నాలుగు సంవత్సరాలుగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలను, ఇక్కడి సిరిసంపదలను, విజ్ఞానాన్ని, అభివృద్ధినీ, అభ్యున్నతినీ స్వయంగా మీరు చూసేరు. ఇప్పుడు మీరు మీ దేశానికి తిరిగి వెళ్తున్నారు కదా! మీకిప్పుడు ఏమనిపిస్తోంది. అని అడిగారు. అప్పుడు వివేకానందులంటారు అవును! స్వయంగా ఇక్కడి సంపదలను, భోగాలను, వైభోగాలను ఈ దేశాల అభివృద్ధినీ స్వయంగా చూశాను. ఇప్పుడు నా మాతృభూమి భారత్‌కి, వెళ్తున్నాను కదా? ఈ దేశాలకు రాకముందు నా దేశాన్ని మామూలుగా ఇష్టపడే వాడిని. ప్రేమించేవాడిని. అంతే! కానీ... ఈ దేశాలకు వచ్చేక, ఇక్కడి వాతావరణాన్ని, ప్రజల్ని, ప్రజల పద్ధతుల్ని అన్నింటినీ అవలోకనం చేసి, నాదేశానికి వెళ్తున్న నాకు.. నా భారతదేశంలోని ధూళి పవిత్రంగా కనిపిస్తోంది. నీరు పవిత్రంగా కనిపిస్తోంది. నేల పవిత్రత పవిత్రంగా కనిపిస్తోంది. చెట్టు పుట్ట గుట్ట రాయి రప్పా అంతా నాకు పరమ పవిత్రంగా కనిపిస్తోంది. నా భారతదేశంలోని ప్రతి అడుగు, ప్రతి అణువణువూ పరమ పవిత్రంగా, పవిత్రాతి పవిత్రంగా కనిపిస్తోంది. వెరసి నా భారతదేశం నా ముందు ఓ సువర్ణ దేవాలయంలా కనిపిస్తోంది. ఓ సువర్ణ దేవాలయంలా ధగధగలాడుతూ కనులవిందు చేస్తోంది. అని ప్రశ్నించిన ఆ విలేకరికి సమాధానమిస్తారు స్వామి వివేకానంద.

అదీ... దేశభక్తి అంటే! స్వచ్ఛమైన, నిత్యమైన, సత్యయువతమైన దేశభక్తికి ఇంతకంటే నిదర్శనం మరోటి ఉండదు అనటం ఏమాత్రం అతిశయోక్తి కాదు. హేట్సాఫ్ టు స్వామీ వివేకానంద!

అంతటి విశాలత్వం ఆయన సందేశం! ఆయన జీవితం ఉత్తేజభరితం! యువతకు, దేశానికి దిశానిర్దేశం! రసస్ఫోరకం! ఆయన జీవితం సమస్తం సందేశాత్మకమే. ఆదర్శాత్మకమే. ఆచరణాత్మకమే. దేశభక్తే కాదు సంస్కృతి, సనాతనత్వం, సంప్రదాయం, నిబద్ధత, కార్యోన్ముఖం, బోధలు, ప్రబోధలు, పట్టుదల, అంకితభావం, దేశభక్తి, సమాజదృష్టి, ఐక్యత, సమున్నత, విలువలు విశ్వసనీయత ఇలా... ఏ కోణంలో చూసినా ఆయనకు ఆయనే సాటి. స్వామి వివేకానంద జీవితం యావత్తూ సమస్త మానవాళికి.. ఓ సందేశమే! ఓ ప్రేరణాత్మకమే!

అటువంటి మహనీయుడు మనలో ఒకడిగా, మనవాడుగా, మన భరతమాత ముద్దుబిడ్డడుగా జన్మించడం, ఆయన మన వారసత్వ సంపదగా మనకి సంప్రాప్తించడం నిజంగా మనం చేసుకున్న వేలాది గత జన్మల పుణ్యఫలం. స్వామి మార్గంలో నడుద్దాం. మన బ్రతుకులను పండించుకుందాం.



-రమాప్రసాద్ ఆదిభట్ల, 9348006669

# డ్రగ్స్ ముఠా అరెస్టు

• నిందితులు మయన్మార్ దేశస్థులు



సీపీ భగవత్. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్స్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** భాగ్యనగరంలో మరో డ్రగ్స్ ముఠా గుట్టును బాలాపూర్ పోలీసులు రట్టు చేశారు. ముఠాలోని ఇద్దరు మయన్మార్ దేశస్తులు అబిబస్ రహమాన్, మొహమ్మద్ రహీమ్‌లను అరెస్టు చేసినట్లు రాచకొండ సీపీ మహేష్ భగవత్ శుక్రవారం మీడియాకు తెలిపారు. అరెస్టయిన నిందితుల వద్ద నుంచి ఏడు ప్యాకెట్స్ (ఒక్కో ప్యాకెట్‌లో 190 చెర్రీ రెడ్ కలర్ డ్రగ్ టాబ్లెట్స్)ను స్వాధీనం చేసుకున్నారు. రెండు శ్యాంసంగ్ సెల్‌ఫోన్‌లు, ఒక ఆధార్ కార్డు, నింది తుడు రహీమ్ నుంచి రూ.26వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏడు రోజుల క్రితం మయన్మార్ దేశస్తుడు సలీం నుంచి రూ.66,500తో డ్రగ్స్ టాబ్లెట్స్‌ను కొనుగోలు చేశారు. అనంతరం నగరంలో విక్రయించడం ప్రారంభించారు. ఈ డ్రగ్స్‌ను వై లేదా యాబాగా వ్యవహరిస్తారు. వీరు ఒక్కో టాబ్లెట్‌ను రూ.150లకు విక్రయిస్తున్నట్లు సీపీ తెలిపారు. మయన్మార్‌కు చెంది బాలాపూర్‌కు ఉంటున్న ఇద్దరు నిందితుల్లో రహమాన్ సెంటరింగ్ వర్క్ చేస్తుండగా, రహీమ్ హోటల్‌లో పని చేస్తున్నాడు. కాగా, వీరికి ఈ నిషేధిత డ్రగ్స్‌ను కొరియర్ ద్వారా సైతం సలీమ్ సరఫరా చేస్తుండేవాడని నిందితులు దర్యాప్తులో వెల్ల డించారు.

# ఔటర్‌పై రోడ్డు ప్రమాదం

• ముగ్గురు దుర్మరణం... నలుగురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మరణించిన వారు...

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్ సమీపంలో ఔటర్ రింగ్‌రోడ్డుపై కారు అదుపు తప్పి అంబులెన్స్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా గంగావతికి చెందిన వారు ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు ఆసుపత్రికి వెళ్లి అంబులెన్స్‌లో ఔటర్ రింగ్‌రోడ్ గుండా తిరుగు పయనమయ్యారు. వీరు కొంగర కలాన్-రావిలాల సమీపంలోకి రాగానే డివైడర్‌ను దాటుకుని వచ్చిన కారు వీరి అంబులెన్స్‌ను ఢీకొట్టింది. అంబులెన్స్‌లో ఉన్న గంగావతికి చెందిన బొల్లిరెడ్డి వెంకటేశ్వరరావు (60), ఆయన భార్య సుబ్బలక్ష్మి(55), ఏలూరుకు చెందిన డ్రైవర్ శివ(35)లు అక్కడికక్కడే మరణించారు. అందులో ప్రయాణిస్తున్న హేమచందర్(38), తోపిష్ (34), శ్రీనివాస్(40)లతో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవర్ మనోజ్(34) గాయపడ్డారు. పోలీసులు గాయపడిని వారిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# బస్సు బోల్తాపడి 12 మందికి గాయాలు



**వికారాబాద్, ప్రభన్యూస్:** వికారాబాద్ జిల్లా, నవాబ్‌పేట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపాన వికారాబాద్ డిపో బస్సు బోల్తా పడి 12మందికి తీవ్రగాయాలుకాగా 40 మందికి స్వల్ప గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం చేసుకుంది. శంకర్ పల్లి నుంచి వికారాబాద్ వైపు వస్తున్న ఆర్‌టీసీ డిపో బస్సు నాగిరెడ్డిపల్లి బస్ స్టేజీ సమీపాన మితిమీరిన వేగంతో వస్తూ బోల్తా పడటంతో బస్సులో ప్రయాణిస్తున్న 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని హైదరాబాద్ తరలించారు. మరో 10 మందిని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు.స్వల్ప గాయాలైన వారికి ప్రాథమిక చికిత్స చేసి పంపించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సయ్యద్ ఓమర్ జలీల్ జాయింట్ కలెక్టర్ అరుణ కుమారిని, ఆర్‌డివో విశ్వనాథంను సంఘటనా స్థలానికి పంపారు.

# రైతులను ముంచుతున్న దళారీలు

• తెలంగాణ రైతు సంఘం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** కేంద్రప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఇవ్వకుండా రైతులను మధ్య దళారీలు ముంచుతున్నారని వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. వరి, పత్తి, కందులు, మొక్కజొన్న మార్కెట్‌కు వస్తున్న తరుణంలో క్వింటాళ్ళకు రూ. 2 నుంచి 4 వందల వరకు కనీస మద్దతు ధరను దళారీలు తగ్గిస్తున్నారని తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, కార్యదర్శి టి. సాగర్ తెలిపారు. వరి బిపిటీ (సన్నధాన్యం) కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ ఐకెపి కేంద్రాలు నిరాకరిస్తున్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వాస్తవానికి దొడ్డు ధాన్యం కంటే సన్న ధాన్యాన్ని క్వింటాళ్ళకు రూ.400 అదనంగా ఇవ్వాలని, కానీ కేంద్రం ప్రకటించిన రూ.1770కి కొనుగోలు చేయలేమి చెప్పడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు.



# నా తప్పేం లేదు

## నా వాదన వినలేదు మనస్థాపంతోనే రాజీనామా: అలోక్‌వర్మ

**న్యూఢిల్లీ :** కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) వ్యవహారాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ శుక్రవారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. తాను భారత పోలీసు సర్వీస్ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. తన రాజీనామాను ప్రభుత్వానికి అందజేశానని ఆయన తెలిపారు. భారత అత్యున్నత స్థాయి సంస్థలో జరిగే రాజకీయాల కారణంగా ప్రజలు విశ్వాసం కోల్పోతారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సీబీఐ డైరెక్టర్ నుంచి తప్పించి అగ్నిమాపక, హోంగార్డు శాఖ డైరెక్టర్ జనరల్‌గా నియమిస్తూ గురువారం హైపవర్ కమిటీ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆ శాఖకు వెళ్లడానికి ఇష్టపడని అలోక్ వర్మ, ప్రభుత్వ ఉద్యోగానికే రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. మనస్తాపంతో 21 రోజుల ప్రభుత్వ సర్వీసు ఇంకా మిగిలి ఉండగానే రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. 2017, జులై 31 నుండి రెండేళ్ల పాటు సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించే హక్కు నాకుందన్నారు. జనవరి 31, 2019 వరకు ప్రభుత్వమే రెండేళ్లకాలానికిగాను సీబీఐ పగ్గాలు అప్పగించిందని, నాటకీయ పరిణామాల మధ్య తప్పించడం బాధగా ఉందన్నారు. దీనికితోడు వయస్సు పరంగా చూస్తే అగ్నిమాపక, సివిల్ డిఫెన్స్ అండ్ హోంగార్డు సర్వీసుకు డీజీగా అనర్హుడనని చెప్పుకొచ్చారు. పర్సనల్ అండ్ ట్రెయినింగ్ విభాగం సెక్రెటరీకి తన రాజీనామా లేఖను అందజేసినట్టు తెలిపారు. అలోక్ వర్మ, 1979 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. బదలీ చేసిన మరుసటి రోజే ఉద్యోగానికి రాజీనామా చేయడం, సీబీఐ పదవి నుంచి వర్మను తొలగించడం ఇది రెండో సారి కావడం గమనార్హం. మోడీ నేతృత్వంలో కాంగ్రెస్ సీనియర్ నేత ఖర్గే, జస్టిస్ సిక్రీలు గురువారం రెండు గంటలకు పైగా ప్రధాని నివాసంలో సమావేశమై సీబీఐ డైరెక్టర్ పదవినుంచి వర్మను తప్పిస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. తాను ఎలాంటి తప్పు చేయలేదని సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ చెప్పుకొచ్చారు. ఎవరో చేసిన ఆరోపణలపై తనను బలి చేసినట్టు వివరించారు. అందుకే ఫైర్, సివిల్ డిఫెన్స్ డీజీలో చేరడం ఇష్టం లేదని, అందుకే ప్రభుత్వ ఉద్యోగానికే రాజీనామా చేశానని తెలిపారు. సీబీఐ డైరెక్టర్ నుంచి ప్రభుత్వం తప్పించడంపై న్యాయపోరాటానికి దిగి విజయం సాధించినా మళ్లీ సర్కార్ వేటు వేయడం బాధగా ఉందన్నారు. కేవలం ఒక వ్యక్తి చేసిన ఆరోపణలను బేరీజు వేసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం తగదని చెప్పారు. అవినీతి కేసులపై దర్యాప్తు జరిపే సీబీఐ స్వతంత్రతను ఎట్టిపరిస్థితుల్లో కాపాడాలని వర్మ కోరారు. నిబంధనలకు లోబడే విధులు నిర్వర్తించానని, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగలేదన్నారు. కొందరు సంస్థ సమగ్రతను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కాపాడేందుకు కృషి చేశానని వివరించారు. ఇలాంటి సమయంలో న్యాయపరమైన సమ్మతి లేకుండా 2018, అక్టోబర్ 23న కేంద్రం, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ తనపై ఆదేశాలు జారీ చేసిందన్నారు. నిరాధారమైన ఆరోపణలతో సీవీసీ నివేదిక అందజేసిందని, దాన్ని పరిగణలోకి తీసుకొని కమిటీ బదలీ చేయడం విచారకరమని తెలిపారు.

**అలోక్ వర్మ చేసిన బదలీలు రద్దు**

ఎం. నాగేశ్వర్ రావు, తాత్కాలిక సీబీఐ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో కొందరిని బదలీ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో వర్మ బాధ్యతలు చేపట్టిన అనంతరం మరికొన్ని బదలీలు చేశారు. మళ్లీ నాగేశ్వర్ రావు శుక్రవారం సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం వర్మ చేసిన బదలీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వర్మపై వేటు వేయక 5 గంటల ముందు ఐదుగురు సీబీఐ అధికారులను ఆయన బదలీ చేశారు. అస్థానాపై కేసు దర్యాప్తును ఎస్పీ హోదాలోని మోహిత్ గుప్తాకు వర్మ అప్పగించారు. అస్థానా కేసు విచారిస్తున్న డీఎస్‌పీ ఎకే బస్సీ, అదనపు ఎస్‌పీ ఎస్ఎస్ గుర్మ ఐవోలుగా ఉండగా వారి స్థానంలో సతీష్ దాగర్ నియమితులయ్యారు. సతీష్‌ను తప్పించి గుప్తాకు అలోక్ బాధ్యతలు అప్పగించారు. గతంలో ఉన్న స్థానాల్లోనే కొనసాగాల్సిందిగా సూచించారు.

### వివరణ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వలేదు

అగ్నిమాపక శాఖకు బదలీ చేసే ముందు కూడా త్రిసభ్య కమిటీ తన వాదన వినడానికి ఇష్టపడలేదని వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. సీవీసీ ఇచ్చిన నివేదికలోని అంశాలపై హైపవర్ కమిటీ తనను ప్రశ్నింస్తుందని భావించానని అన్నారు. వయోభారం కారణంగానే ప్రభుత్వ ఉద్యోగం నుంచి తప్పుకుంటున్నా అని వివరించారు. తనకు సరైన న్యాయం జరగలేదని, ఈ కేసు మొత్తం ఎన్నో మలుపులు తిరిగి చివరికి రాజీనామా చేసే వరకు వచ్చిందన్నారు. సీబీఐ నేర విచారణలో ఉన్న ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని సీవీసీ నివేదిక అంద జేసిందని తెలిపారు. ఆరోపణలను పరిగణలోకి తీసుకొని త్రిసభ్య కమిటీ ఈ నిర్ణయం తీసుకోవడం విచారకరమన్నారు. అస్తానా సంతకం చేసిన ఫిర్యాదును మాత్రమే సీవీసీ పంపిందని, విచారణను పర్యవేక్షించే రిటైర్డ్ జడ్జి ఎకే పట్నాయక్ ముందు ఫిర్యాదుదారుడు రాలేదన్నారు. ఆస్తానాకు సంబంధించిన రిపోర్టు కాదని జస్టిస్ పట్నాయక్ కూడా నిర్ధారించారని తెలిపారు. ప్రజాస్వామ్యానికి సంబంధించిన బలమైన, అత్యంత విశ్వాసం, నమ్మకం కలిగిన సంస్థ సీబీఐ అన్నారు. గురువారం ఇచ్చిన తీర్పు ప్రభావం కేవలం తనపైనే పడదని, సీవీసీని ఆధారంగా చేసుకుని ప్రభుత్వం ఎలాంటి చర్యలకు పాల్పడుతుందో ప్రజలకు తెలుస్తుందని, అధికార పార్టీలోని చాలా మంది నాయకులు తన నియామకాన్ని బలపరిచారని గుర్తు చేశారు. తన జీవితాన్ని నాలుగు దశాబ్దాల పాటు ఇండియన్ పోలీస్ సర్వీస్ ద్వారా ప్రజా సేవకే అంకితం చేశానని, అండమాన్, నికోబార్ దీవుల్లో, పుదుచ్చేరి, మిజోరం, ఢిల్లీతో పాటు సీబీఐ, జైళ్ల శాఖకు చీఫ్‌గా కూడా సేవలందించానని, విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



### సీబీఐని దుర్వినియోగం చేస్తోంది

సీబీఐ అధికారాలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శించారు. తన రాజకీయ అవసరాల కోసం సీబీఐను పావుగా వాడుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో సూపర్ ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐ, ఆర్‌బీఐ వంటి అత్యున్నత స్థాయి సంస్థలను నాశనం చేయడానికి బీజేపీ కంకణం కట్టుకుందని ఎద్దేవా చేశారు. సీబీఐ, ఆర్‌బీఐ ఏం చేసినా బీజేపీ తలదూరుస్తోందని అన్నారు.

### హైకోర్టులో అస్థానాకు చుక్కెదురు



సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ అస్థానాకు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. అవినీతి, ఆరోపణల విషయంలో తనపై దాఖలైన కేసును కొట్టి వేయాలంటూ అస్థానా కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం విచారణ చేపట్టింది. అస్థానా వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. ఈ కేసులో దర్యాప్తు ఎదుర్కోవాల్సిందే అని, 10 వారాల్లోగా ఈ దర్యాప్తును పూర్తి చేసి నివేదిక అందజేయాలని సీబీఐను హైకోర్టు ఆదేశించింది. అదేవిధంగా సీబీఐ డిప్యూటీ ఎస్పీ దేవేందర్ కుమార్, మధ్యవర్తి మనోజ్ ప్రసాద్‌లపై కూడా ఎఫ్ఐఆర్ నమోదైన విషయం తెలిసిందే. వీరి ఎఫ్ఐఆర్‌ను కూడా కొట్టేసేందుకు జస్టిస్ నజ్మీ వాజ్రీ నిరాకరించారు. అస్థానాపై క్రిమినల్ దర్యాప్తు చేపట్టకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కూడా న్యాయస్థానం ఈ సందర్భంగా రద్దు చేసింది.




### సీబీఐ పంజరంలో చిలకా..?

ప్రభుత్వం పంజరం అయితే కేంద్ర దర్యాప్తు సంస్థ అందులో చిలక అనేది వాస్తవ మేనా..? అని కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ సందేహం వ్యక్తం చేశారు. యూపీఏ హయాంలో కూడా ఇలాంటి వాదనే ముందుకొచ్చిందని గుర్తు చేశారు. దేశ అత్యున్నత స్థాయి సంస్థతో ప్రభుత్వం ఇలా వ్యవహరించడం తగదని అభిప్రాయ పడ్డారు. అలోక్ వర్మ వాదన వినిపించుకోకుండా బదలీ చేయడం తగదన్నారు. నేర విచారణలో సీబీఐకి స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంజరంలో ఉన్న చిలక ఎగురలేదనేదాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వం మళ్లీ నిరూపించిందని విమర్శించారు. ఒకవేళ పంజరం నుంచి బయటికొచ్చి స్వేచ్ఛగా ఎగిరితే పాలకులకు అవినీతి చిట్టా ఎక్కడ విప్పుతుందో అనే భయం నెలకొందని ధ్వజమెత్తారు. పంజరంలో ఉన్న సీబీఐ ఎప్పటికీ ఎగురలేదనేది స్పష్టమైందన్నారు.

# మార్చిలో ఓటాన్ అకౌంట్ బడ్జెటే

• స్పష్టత నిచ్చిన సీఎం కేసీఆర్ • ఈ మేరకే ప్రతిపాదనలు • నిధుల నిర్వహణలో తప్పనున్న ఇబ్బందులు • మూడు నెలల ఖర్చులు, రాబడులే ఆధారంగా...



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** 2019-20 వార్షిక ఏడాదిలో రెండు బడ్జెట్లు ప్రవేశపెట్టనుంది తెలంగాణ ప్రభుత్వం. తొలుత మార్చిలో మధ్యంతర(ఓటాన్ అకౌంట్) బడ్జెట్, ఆ తర్వాత ఏప్రిల్, మే నెలలో పార్లమెంట్ ఎన్నికల అనంతర పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని శుక్రవారం సీఎం కేసీఆర్ స్పష్టతనిచ్చారు. ఈ మేరకే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్ని శాఖలకు ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. అయితే శాఖలవారీ ప్రతిపాదనలకు ఈనెల 18వరకు సమయముంది. ఆ తర్వాత రెండు మూడు నెలల కోసం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు తుదిరూపునిచ్చి ఆమోదం తెలపనున్నారు. ఈలోగా మంత్రిమండలి ఏర్పాటు కూడా పూర్తవనున్న నేపథ్యంలో ఆర్ధిక శాఖ వేగం పెంచనుంది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభించి ప్రభుత్వ పథకాలు, వేతనాలు, ఇతర పరిపాలనా కార్యక్రమాలకు ఇబ్బందులు లేకుండా మధ్యంతర బడ్జెట్‌లో పద్దులకు ఆమోదం తెలపనున్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్‌కు పొయ్యే అవకాశమున్నందున రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్‌కే పోతుంది. ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాతే పూర్తి బడ్జెట్ ప్రవేశపెడ్తాం అని చెప్పారు. ఆ బడ్జెట్‌లోనే పంచాయతీలకు నిధులను కేటాయించడం సాధ్యమవుతుందన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు అనుగుణంగా రానున్న 2019-20 వార్షిక బడ్జెట్‌ను కేంద్ర కేటాయింపులకు అనువుగా మధ్యంతర బడ్జెట్‌కే ప్రభుత్వం మొగ్గు చూపింది. పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రం ఈ యేడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించేందుకే అర్హత ఉంది. దీంతో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర కేటాయింపులపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం లేదు. వాస్తవానికి జనవరి 10నాటికే అన్ని శాఖలనుంచి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు అందాల్సి ఉండగా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్ పూర్తిస్థాయిలోనా లేక మధ్యంతరమా అనే అంశంపై ప్రభుత్వం అనేక రకాలుగా చర్చించింది.

ఏప్రిల్ 1నుంచి ప్రారంభం కానున్న ఆర్థిక ఏడాదికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు సై అంటోంది. బడ్జెట్ కసరత్తు మొదలయ్యే ప్రతీసారీ జనవరి ఆరంభంనుంచే వివిధ చెల్లింపులపై అనధికార నిషేధం కొనసాగిస్తారు.

తాజాగా రాష్ట్రంలో బిల్లులన్నింటికీ చెల్లింపులను నిలిపివేశారు. తద్వారా మిగులు నిల్వ, నిధుల నిర్వహణ సులువు కానుంది. దీంతో మూడు, నాలుగు నెలల ఖర్చులు, వ్యయాలు, కేటాయింపులపై ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పనున్నాయి.

# గ్రామ పాలన పటిష్టం కావాలి

(మొదటిపేజీ తరువాయి)


పంపించాలని చెప్పారు. కొత్తగా నియామకమయ్యే పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లు కలిసికట్టుగా పని చేయడానికి అవసరమైన అవగాహన కల్పించాలని చెప్పారు. కొత్తగా ఎన్నికయ్యే సర్పంచ్‌లు మూస పద్ధతిలో కాకుండా గ్రామాల సమగ్ర వికాసానికి పాటుపడే ఉద్యమకారులుగా మారాలని సీఎం ఆకాంక్షించారు. 'ప్రస్తుతం గ్రామ పంచాయితీ ఎన్నికలు జరుగుతున్నాయి.ప్రతీ గ్రామానికి ఒక కార్యదర్శిని నియమించడం కోసం పంచాయితీ కార్యదర్శుల నియామకం కూడా జరుగుతున్నది. గ్రామాభివృద్ధిలో వీరిద్దరి పాత్ర చాలా కీలకం. గ్రామ పంచాయితీలకు విధులు, బాధ్యతలు అప్పగించే విషయంలో కొంత జాప్యం అనివార్యమవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్‌కు పోయే అవకాశం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓట్ ఆన్ అకౌంట్‌కే పోతుంది. ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతాం. ఆ బడ్జెట్‌లోనే పంచాయితీలకు నిధులు కేటాయించడం సాధ్యమవుతుంది. ఆలోగా సర్పంచ్‌లు, కార్యదర్శులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి గ్రామాభివృద్ధి కోసం పాటుపడే కార్యకర్తలుగా తీర్చిదిద్దాలి. తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ, ఆస్కి, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ తదితర సంస్థల ద్వారా శిక్షణ ఇప్పించాలి'' అని సీఎం కేసీఆర్ అధికార యంత్రాంగానికి మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, మర్రి జనార్ధన్‌రెడ్డి, కాలె యాదయ్య, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు సీజే బదలీ ప్రతిపాదన


(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకె గుప్తా 31, డిసెంబర్, 2018న పదవీ విరమణ చేశారు. దీంతో అక్కడ ఏర్పడిన సీజే ఖాళీని భర్తీ చేయాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గోగోయ్, జస్టిస్ ఏకె సిక్రి, ఎస్ ఏ.బోబ్డే, జస్టిస్ ఎన్ వి.రమణ లతో కూడిన కొలీజియం సమావేశమై జస్టిస్ టీబీ ఎన్.రాధాకృష్ణన్‌ను కలకత్తా హైకోర్టు సీజే గా బదిలీ చేయాలని సిఫారసు చేసేందుకు తీర్మానించింది.

# కైట్, స్వీట్ ఫెస్టివల్‌పై సమీక్ష



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఈనెల 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరగనున్న ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో తెలంగాణ పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం సమీక్షించారు. శుక్రవారం పరేడ్ గ్రౌండ్‌లో ఫెస్టివల్ ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు వచ్చే సందర్శకుల వాహనాల పార్కింగ్, ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్టు యోధుడు శివరామిరెడ్డి భౌతికకాయానికి అంజలి ఘటిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి

# క్యూనెట్ కేసులో 60కి చేరిన అరెస్టులు

• మోసం విలువ రూ. మూడువేల కోట్లు కాదు... 20వేల కోట్లకు పైనే • బాధితుల ఆందోళన

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** క్యూనెట్ (విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్) భారీ మోసం కేసులో సైబరాబాద్ పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో క్యూనెట్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన దాదాపు 200 మంది బాధితులు ఫైనాన్షియల్ ఫ్రాడ్స్ విక్టిమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కింద తమకు న్యాయం చేయాలని కోరుతూ సైబరాబాద్ సీపీ సజ్జనార్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, ఢిల్లీలతో పాటు విదేశాలలో సైతం క్యూనెట్ మోసాలకు పాల్పడింది.

హాంకాంగ్ కేంద్రంగా విజయ్ ఈశ్వరన్, జోసేఫ్ బిస్మార్క్‌లు క్యూఐ వ్యవస్థాపకులుగా 1998లో నెలకొల్పారు. 2008లో త్రెవర్ కున క్యూనెట్‌లో చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్‌గా ఉన్న క్యూనెట్ సీఈవోగా ఉన్నాడు. మైఖెల్ ఫెరియా, మాల్కామ్ దేశాయి క్యూనెట్ షేర్ హోల్డర్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఇండియా, ఫిలిప్పైన్స్, కాంబోడియా, నేపాల్, ఇండోనేసియా, టర్కీ, సౌదీ అరేబియా, రష్యా తదితర తదితర దేశాలలో విస్తరిం చింది. క్యూఐ గ్రూప్‌లో హాంకాంగ్‌గా బేస్‌డ్‌గా ఉన్న గోల్డ్ క్వెస్ట్, క్వెస్ట్ నెట్‌గా విస్తరించి ఉన్న విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ క్యూనెట్ పేరుతో కార్య కలాపాలు కొనసాగించేందుకు క్యూఐ గ్రూప్ అనుమతించింది. క్యూనెట్ డైరెక్టర్‌లుగా దిలీప్ రాజ్ పొక్కెలా, ఎండి. ఇంతియాజ్‌లు ఉన్నాయి. బెంగళూరులో క్యూనెట్ గోడౌన్, ఆఫీసును పోలీసులు సీజ్ చేశారు.

తెలంగాణ సీఐడీలో క్యూనెట్‌పై 8 కేసులు ఉండగా.. సైబరాబాద్ కమిషనరేట్‌లో 30 కేసులున్నాయి. దేశవ్యాప్తంగా 19 కేసులున్నాయి. మొత్తం 25 దేశాలలో ఆఫీసులు, ఏజెన్సీలు విస్తరించి ఉన్నాయి.

క్యూనెట్ సంస్థలో ఆకర్షణీయ పద్ధతుల్లో ఐటీ కారిడార్‌లో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ప్రధాన టార్గెట్‌తో పాటు పలువురు నిరుద్యోగ యువత, గృహిణుల వద్దనుంచి మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరిట వేల మూడు వేల కోట్ల రూపాయలు దండుకున్న క్యూనెట్ కేసులో సదరు సంస్థ బ్యాంక్ అకౌంట్ నుంచి 2.7 కోట్లను పోలీసులు సీజ్ చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లో 51 మందిని, బెంగళూరులో ఐదుగురిని, ఢిల్లీ, ఏపీలోని ఏలూరులో ఒక్కొక్కరి చొప్పున మొత్తం 58 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. మరో ఇద్దరు నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. హాంకాంగ్ కేంద్రంగా దేశ, విదేశాలలో క్యూనెట్ సంస్థ మోసానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఇద్దరు నిందితుల అరెస్ట్‌తో మొత్తంగా క్యూనెట్ కేసులో అరెస్ట్ అయిన వారి సంఖ్య 60కి చేరినట్లైంది.

**బాధితులు గగ్గోలు..**

క్యూనెట్ బారిన పడిన వారిలో మొత్తం 20 లక్షల మంది మెంబర్స్ ఉన్నారని ఆ సంస్థ ఒప్పుకుందన్నారు. పిచ్చి పిచ్చి ప్రొడక్ట్స్ అప్పజెప్పి తమను నిలువునా ముంచిందని బాధితులు వాపోతున్నారు. ఒక్కొక్కరి వద్ద నుంచి 6,9,12 లక్షల మేర క్యూనెట్ సంస్థ దండుకుందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ లెక్కన సంస్థ చెబుతున్న 20 లక్షల మంది మెంబర్స్‌లో ఒక్కొక్కరు సగటున 10 లక్షలు చెల్లించినా మొత్తంగా క్యూనెట్ మోసం 20 వేల కోట్ల పైమాటేనని బాధితుల వ్యాఖ్యగా వినవస్తోంది. క్యూనెట్ సంస్థ ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను టార్గెట్ చేసిందన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తమ మిగులుగా ఉన్న సొమ్మును అధిక లాభాలు వస్తాయని భ్రమించి క్యూనెట్ సంస్థలో పెట్టుబడి పెట్టి మోసపోయారన్నారు. సంస్థ చెప్పిన మోసపూరిత మాటలకు వారు పడిపోయారు. అంతేకాదు.. మిగులు డబ్బులతో పాటు అదనంగా అప్పులు చేసి మరీ ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టామని బాధితులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఆయా సొమ్ములకు నెలవారీ ఈఎంఐలు కట్టుకోలేక సతమతమవుతున్నామని వారు వాపోతున్నారు. కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసి తమకు తగు రీతిలో న్యాయం చేయాలని బాధితులు సీపీ సజ్జనార్‌కు విజ్ఞప్తి చేశారు.

ఇటీవలి కాలంలో ఈ రకమైన మోసాలు పెరుగుతున్న తరుణంలో ఇలాంటి మోసాల పట్ల తగు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు పదే పదే విజ్ఞప్తులు చేస్తున్నా ప్రజలు ఆయా సంస్థల మోసపూరిత విధానాలను పసిగట్టలేక మోసానికి గురవుతుండటం గమనార్హం. సామాన్య ప్రజలంటే సరేసరి.. ఈ క్యూనెట్ మోసంలో నిరుద్యోగ యువతతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఉండటం తెలిసిందే. ఇలాంటి మోసపూరిత సంస్థల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మరో మారు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. ఒక్క రోజులో ఎవరైనా కోటీశ్వరుడు కాలేడన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ పరిగణనలోనికి తీసుకుని మసలుకోవాలని ఆయన సూచించారు. క్యూనెట్ కేసులో విచారణను వేగవంతం చేశామని, కేసులో ప్రమేయం వున్న ప్రతి ఒక్కర్నీ అరెస్టు చేస్తామని బాధితులకు హామీనిచ్చారు. కాగా, కేసులో ప్రధాన సూత్రధారులు పట్టుబడితే ఈ కేసు చిక్కుముడి వీడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆ దిశగా పోలీసు చర్యలు ఉండాలని బాధితులు కోరుతున్నారు. మరి బాధితులు ఆశించిన స్థాయిలో పోలీసు చర్యలుంటాయని ఆశిద్దాం.




# ఎన్ఎస్ఈ చైర్మన్ పదవికి చావ్లా రాజీనామా



**న్యూఢిల్లీ:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) సీఎండీ పదవికి అశోక్‌చావ్లా శుక్రవారం నాడు రాజీనామా చేశారు. తక్షణమే ఈ రాజీనామా అమల్లోకి వస్తుంది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం ఎయిర్‌సెల్ మాక్సిక్ కేసులో మొత్తం ఐదుగురు నిందితుల్లో చావ్లా ఒకరని సీబీఐ శుక్రవారం నాడు ఢిల్లీ కోర్టుకు సమాచారం అందజేసింది. ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసులో మాజీ కేంద్ర మంత్రి చిదంబరం, ఆయన కుమారుడు నిందితులన్న విషయం తెలిసిందే.

# బిగ్ సీ సంక్రాంతి ఆఫర్లు!

**హైదరాబాద్:** సంక్రాంతి పండుగ సందర్భంగా మొబైల్ రిటైల్ కంపెనీ బిగ్‌సీ వినూత్నమైన ఆఫర్లను ప్రకటించింది. ఎంపిక చేయబడిన మొబైల్స్ కొనుగోళ్లపై చక్కని విలువైన బహుమతులను అందజేస్తున్నట్లు బిగ్ సీ ప్రతినిధి చెప్పారు. ప్రతి పండుగకు, పర్వదినాలను పురస్కరించుకొని బిగ్ తరచూ ఇలాంటి ఆఫర్లను ప్రకటిస్తోంటోంది. తెలుగు వారు అత్యంత ప్రీతిగా జరుపుకొనే సంక్రాంతికి వివిధ ఆఫర్లను ప్రకటించింది. బిగ్ సీ షోరూంలో మొబైల్స్ కొనుగోళ్లపై 0 శాతం వడ్డీ, 0 శాతం డౌన్‌పేమెంట్ 0 శాతం ప్రాసెసింగ్ ఫీ లాంటి ఆకర్షణీయమైన రుణ సదుపాయాన్ని అందిస్తున్నామని తెలియజేసింది. వివరాల్లోకి వెళితే.. బజాజ్‌ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసిన ప్రతి మొబైల్‌పై 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్, ప్రతి స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.2,200 వరకు జియో క్యాష్‌బ్యాక్, 30 జీబీ జియో డేటా ఉచితం. ఎంపిక చేసిన మొబైల్స్ ఒన్ టైం స్క్రీన్ రిప్లేస్‌మెంట్ ఉచితం. ఒప్పో ఎఫ్9 ప్రో మొబైల్ కొనుగోలుపై రైస్‌కుక్కర్ ఉచితం. అన్నీ వివో మోడల్స్‌పై సర్‌ప్రైజ్ గిఫ్టులు, రూ.1590 కార్బన్ కె3 బూమ్‌బాక్స్ మొబైల్ కొనుగోలుపై రూ.2500 విలువ చేసే పెడస్ట్రల్ ఫ్యాన్ ఉచితం. ప్రతి మొబైల్‌పై ఖచ్చితమైన బహుమతి ఉంటుంది.

# జీఎంఆర్ ఎయిర్‌పోర్టుకు ఐసీఎస్ఐ సీఎస్ఆర్ అవార్డు




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు ఐసీఎస్ఐ సిఎస్ఆర్ ఎక్సలెన్స్ అవార్డును గెలుచుకుంది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డును బెస్ట్ కార్పొరేట్ 2018కిగానూ మరోసారి జీఎంఆర్ గ్రూపు సాధించింది. ఈ అవార్డును ఇంగ్లాండ్‌కు చెందిన ఇండియా ప్రొఫెషనల్స్ ఫోరం ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్ కౌల్ నుంచి జిహెచ్ఐఎఎల్ సిఎఫ్‌వో రాజేష్ ఆరోరా ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో స్వీకరించారు. తమ సంస్థ చేస్తున్న సామాజిక సేవకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని జిహెచ్ఐఎఎల్ సీఈవో ఎస్‌జికె కిషోర్ అన్నారు. తమ గ్రూపు ఫిలాసఫీలో సామాజిక అభివృద్ధి ఒక భాగంగా ఉందని, తమ సేవలకు గుర్తింపు రావడం తమకు గర్వకారణమని ఆయన అన్నారు. సమాజంలో నిస్సహాయులుగా ఉన్న వారికి మరింత సేవ చేయాలన్న సంకల్పానికి ఈ అవార్డు మరింత ప్రోత్సహిస్తుందని కిషోర్ అన్నారు.

# 'సార్' లాంగ్‌లైఫ్ ఇన్వెర్టర్లు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని సార్ లివ్‌ఫాస్ట్ సంస్థ లాంగ్‌లైఫ్ ఇన్వర్టర్లను ఆవిష్కరించింది. దేశంలోనే ప్రప్రథమంగా సోలార్ ఇంధనం ఉపయోగించుకుని విద్యుత్‌ను పునరుత్పాదకత చేసుకునే ఇన్వర్టర్లు అన్ని వర్గాల వినియోగదారులను ఆకట్టుకుంటాయని సంస్థ సీఈవో గురుప్రీత్ సింగ్ బాటియా ఆశాభావం వ్యక్తంచేశారు. శుక్రవారం ఇక్కడ కొత్తగా రూపొందించిన ఇన్వర్టర్లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లో 3వేల మంది డీలర్లతో, 22 మంది డిస్ట్రిబ్యూటర్లతో వ్యాపారాన్ని విస్తరి స్తున్నట్లు ప్రకటించారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్ల టర్నోవర్ పూర్తి చేసుకున్నామని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1100 కోట్ల టర్నోవర్‌ను లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. త్వరలోనే రూ.2వేల కోట్ల పెట్టుబడితో తమ వ్యాపార విస్తరణ ఉంటుందని ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లోనూ కొత్తగా ప్లాంట్లు స్థాపించేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నామని అన్నారు.

# హెటిరో నుంచి రొమ్ము క్యాన్సర్ ఔషధం



**హైదరాబాద్:** ప్రముఖ ఔషధ కంపెనీ హెటిరో జెనరిక్ లాపాటినిబి టాబ్లెట్లను శుక్రవారం నాడు దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. ఈ టాబ్లెట్ ముందుస్తు లేదా మెటాస్‌టాటిక్ కేన్సర్ చికిత్సకు వినియోగిస్తారు. ఈ టాబ్లెట్ 'హర్టెబ్' బ్రాండ్ పేరుతో విడుదల చేసింది. ఈ మాత్ర 250 ఎంజీల పరిణామాల్లో లభిస్తుందని ప్రొడక్టు మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్‌ను హెటిరో హెల్త్‌కేర్ లిమిటెడ్ చేస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా హెటిరోకు ప్రపంచవ్యాప్తంగా 36 తయారీ యూనిట్లున్నాయి. 126 దేశాల్లో ప్రొడక్టులను విక్రయిస్తోంది.

# జీఎస్టీ మినహాయింపు పెంపుతో చిన్న కంపెనీలకు ఊరట

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** జీఎస్టీ కింద రిజిస్ట్రేషన్ చేసిన సంస్థలు, కంపెనీల ప్రారంభ మినహాయింపు పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు చేయడంతో చిన్నతరహా వ్యాపారులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని ఫిక్కీ అధ్యక్షుడు సందీప్ సోమాని అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాన్ని ఫిక్కీ స్వాగతిస్తుందని అన్నారు. కౌన్సిల్ నిర్ణయాల్లో ఇది ఎంతో కీలకమైందని, పన్ను చెల్లింపుదారులకు పెద్దఎత్తున సహాయ పడుతుందని అన్నారు. కంపోజిషన్ స్కీమ్‌కు వార్షిక టర్నోవర్ పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.కోటి నుంచి కోటిన్నరకు పెంచాలన్న నిర్ణయంతో పాటు వార్షిక రిటర్న్ ఫైలింగ్‌తో పాటు త్రైమాసిక పన్ను చెల్లింపు సౌకర్యం కల్పించడం వ్యాపారులకు పెద్ద ఊరట అని చెప్పవచ్చునని సోమాని అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ చిన్నతరహా సర్వీస్ ప్రొవైడర్ల సమస్యలను అర్థం చేసుకోవడంలో చొరవ తీసుకుని కంపోజిషన్ స్కీమ్‌ను వారికి కూడా విస్తరించడం, రూ.50 లక్షల వరకు సరకులు, సేవలు ప్రారంభించేందుకు 6 శాతం పన్నురేటు విధించడం పరిశ్రమకు గణనీయంగా ప్రయోజనం కలిగిస్తుందని ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు.

# పారిశ్రామికోత్పత్తి డీలా!

- నవంబర్‌లో 0.5 శాతం
- 17 నెలల కనిష్టానికి..



**న్యూఢిల్లీ:** పారిశ్రామికోత్పత్తి వృద్ధిరేటు (ఐఐపీ) పడకేసింది. నవంబర్‌లో 17 నెలల కనిష్టానికి 0.5 శాతానికి దిగివచ్చింది. తయారీరంగంతో పాటు కన్స్యూమర్, క్యాపిటల్ గూడ్స్‌రంగం బలహీనంగా నమోదు కావడంతో దాని ప్రభావం మొత్తం ఐఐపీ పడింది. ఇదిలా ఉండగా నవంబర్ 2017లో ఐఐపీ 8.5 శాతంగా నమోదైందని కేంద్ర గణాంకాల కార్యాలయం శుక్రవారం నాడు విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. చివరగా జూన్ 2017లో ఈ స్థాయిలో 0.3 శాతంగా నమోదైంది. ఇదిలా ఉండగా అక్టోబర్ 2018 ఐఐపీ వృద్ధిరేటును 8.1 శాతం నుంచి 8.4 శాతానికి సవరించారు. అయితే ఏప్రిల్ నుంచి నవంబర్ కాలానికి చూస్తే ఐఐపీ 5 శాతంగా వృద్ధి చెందగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో 3.2 శాతంగా నమోదైంది. ఐఐపీ సూచిలో తయారీరంగం వాటా 77.63 శాతంగా ఉంది. కాగా నవంబర్ నెలలో 0.4 శాతానికి దిగిరాగా.. ఏడాది క్రితం 10.4 శాతంగా నమోదైంది. గనులరంగంలో 2.7 శాతం వృద్ధి కనిపిస్తే.. ఏడాది క్రితం ఇదే నెలలో 1.4 శాతంగా నమోదైంది. విద్యుత్ రంగానికి వస్తే 5.1 శాతం సాధిస్తే.. ఏడాది క్రితం 3.9 శాతం, క్యాపిటల్‌గూడ్స్ రంగం 3.4 శాతం సాధిస్తే.. ఏడాది క్రితం 3.7 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ రంగం 0.9 శాతం వృద్ధిని సాధిస్తే.. ఏడాది క్రితం 3.1 శాతం, కన్స్యూమర్ నాన్ డ్యూరబుల్ గూడ్స్ కూడా 0.6 శాతానికి దిగిరాగా.. ఏడాది క్రితం 23.7 శాతంగా నమోదైంది. ఇక పరిశ్రమల విషయానికి వస్తే మొత్తం 23 పరిశ్రమల గ్రూపులో 10 గ్రూపులు నవంబర్ 2018లో వృద్ధిని సాధించాయి.

# ఇన్ఫీ లాభాలు ఫ్లాట్!

- నికరలాభం రూ. 3,610 కోట్లు
- క్యూ3లో 30 శాతం పతనం
- రెవెన్యూ రూ. 21,400 కోట్లు
- ప్రత్యేక డివిడెండ్ రూ. 4




**బెంగళూరు:** ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ నికరలాభం దారుణంగా పడిపోయింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకంగా 30 శాతం క్షీణించి రూ.3,610 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.5,129 కోట్లు ఆర్జించినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. అయితే రెవెన్యూ మాత్రం 20.3 శాతం పెరిగి రూ.21,400 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.17,794 కోట్లు నమోదు చేసింది. క్యూ3 ఫలితాలను శుక్రవారం స్టాక్ మార్కెట్ ముగిసిన తర్వాత విడుదల చేసింది. ప్రత్యేక డివిడెండ్ కింద షేరుకు రూ.4 ప్రకటించింది. డివిడెండ్ కింద రూ.2,107 కోట్లు చెల్లిస్తుంది. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం రెవెన్యూ గైడెన్స్ సవరించింది. కరెన్సీ స్థిరంగా ఉంటే 8.5 శాతం నుంచి 9 శాతం వరకు సాధిస్తామని అంచనా వేసింది. క్లయింట్ల సంఖ్య పెరగడంతో ఏడాది ప్రాతిపదికన చూస్తే కరెన్సీ నిలకడగా ఉన్నందున క్యూ3లో డబుల్ డిజిట్ 10.1 శాతం వృద్ధి సాధించామని ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ సలీల్ పారిఖ్ చెప్పారు. డిసెంబర్ త్రైమాసికంలో డిజిటల్ వ్యాపారంలో 33.1 శాతం వృద్ధిని సాధించామని.. 1.57 బిలియన్ డాలర్ల అతి పెద్ద డీల్స్‌ను దక్కించుకున్నామని.. దీంతో 2019 కొత్త సంవత్సరంలో సరికొత్త విశ్వాసంతో అడుగుపెడుతున్నామని పారిఖ్ అన్నారు. అంచనాలకు దూరంగా ఫలితాలు : ఇన్ఫోసిస్ క్యూ3 నికరలాభం ఏడాది ప్రాతిపదికన 30 శాతం క్షీణిస్తే.. త్రైమాసిక ప్రాతిపదికన 12 శాతం క్షీణించి రూ.3,610 కోట్లకు దిగివచ్చింది. మార్కెట్ విశ్లేషకులు మాత్రం రూ.4,115 కోట్లు సాధిస్తుందని అంచనా వేశారు. ఏడాది క్రితం రూ.5,129 కోట్లు నికరలాభాన్ని నమోదు చేయగా.. సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.4,110 కోట్లు నికరలాభాన్ని ప్రకటించింది. ఇక టీసీఎస్ విషయానికి వస్తే గురువారం ఫలితాలను ప్రకటించింది. ఏడాది ప్రాతిపదికన నికరలాభం 24.1 శాతంతో రూ.8,105 కోట్లు ప్రకటించింది. రూపాయి రెవెన్యూ : రూపాయి ప్రాతిపదికన చూస్తే త్రైమాసికం ప్రకారం రూ.21,400 కోట్లు ఆర్జిస్తే.. సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.20,609కోట్లు నమోదు చేసింది. రెవెన్యూ డాలర్ ప్రాతిపదికన చూస్తే 2.3 శాతం వృద్ధితో 2,987 మిలియన్ డాలర్లకు చేరింది. విశ్లేషకుల అంచనా కంటే కాస్తా ఎక్కువగా నమోదు చేసింది.

ఆపరేటింగ్ మార్జిన్ : ఆపరేటింగ్ మార్జిన్ 110 బేసిస్ పాయింట్లు క్షీణించి 22.6 శాతానికి దిగివచ్చింది. విశ్లేషకుల అంచనా కంటే తగ్గింది. దీంతో పాటు అదనపు తరుగుదల, రుణాల చెల్లింపు ప్రభావం 0.4 శాతం ఆపరేటింగ్ మార్జిన్‌పై పడింది. దీనికి కారణం పనాయా, స్కావా ఆస్తులను విక్రయించకుండా అట్టిపెట్టుకోవడమే. ఈబీఐటి లేదా వడ్డీ పన్ను చెల్లించడానికి ముందు ఆదాయం రూ.4,830 కోట్లుగా తేలింది. విశ్లేషకుల అంచనా రూ.4978 కోట్ల కంటే తక్కువ. డివిడెండ్ : ఇదిలా ఉండగా బోర్డు ప్రత్యేక డివిడెండ్ షేరుకు రూ.4గా ప్రకటించింది. రికార్డు తేదీని ఈ నెల 25గా నిర్ణయించింది. జనవరి 28వ తేదీ ప్రత్యేక డివిడెండ్‌ను వాటాదారులకు చెల్లిస్తుంది. షేర్ల బైబ్యాక్ : కంపెనీ బోర్డు రూ.8,260 కోట్ల బైబ్యాక్‌ను ఆమోదించింది. షేరు ఒక్కోటి రూ.800కు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ప్రస్తుతం మార్కెట్ ధర రూ.683.50తో పోల్చుకుంటే 17 శాతం ప్రీమియం ఇస్తోంది. ఎడీస్ హోల్డర్లు తమ ఎడీఎస్‌లను ఈక్విటీ షేర్లలో బదిలీ చేసుకోవడానికి అనుమతించింది. దీంతో ఈ షేర్లు ఇండియన్ స్టాక్ ఎక్స్ఛేంజీలో బైబ్యాక్‌కు ద్వారా విక్రయించుకోవచ్చు. కిరణ్‌మజుందార్‌షా టెర్మ్ పొడిగింపు: కిరణ్‌మజుందార్ షాను ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా మరో టెర్మ్ పొడిగించారు. నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటి (ఎన్ఆర్‌సీ) సిఫారసుల మేరకు షాను ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా ఏప్రిల్ 1, 2019 నుంచి మార్చి 22, 2023 వరకు పొడిగించారు. అయితే దీనికి వాటాదారుల అనుమతులు పొందాల్సి ఉందని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. షా పదవి కాలం పొడిగింపుపై కంపెనీ చైర్మన్ నందన్ నీలేకనీ స్పందిస్తూ.. షా అనుభవం... ముందు చూపును బోర్డు గౌరవిస్తోందని, రాబోయే సంవత్సరాల్లో ఆమె సేవలు కంపెనీకి చాలా అవసరమని ఆయన అన్నారు. బోర్డులో కిరణ్ అత్యంత బలమైన వ్యక్తి అని, ముఖ్యంగా గత 18 నెలల నుంచి ఆమె కంపెనీ స్థిరత్వంతో పాటు వృద్ధిబాటలోకి తీసుకురావడానికి ఎంతో కృషి చేశారని ఆయన ప్రశంసించారు. ఎన్ఆర్‌సీ చీఫ్‌గా ఆమె సీఈవో, సీఎఫ్ఓల ఎంపికలో కీలకపాత్ర పోషించారని నీలకనే పేర్కొన్నారు. కిరణ్‌మజుందార్ షా ప్రస్తుతం బయోకాన్ కంపెనీ సీఈఎండీగా సేవలందిస్తున్నారు.

## భారత్‌కు ఏడీబీ రుణం
# 450 కోట్ల డాలర్లు


- జీడీపీ వృద్ధిరేటు 7.3 శాతం




**న్యూఢిల్లీ:** ఈ ఏడాది (2019)లో ఏషియన్ డెవలెప్‌మెంట్ బ్యాంకు (ఎడీబీ) భారత్‌కు 450 కోట్ల డాలర్లు (రూ.31,500 కోట్లు) రుణాలు సమకూర్చుతామని శుక్రవారం నాడు వెల్లడించింది. భారత్ వృద్ధిరేటు గురించి ప్రస్తావిస్తూ.. ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7.3 శాతం సాధిస్తుందని.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇది కాస్తా 7.6 శాతానికి ఎగబాకుతుందని పేర్కొంది. పెట్టుబడులు పుంజుకోవడంతో పాటు జీఎస్టి స్థిరపడ్డంతో రెవెన్యూ కూడా పెరుగుతుందని వివరించింది. ఈ రుణాల విషయానికి వస్తే ప్రభుత్వరంగానికి 3.5 బిలియన్ డాలర్లు కేటాయిస్తే.. ప్రైవేట్ రంగానికి 1 బిలియన్ డాలర్లు కేటాయిస్తున్నట్లు ఎడీబి ఇండియా కంట్రీ డైరెక్టరేట్ కెనిచి యోకోయమా చెప్పారు. గత ఏడాది ఎడీబీ 3.03 బిలియన్ డాలర్లు భారత్ ప్రభుత్వానికి రుణాలు ఇస్తామని హామీ ఇచ్చింది. అదే ప్రైవేట్ రంగానికి అయితే 557 మిలియన్ డాలర్ల వరకు రుణాలు ఇవ్వడానికి ఆమోదం తెలిపింది. అయితే ఈ పెట్టుబడులు దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులకు ఇవ్వడం జరుగుతుందని యోకోయమా వివరించారు. ఎడీబీ సీనియర్ ఎకనమిక్స్ ఆఫీసర్ అభిజిత్ సేన్ గుప్తా మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరం భారత వృద్ధిరేటు మరింత పుంజుకుంటుందని అంచనా వేశారు. కేంద్ర గణాంకాల కార్యాలయం అంచనా వేసిన వృద్ధిరేటు 7.2 శాతంతో పోల్చుకుంటే ఏడీబీ అంచనా కాస్తా ఎక్కువగా ఉంది. అయితే ఆర్‌బీఐ అంచనా 7.4 శాతంతో పోల్చుకుంటే కాస్తా తక్కువగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో భారత్ జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతానికి ఎగబాకింది. ఇటీవల ఏషియన్ డెవెలప్‌మెంట్ ఔట్‌లుక్ (ఎడీఓ)లో 2019-20లో భారత్ జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతంగా నమోదవుతుందని అంచనా వేసింది. వస్తు సేవల పన్ను లేదా జీఎస్టి పెద్ద నోట్ల రద్దు తర్వాత పరిస్థితుల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై వ్యతిరేక ప్రభావం చూపించినా.. ప్రస్తుతం పరిస్థితులు గాడినపడ్డాయి. చమురు ధరలు తగ్గడంతో .. గృహ వినియోగం పెరగడం రెండు వృద్ధిరేటుకు కలిసొచ్చే అంశాలు. అయితే రెండు అగ్రరాజ్యాల మధ్య ఏర్పడిన వాణిజ్య ఉద్రికత్తల ప్రభావం వృద్ధిరేటుపై ప్రభావం చూపిస్తాయని పేర్కొంది. ఇక కరెంటుఖాతాలోటు విషయానికి వస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 2.5 శాతానికి పరిమితం కావచ్చునని అంచనా వేసింది. దేశంలోకి క్రమంగా పెట్టుబడులు రావడంతో క్యాడ్ అదుపులో ఉంటుందని పేర్కొంది.

# మళ్లీ పెట్రో భగ్గు


- లీటరుకు 19 పైసలు.. డీజెల్ 28 పైసలు పెంపు



**న్యూఢిల్లీ:** పెట్రోల్, డిజెల్ ధరలు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. శుక్రవారం పెట్రోల్‌పై 19 పైసలు, డిజెల్‌పై 28 పైసలు పెరిగింది. ఇటీవల వరకు క్రమంగా ధరలు తగ్గినా గత రెండు రోజుల నుంచి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఢిల్లీలో పెట్రోల్ లీటరు రూ.69.07కు చేరింది. ఈ నెలలో ఇదే అత్యధికం. గురువారం నాడు లీటరు రూ.68.88 పలికిందని చమురు మార్కెటింగ్ కంపెనీలు విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా తెలుస్తోంది. ఇక డిజెల్ విషయానికి వస్తే ఢిల్లీలో శుక్రవారం నాడు లీటరు రూ.62.81కి చేరగా.. గురువారం రూ.62.53కు విక్రయించారు. ముంబైలో పెట్రోల్ శుక్రవారం నాడు రూ.74.72, డిజెల్ రూ.65.73కు విక్రయించారు. పెట్రోల్, డిజెల్ ధరలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటాయి. స్థానిక అమ్మకపు పన్ను లేదా వ్యాట్‌ను బట్టి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. ఈ నెల 7వ తేదీన పెట్రోల్‌పై 21 పైసలు, డిజెల్‌పై 8 పైసలు పెంచారు. అటు తర్వాత జనవరి 8,9 తేదీల్లో ధరల్లో ఎలాంటి మార్పుల్లేవు. మూడుసార్లు ధరలు పెరగడంతో పెట్రోల్ ధర 78 పైసలు, డిజెల్ ధర 55 పైసలు పెరిగిందని చమురు కంపెనీలు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వివరించాయి. అంతకు ముందు పెట్రోల్ ధరలు ఏడాది కనిష్ఠానికి రూ.68.29కి డిజెల్ రూ.62.16 కనిష్ఠానికి దిగివచ్చాయి. అక్టోబర్ 18, 2018 నుంచి రెండు ఇంధనాల ధరలు దాదాపు ప్రతి రోజు తగ్గుకుంటూ వచ్చాయి. అక్టోబర్ 18 నుంచి చూస్తే పెట్రోల్ ధరలు ఏకంగా రూ.14.54 వరకు తగ్గాయి. డిజెల్‌పై రూ.13.53 వరకు ఈ రెండున్నర నెలల్లో తగ్గాయి. అక్టోబర్ 4న పెట్రోల్ ధరలు రికార్డు స్థాయిలో లీటరు ఢిల్లీలో రూ.84 పలికితే, ముంబైలో రూ.91.34, అదే డిజెల్ విషయానికి వస్తే ఢిల్లీలో రూ.75.45, ముంబైలో రూ.80.10కి ఎగబాకింది. ఆగస్టు 16 నుంచి పెట్రోల్, డిజెల్ ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. పెట్రోల్, డిజెల్ ధరలు పెరగడంతో ఆమ్‌ఆద్మీ ఆగ్రహాన్ని గమనించిన నరేంద్రమోడీ సర్కార్ పెట్రోల్, డిజెల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.1.50 చొప్పున తగ్గించి, ప్రభుత్వ రంగానికి చెందిన రిటైలర్స్‌ను సబ్సిడిలో రూ.1 తగ్గించాలని కోరింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరగడంతో దాని ప్రభావం పెట్రోల్, డిజెల్‌పై పడింది. అటు తర్వాత కొన్ని రోజులకు చమురు ధరలు క్రమంగా తగ్గముఖం పట్టడంతో పాటు డాలర్ మారకంతో రూపాయి బలపడ్డంతో చమురు మార్కెటింగ్ కంపెనీలు రిటైల్ ధరలను క్రమంగా తగ్గించకుంటూ వచ్చాయి. మళ్లీ గత రెండు రోజుల నుంచి ధరలు పెరుగుతూ వస్తున్నాయి.


# టీసీఎస్ పడేసింది

- వరుసగా రెండోరోజు నష్టాల్లోనే
- బీఎస్ఈ 97 పాయింట్లు డౌన్
- గ్లోబల్ మార్కెట్‌లో మిశ్రమ స్పందన



**ముంబై:** స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. హెవీ వెయిట్ షేరు టీసీఎస్ మార్జిన్‌లు అంచనా కంటే తక్కువగా నమోదు కావడంతో మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. శుక్రవారం నాటి ట్రేడింగ్ విషయానికి వస్తే ఉదయం లాభాలతోనే మొదలైనా.. ఆ జోరు చివరి వరకు కొనసాగలేకపోయింది. ఇన్వెస్టర్లకు కార్పొరేట్ ఫలితాలపై అనుమానాలు తలెత్తడంతో... ఉన్న షేర్లను నగదు రూపంలో మార్చుకోవడం మేలనుకొని అమ్మకాలకు పాల్పడ్డారని ట్రేడర్లు చెబుతున్నారు. ఇక ట్రేడింగ్ విషయానికి వస్తే.. ఉదయం లాభాలతోనే 36,191.87 వద్ద ట్రేడింగ్ మొదలైంది. అటు తర్వాత ఆ జోరు కొనసాగలేకపోయింది. మధ్యాహ్నం నుంచి ఇన్వెస్టర్లు తమ షేర్లను విక్రయించుకోవడం మొదలుపెట్టగానే సెన్సెక్స్ 96.66 పాయింట్లు క్షీణించి 10,794.95 వద్ద ముగిసింది. వారం ప్రాతిపదికన చూస్తే సెన్సెక్స్ 314.74 పాయింట్లు, నిఫ్టీ 67.60 పాయింట్లు లాభపడ్డాయి. టీసీఎస్ విషయానికి వస్తే 2.45 శాతం క్షీణించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 24.1 శాతం ప్రకటించినా.. మార్జిన్‌లు నిరుత్సాహ పర్చాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గురువారం మార్కెట్ ముగిసిన తర్వాత టీసీఎస్ ఫలితాలు ప్రకటించాయి. బీఎస్ఈలో నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. ఇండస్‌ఇండ్ బ్యాంకు, టాటామోటార్స్, టీసీఎస్, ఎస్ బ్యాంకు, ఎల్‌అండ్‌టిలు 3.26 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంగా ఐటీసీ, ఓఎన్‌జీసీ, వేదాతం, ఇన్ఫోసిస్, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు 2.02 శాతం వరకు లాభపడ్డాయి. టీసీఎస్ క్యూ3 ఫలితాలపై మిశ్రమ స్పందన కనిపిస్తోంది. రెవెన్యూ అంచనా ప్రకారమే ఉన్నా, ఈబిఐటి మార్జిన్ బలహీనంగా ఉంది. కంపెనీకి ఇతర మార్గాల ద్వారా అధికం ఆదాయం రావడంతో దాని ప్రభావం నికరలాభంపై కనిపించిందని సెంట్రమ్ బ్రోకింగ్ ఒక నోట్‌లో వివరించింది. ఇక ఫారెక్స్ మార్కెట్ల విషయానికి వస్తే డాలర్ మారకంతో రూపాయి 21 పైసలు క్షీణించి 70.55 మార్కుకు దిగివచ్చింది. బ్రెంట్ క్రూడాయిల్ ఫ్యూచర్ ట్రేడింగ్ పీపా 1.10 శాతం పెరిగి 62.36 డాలర్ల వద్ద ట్రేడ్ అయ్యింది. ఇదిలా ఉండగా గురువారం నాడు విదేశీ సంస్థాగత మదుపరులు రూ.344.58 కోట్ల షేర్లు విక్రయించగా.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.10.98 కోట్ల షేర్లను కొనుగోలు చేసినట్లు బీఎస్ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇక ఆసియా మార్కెట్ల విషయానికి వస్తే లాభాలతో ముగియగా, యూరోపియన్ మార్కెట్లలో మిశ్రమ స్పందన కనిపించింది.

# ఫారెక్స్ నిల్వలు 396 బి. డాలర్లు




**ముంబై:** విదేశీమారక ద్రవ్యం నిల్వలు జనవరి 4తో ముగిసిన వారాంతంలో 2.68 బిలియన్ డాలర్లు పెరిగి 396.084 బిలియన్ డాల ర్లకు ఎగబాకాయి. ఆర్‌బీఐ వద్ద ఉన్న కరెన్సీలు ఆస్తులు, బంగారం విలువ పెరగడమే కారణం ఆర్‌బీఐ శుక్రవారంనాడు విడుదల చేసిన తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. అంతకంటే ముందు వారంతంలో మొత్తానికి నిల్వలు 116.4 మిలియన్ డాలర్లు పెరిగి 393.404 బిలియన్ డాలర్లకు ఎగబాకాయి. మొత్తానికి జనవరి 4తో ముగిసిన వారాంతంలో విదేశీ కరెన్సీ ఆస్తుల మొత్తం నిల్వలు 2.215 బిలియన్ డాలర్లు పెరిగి 370.292 బిలియన్ డాలర్లు చేరాయి. ఆర్‌బీఐ వద్ద ఉండే విదేశీ కరెన్సీలు అమెరికన్ డాలర్, యూరో, పౌండ్, ఎన్‌ల విలువ పెరగనూ వచ్చు.. తరగనూ వచ్చు. కాగా గతేడాది ఏప్రిల్ 13న ఆర్‌బీఐ వద్ద నిల్వలు రికార్డుస్థాయిలో 426.028 బిలియన్ డాలర్లకు ఎగబాకాయి. అటు తర్వాత నుంచి కరెన్సీ ఒడిదుడుకులకు గురై ఆ నిల్వలు కాస్తా కరిగిపోయాయి. ఆర్‌బీఐ వద్ద నగదు నిల్వలు కరిగిపోవడానికి ప్రధాన కారణం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఒడిదుడు కులకు గురికావడంతో ఆర్‌బీఐ తమ వద్ద ఉన్న డాలర్లను విక్రయించి రూపాయి మరింత పతనం కాకుండా అడ్డుకుంది. ఈ ఆర్థికసంవత్సరం మొదటి ఐదు నెలల కాలంలో ఆర్‌బీఐ 34 బిలియన్ డాలర్ల వరకు విక్రయించి రూపాయి మరింత పత నం కాకుండా అడ్డుకుంది. గత ఏడాది రూపాయి రికార్డుస్థాయిలో 74 మార్కుకు దిగివచ్చిన విషయం తెలిసిందే. బంగారం నిల్వల విషయానికి వస్తే 465.5 మిలియన్ డాలర్లు పెరిగి జనవరి 4వ తేదీ నాటికి 21.689 బిలియన్ డాలర్లకు చేరా యని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో వివరించింది. దశాబ్దం తర్వాత ఆర్‌బీఐ బంగారం పెద్దమొత్తంలో కొనుగోలు చేసింది జూన్ చివరి నాటికి ఆర్‌బీఐ 8.46 మెట్రిక్ టన్నుల బంగారం కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆర్‌బీఐ వద్ద మొత్తం పసిడి నిల్వలు 566.23 టన్నులకు చేరాయి.

## జూన్ 1,2 తేదీల్లో ఆర్ఐఎంసీ ఎంట్రెన్స్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ్ ఇండియన్ మిలటరీ కాలేజ్‌లో 8వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. డెహ్రాడూన్‌లోని ఆర్ఐఎంసీ కాలేజీలో దరఖాస్తులను తీసుకొని మార్చి 31 లోపు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో సమర్పించాలని కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణరాష్ట్రానికి చెందిన బాలురు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. పరీక్ష జూన్ 1, 2 తేదిల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉన్నాయని ప్రకటనలో పేర్కొన్నారు.

## చైనా మాంజా వాడొద్దు

**• విక్రయాలపై దృష్టిపెట్టండి • కలెక్టర్లకు అజయ్ మిశ్రా సూచన**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా సింథటిక్ మాంజా (నైలాన్ దారం)ను విక్రయించినా, వినియోగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. సింథటిక్ మాంజాను నిషేధిస్తూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆదేశించినందున జిల్లా కలెక్టర్లు, పర్యాటకశాఖ డైరెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ మిశ్రా కోరారు. ఈ మాంజాను నిషేధిస్తూ ప్రభుత్వం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, అందుకు తగ్గట్టుగా దీని వినియోగాన్ని నియంత్రించాలని ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్‌జిటి నిబంధనల మేరకు గాలపటాలు ఎగుర వేసుకోవచ్చునని, దాని నిబంధనలు ఉల్లంఘిస్తే ఐదేళ్ళు జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమాన విధిస్తారని అజయ్ మిశ్రా హెచ్చరించారు.

## ఇక్ఫాయ్‌లో ఆర్కిటెక్చర్ కోర్సు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఇక్ఫాయ్ యూనివర్సిటీ కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సును ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన వివరాలను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జె మహేందర్‌రెడ్డి మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉన్నత విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. బాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సు 5 సంవత్సరాలుంటుందని తెలిపారు. కోర్సులో ప్రవేశాల కొరకు ఇంటర్మీడియట్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.

## దుబాయ్‌లో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** గడచిన 10 ఏళ్ళుగా దేశంలో మహిళాభ్యుదయం కోసం పలు కార్యక్రమాలను నిర్వహించిన వీ టీమ్ నెట్‌వర్క్ ఇండియా సంస్థ ఈసారి దుబాయ్‌లో మహిళా అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎస్ వీరేంద్రబాబు తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ గంటా శారని మాట్లాడుతూ, ఇంతవరకు సంస్థత బాడ్మింటన్ సూపర్ స్టార్ గుత్తా జ్వాలా స్టార్ డైరెక్టర్ విజయ నిర్మల, బీ జయ, నటీమణులు సనా, కల్పనా, గాయకులు సునితలతో పాటు అమెరికా, దుబాయ్, శ్రీలంక, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన ప్రముఖ మహిళలకు ఈ అవార్డులను అందించారన్నారు. ఈ సారి అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న దుబాయ్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అమెరికా నుంచి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఝాన్సీరెడ్డి అవార్డుల వివరాలను వెల్లడించారు. క్రీడలు, విద్య, సినిమా, సైన్స్, సోషల్ వర్క్, సంగీతం, నృత్యం, శాంతి కోసం ప్రయత్నించే మహిళలు, వ్యాపార వేత్తలకు అవార్డులతో పాటు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులుంటాయన్నారు. ఈ సందర్భంగా ట్రోఫీ, గోడ పత్రికలను ఆవిష్కరించారు.

## 7న ఢిల్లీలో బీసీ సంఘాల ధర్నా

### నేడు నల్గొండలో సభ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగాన్ని అవమాన పరిచేలా వ్యవహరించిన బీజేపీ తీరుకు నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం స్పష్టం చేసింది. నేటి నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించండి- సామాజిక న్యాయాన్ని కాపాడండి పేరుతో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు స్పష్టం చేశారు. నేడు నల్గొండలో సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రేపు విజయవాడలో 20న వరంగల్, 24న నిజామాబాద్, 29న ఆదిలాబాద్‌లో, 27న ఒడిషాలో సభలు ఏర్పాటు చేస్తూ చివరిగా దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఫిబ్రవరి 7న భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు ఐఏఎండీకే నాయకురాలు కనిమొళి, సమాజ్‌వాద్ పార్టీ నాయకులు ములాయంసింగ్ , ఆర్‌జేడీ నాయకులు ధర్మేంద్రప్రధాన్, ఎంఐఎం నేత అసదుద్దీన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## సంతకం తిన్నగా ఉంటే మనసు స్థిరంగా ఉన్నట్లే

**• ఏ రంగంలోనైనా బాంధవ్యాలే ప్రధానం: జ్యోతిష్యురాలు జై మదాన్**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఒక వ్యక్తి సంతకం తిన్నగా ఉంటే ఆ వ్యక్తి మనసు నిశ్చలంగా, స్థిరంగా ఉంటుందని ప్రముఖ జ్యోతిష్యురాలు డాక్టర్ జై మదాన్ చెప్పారు. చేతి సంతకాన్ని బట్టి నిర్ణయాల వేగం, కార్యక్రమాల అమలు నిర్ణయించువచ్చునని ఆమె చెప్పారు. ఫిక్కీ ఎఫ్ఎల్‌వో శుక్రవారం నిర్వహించిన చర్చాగోష్టి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫార్మింగ్ ఫార్చ్యూన్స్ అన్న అంశంపై ప్రసంగించి ఫిక్కీ ఎఫ్ఎల్‌వో సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. బొటనవేలు, పాదం ముద్రల రేఖలను బట్టి మనిషి తత్వాన్ని తెలుసుకోవచ్చునని జై మదాన్ చెప్పారు. మానవ సంబంధాలు అన్ని రంగాల్లో ప్రధాన భూమిక పోషిస్తాయని, ముఖ్యంగా వ్యాపారంలో ఇచ్చిపుచ్చుకునే ధోరణితోనే విజయం సాధిస్తారని ఆమె చెప్పారు. కష్టాల్లో ఉన్నపుడు చాలా మంది తమ పరిస్థితి మీలాగా లేదంటూ నిరుత్సాహానికి గురవుతారని, కానీ అందరి పరిస్థితి అలాగే ఉంటుందన్న విషయాన్ని తెలుసుకోలేరని ఆమె అన్నారు. తన కష్టాన్ని ఇతరులకు చెప్పుకోవడంతో ఓదార్పు పొందే ప్రయత్నం చేస్తారని, కానీ అది అందరిలో ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలని జై మదాన్ చెప్పారు. కుటుంబ వ్యవస్థలో సంబంధ బాంధవ్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు. మన ఆలోచనలకు అనుగుణంగా కుటుంబ సభ్యులను మలుచుకోవాలని, సజావుగా, సానుకూలంగా కుటుంబ వ్యవస్థ కొనసాగేలా అభిప్రాయాలను పంచుకోవాలని ఆమె చెప్పారు. వ్యాపారం, రాజకీయాల్లో ప్రజా సంబంధాలతో పాటు విశ్వసనీయత కూడా దోహద పడుతుందని ఆమె అన్నారు. తన గురించి ఎక్కువ చెప్పుకుంటే రాజకీయాల్లో విజయం, విశ్వసనీయత పెరిగితే వ్యాపారంలో రాణిస్తారని డాక్టర్ జై మదాన్ చెప్పారు.

## మోడీకి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదు

**• ఈబీసీ బిల్లును స్వాగతిస్తున్నాం**



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి న్యాయ వ్యవస్థ, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. ఆస్థానాలాంటి అవినీతిపరుడు అలోక్‌పై ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకోవడంపై ప్రధానమంత్రి ఆలోచించాలని ఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఆయన విమర్శించారు. ఇలాంటి పరిస్థితులు సీబీఐ చరిత్రలోనే ప్రథమమని నారాయణ అన్నారు. కేంద్రం తమకు అనుకూలంగా ఉండే అధికారులను చెప్పుచేతల్లో పెట్టుకుని ప్రత్యర్థులపై దాడి చేస్తుందని ఆరోపించారు. రాఫెల్ కుంభకోణం బయటపడుతుందనే అలోక్ వర్మను తప్పించారని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన విమర్శించారు. ఇలాంటి చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. అసోం మండిపోతోంది... అందుకు కారణం బీజేపీయేనని, దేశంలో మతోన్మాద శక్తులను ఆ పార్టీ పెంచి పోషిస్తోందని మండిపడ్డారు. సిటిజన్ షిప్ పై పార్లమెంట్లో చేసిన చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అగ్ర వర్ణాల్లోని పేదలకు తెచ్చిన రిజర్వేషన్లను తాము స్వాగతిస్తున్నామని ఆయన హర్షం వ్యక్తం చేశారు. కానీ తీసుకొచ్చిన విధానం సరిగా లేదని, ఐదేళ్ళు నిద్రపోయి హడావిడిగా ఒక్కరోజులో పాస్ చేశారని విమర్శించారు. పెండింగులో ఉన్న మహిళా బిల్లుపై ఎందుకు చట్టం చేయట్లేదని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 19వ తేదీన కోల్ కత్తాలో తృణమూల్ పిలుపునిచ్చిన ర్యాలీకి తాము దూరంగా ఉంటున్నామని వెల్లడించారు.

# ప్రగతిపథంలో సింగరేణి

**• బొగ్గు రవాణాలో 122 శాతం • ఓబీ తొలగింపులో 257 .. అమ్మకాల్లో 132.. లాభాల్లో 314 శాతం వృద్ధి**




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ ఆవిర్భావం అనంతరం మంచి వృద్ధిరేటు సాధిస్తున్న ప్రభుత్వ సంస్థల్లో సింగరేణీ కాలరీస్ సంస్థ అగ్రభాగాన్న నిలిచింది. 129 ఏళ్ళ సింగరేణి సంస్థ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రగతి పథంలో దూసుకుపోతుంది. జాతీయ స్థాయిలో సింగరేణి సంస్థను నెంబర్ ఒన్‌గా నిలపాలనే ముఖ్యమంత్రి కెసీఆర్ చేసిన దిశనిర్దేశంతో కార్మికులు మరింత ఉత్సాహంతో పనిచేస్తూ సంస్థ పురోభివృద్ధికి సహకరిస్తున్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికై ముఖ్యమంత్రి కెసీఆర్ ఇచ్చిన హామీలన్నీ సంస్థ అమలుచేస్తుంది. సంస్థలో అనారోగ్య కారణాల రీత్యా ఉద్యోగుల వారసులకు ఉద్యోగాలు కల్పించడం, ఆసుపత్రుల ఆధునీకరణ, సంస్థ లాభాల్లో 27 శాతం సొమ్ము లాభాల వాటాగా కార్మికులకు చెల్లింపు వంటి హామీలను యాజమాన్యం అమలు చేసింది.

తెలంగాణ ఏర్పాడిన ఐదేళ్ళ కాలం (2014 -19) కాలంలో బొగ్గు రవాణాలో 200 లక్షల టన్నుల వృద్ధిని సాధించి, 122 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఓవర్ బర్డెన్ (ఓబి) తొలగింపులో 250 మిలియన్ల క్యూబిక్ మీటర్ల వృద్ధిని నమోదు చేసి, 257 వృద్ధిని సాధించింది. అమ్మకాల్లో 2014 -19 కాలంలో 13,000 కోట్ల రూపాయల (132 శాతం) వృద్ధిని నమోదు చేసింది. పన్నులు చెల్లించిన అనంతరం నిఖర లాభం కూడా పెరిగింది. రూ.1200 కోట్లు (314 శాతం) వృద్ధి నమోదు చేసింది.

ముఖ్యమంత్రి కెసీఆర్ ఆదేశాల మేరకు సింగరేణి సిఎండి ఎన్. శ్రీధర్ నేతృత్వంలో ప్రతీనెల సమీక్షలు నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తున్నారు. పాతయంత్రాల స్థానంలో సుమారు రూ.350 కోట్లతో కొత్త యంత్రాలను కొనుగోలు చేసి గనులకు అందజేశారు. యంత్ర వినియోగం భారీగా పెంచేందుకు మల్టీడిపార్టుమెంటల్ టీంలను ప్రతీగనిలోనూ ఏర్పాటు చేశారు. తెలంగాణ విద్యుత్ సంస్థలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, హర్యానా రాష్ట్ర విద్యుత్ సంస్థలు సింగరేణి నుంచి బొగ్గును కొనుగోలు చేస్తున్నాయి. కోలిండియా నుంచి బొగ్గు పొందే కొన్ని సంస్థలు సింగరేణి బొగ్గు కొనుగోలుపై ఆసక్తి చూపిస్తున్నాయి. దీంతో సింగరేణి బొగ్గుకు మరింత డిమాండ్ పెరిగింది. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సింగరేణి సంస్థ తన 48 గనులతోపాటు ఇతర రాష్ట్రాలలో అదనంగా ఏడు బ్లాకును చేపట్టే యోచనలో ఉంది. ఇప్పటికే ఒడిస్సాలో 500 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వులు ఉన్న నైనీబ్లాక్‌ను చేపట్టిన సంస్థ, అదే రాష్ట్రంలో న్యూపాత్రపురా బ్లాక్‌ను కూడా చేపట్టబోతుంది. అలాగే ఒడిస్సా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో ఆరు కొత్తబ్లాకులకై ప్రతిపాదనలు సింగరేణి సంస్థ సిద్ధం చేసింది. సింగరేణి సంస్థ విస్తరణపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్న ముఖ్యమంత్రి కెసీఆర్ ఇటీవల ప్రధానమంత్రిని కలిసి లేఖను అందజేశారు. కొత్తబ్లాకులు అందుబాటులోకి వస్తే అదనంగా 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సింగరేణి సంస్థ అందుకోనుంది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటి వరకు 19,036 మిలియన్ యూనిట్ల విద్యుత్ అందించి అత్యధిక పిఎల్ఎఫ్ సాధించిన ప్లాంట్‌గా జాతీయస్థాయిలో నాల్గొవ ర్యాంక్‌ను సాధించింది. ముఖ్యమంత్రి కెసీఆర్ ఆదేశాల మేరకు మరో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించడానికి సన్నాహాలు చేస్తోంది. పన్నెండు ప్రాంతాల్లో 300 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను నిర్మాణానికి కూడా రంగంలోకి దిగింది. దీనిలో భాగంగా తొలిదశలో 130 మెగావాట్ల సామర్థ్యంగల ప్లాంట్‌ను 2018 - 19లో పూర్తి చేసి ఉత్పత్తిని ప్రారంభించనుంది.

# సెట్స్ కన్వీనర్ల నియామకం

**• ఎంసెట్ కన్వీనర్‌గా మళ్లీ యాదయ్యే • ఎడ్‌సెట్ కన్వీనర్‌గా మృణాళిని • లాసెట్‌కు జీబీరెడ్డి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్రంలో వివిధ ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షల(సెట్స్) కన్వీనర్లను తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఎంపికచేసింది. ఎంసెట్‌కు తిరిగి యాదయ్యనే కన్వీనర్‌గా ఎంపిక చేసింది. గతంలోని సెట్స్‌లో లాసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, పీజీఈసెట్‌లకు కొత్త కన్వీనర్లను ఎంపిక చేశారు. ఈసెట్, ఫిజికల్‌ఎడ్యుకేషన్ సెట్స్‌కు పాత కన్వీనర్లనే తిరిగి కన్వీనర్లుగా నియమించింది.

**ప్రవేశ పరీక్షల తేదీలు, నిర్వహించే యూనివర్సిటీలు, కన్వీనర్ల వివరాలు...**

| సెట్ | తేదీలు | నిర్వహించే యూనివర్సిటీ | కన్వీనర్ |
|---|---|---|---|
| ఎంసెట్ | మే 3 నుంచి 9 వరకు | జెఎన్‌టియు హైదరాబాద్ | ప్రొఫెసర్ ఎన్ యాదయ్య |
| ఈ సెట్ | మే 11 | జెఎన్‌టియు హైదరాబాద్ | ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ |
| పిజికల్‌ఎడ్యుకేషన్ | మే 20 | మహాత్మాగాంధీ యూనివర్సిటీ | ప్రొఫెసర్ వి సత్యనారాయణ |
| ఐ సెట్ | మే 23, 24 | కాకతీయ యూనివర్సిటీ | ప్రొఫెసర్ సీహెచ్ రాజేశం |
| లా సెట్ | మే 26 | ఉస్మానియా యూనివర్సిటీ | ప్రొఫెసర్ జిబి రెడ్డి |
| పీజీ లా సెట్ | మే 26 | ఉస్మానియా యూనివర్సిటీ | ప్రొఫెసర్ జిబి రెడ్డి |
| పీజీ ఈ సెట్ | మే 27నుంచి 29 | ఉస్మానియా యూనివర్సిటీ | ప్రొఫెసర్ ఎం కుమార్ |
| ఎడ్ సెట్ | మే 30, 31 | ఉస్మానియా యూనివర్సిటీ | ప్రొఫెసర్ టి మృణాళిని |

## యూసీవోలో నారాయణ నేషనల్ టాపర్


డాక్టర్ పి. సింధూర




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** యూనిఫైడ్ సైబర్ ఒలింపియాడ్- 2019 రెండోదశ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు నేషనల్ టాపర్లుగా నిలించారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ తెలిపారు. జాతీయ స్థాయిలో యూనిఫైడ్ కౌన్సిల్ వారు యూసీవోను నిర్వహిస్తారు. రెండోదశ పరీక్ష ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్‌తోపాటు 3, 4, 5, 6,7,8, 9 ర్యాంకులను నారాయణ విద్యార్థులు సొంతం చేసుకున్నారని తెలిపారు. 10లోపు 54 ర్యాంకులను నారాయణ విద్యార్థులే సాధించారని తెలిపారు. 2, 5, 8 తరగతుల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకును కూడా సాధించారని స్పష్టం చేశారు. 50లోపు 219 ర్యాంకులు, 100లోపు 375 ర్యాంకులు సాధించినట్టు చెప్పారు. దేశంలో ఈ స్థాయిలో ఫలితాలు సాధించిన సంస్థ మరేది లేదని స్పష్టం చేశారు.

# కూటమిలో ఎవరెవరు?

• యూపీలో వేడెక్కిన రాజకీయాలు • బీజేపీ, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏకమైన ఎస్పీ, బీఎస్పీ
• ఎస్పీ, బీఎస్పీలతో ఉంటామంటున్న ఆర్ఎల్‌డీ • సీట్ల సర్దుబాటుపై మంతనాలు • పొత్తుపై నేడు కీలక ప్రకటన



**లక్నో:** దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో రాజకీయాలు వేడెక్కాయి. కాంగ్రెస్, బీజేపీలను నిలువరించేందుకు బీఎస్పీ, ఎస్పీ జతకట్టడంతో అక్కడి రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. మహాకూటమిలో సీట్ల సర్దుబాటుపై ఎడతెగని చర్చలు కొనసాగిన నేపథ్యంలో ఎవరికెన్ని స్థానాలు దక్కుతున్నాయనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. కూటమిలో కీలకంగా ఉన్న ఎస్పీ, బీఎస్పీలు మాత్రం మెజారిటీ స్థానాల్లో పోటీ చేసే సై అంటుండటంతో మిగతా పార్టీలకు ఎన్ని స్థానాలు కేటాయిస్తారనేది ఆసక్తికరంగా మారింది. అయితే మహాకూటమిలో తప్పకుండా ఉంటామని ఆర్ఎల్‌డీ పార్టీ అధ్యక్షుడు అజిత్ సింగ్ శుక్రవారం స్పష్టం చేయడంతో చర్చలు సఫలమైతే ఆ పార్టీకి కూడా సీట్ల సర్దుబాటు చేసే అవకాశం ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మధురలో మీడియాతో మాట్లాడిన అజిత్ సింగ్ బీజేపీ, కాంగ్రెస్ వ్యతిరేక కూటమిలో ఉంటామని స్పష్టం చేశారు. ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌తో ఆర్ఎల్‌డీ ఉపాధ్యక్షుడు జయంత్ సమావేశమయ్యారని, పొత్తు ఖాయం కానీ సీట్ల విషయంపై చర్చించలేదన్నారు. శనివారం లక్నోలో జరగనున్న మాయావతి, అఖిలేష్ యాదవ్‌ల సంయుక్త మీడియా సమావేశం గురించి తనకు సమాచారం లేదన్నారు.

**మెజారిటీ సీట్లు ఆ రెండు పార్టీలకే**


ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 లోక్‌సభ స్థానాలుండగా వాటిలో మెజారిటీ స్థానాలను ఎస్పీ, బీఎస్పీలే సర్దుబాటు చేసుకోవచ్చన్న ప్రచారం జోరందుకుంది. సమాజ్ వాదీ, బహుజన సమాజ్ వాదీ పార్టీలు చెరో 37 సీట్లలో పోటీ చేసేందుకు ఇప్పటికే ఒప్పందం కుదిరిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో అధికారిక ప్రకటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక అమేథీ, రాయ్‌బరేలీలలో పోటీ చేసేందుకు సరైన అభ్యర్థులు లేరని, ఆర్ఎల్‌డీకి రెండు స్థానాలు కేటాయించనున్నారని, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో మిగిలిన రెండు స్థానాలను చివరి సమయంలో వచ్చే మిత్రులకు కేటాయించనున్నారని అజిత్ సింగ్ పేర్కొనడం గమనార్హం. ఐదిలావుండగా జాట్లు అధికంగా నివసించే ప్రాంతాల్లోని ఆరు సీట్లను కేటాయించాలని ఆర్ఎల్‌డీ డిమాండ్ చేస్తోందని సమాచారం.

**ఆర్ఎల్‌డీ ఉన్నట్లా..లేనట్లా..**

బీఎస్పీ, ఎస్పీ ఏర్పాటు చేసిన మహాకూటమిలో ఆర్ఎల్‌డీ చేరుతుందని భావిస్తున్న సమయంలో నేడు లక్నోలో జరగనున్న బీఎస్పీ, ఎస్పీ అధినేతల మీడియా సమావేశానికి ఆర్ఎల్‌డీకి ఆహ్వానం లభించలేదని ఆర్ఎల్‌డీ నేత మసూద్ అహ్మద్ వెల్లడించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జయంత్ చౌదరి రాష్ట్రంలోనే ఉంటారని, ఆహ్వానం అందితే మీడియా సంయుక్త సమావేశంలో పాల్గొంటారని అహ్మద్ తెలిపారు. ఇదిలావుండగా అఖిలేష్ యాదవ్‌తో జయంత్ చౌదరి బుధవారం సమావేశమయ్యారు. దాదాపు గంట కుపైగా సమావేశమైన ఇరువురూ రాజకీయాల్ని చర్చించారు. కానీ రెండు పార్టీల నుంచి మీడియాకు సమాచారం వెల్లడించలేదు. ఆర్ఎల్‌డీ ఆరు లోక్‌సభ స్థానాలను డిమాండ్ చేస్తుండగా రెండు స్థానాలు కేటాయిస్తామని మహాకూటమి నేతలు చెబుతున్నారని సమాచారం.

## జర్నలిస్టు హత్యకేసులో డేరా బాబా దోషి

•17న శిక్ష ఖరారు చేయనున్న సీబీఐ న్యాయస్థానం




**న్యూఢిల్లీ:** డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను జర్నలిస్టు హత్యకేసులో దోషిగా నిర్ధారిస్తూ పంచకుల సీబీఐ న్యాయస్థానం శుక్రవారం తీర్పు నిచ్చింది. గుర్మీత్‌తోపాటు మరో ముగ్గురిని దోషులుగా నిర్ధారిస్తూ సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జగ్దీప్ సింగ్ ఈ మేరకు తీర్పు ప్రకటించారు. హత్యకేసులో దోషులందరికీ ఈ నెల 17న శిక్షలు ఖరారు చేయనున్నారు. 2002లో సిర్సాకు చెందిన జర్నలిస్టు రాంచందర్ ఛత్రపతిని హత్యచేశారని గుర్మీత్‌పై కేసు నమోదైంది. శుక్రవారం విచారణకు దోషులుగా తేలిన ముగ్గురు వ్యక్తులు న్యాయస్థానానికి హాజరవగా, డేరా బాబా జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. హత్యకుముందు జర్నలిస్టు ఛత్రపతి పూరా సచ్ పేరుతో ఓ పత్రికను నడిపేవారు. ఆయన తన పత్రికలో ఓ గుర్తు తెలియని వ్యక్తి లేఖ రాశారని డేరా సచ్చా సౌదా ప్రధాన కేంద్రంలో బాలికలు, మహిళలు లైంగికదోపిడీకి గురవుతున్నారని తన పత్రికలో ప్రచురించారు. అనంతరం 2002 అక్టోబరులో ఛత్రపతిపై గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరపగా గాయపడిన ఆయన అనంతరం మరణించారు.

## బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు



**చెన్నై:** బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ కరాఖండిగా తేల్చి చెప్పారు. ప్రధాని మోడీ అభ్యర్థన్ని స్టాలిన్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. అన్నాడీఎంకే, డీఎంకే తదితర పాత మిత్రులకు బీజేపీ ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంచుతుందని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఈ మేరకు ప్రకటించారు. బీజేపీతో డీఎంకే పొత్తు పెట్టుకోదన్నారు. ప్రధాని మోడీ తనను తాను వాజ్‌పేయితో పోల్చుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మోడీ మాజీ ప్రధాని వాజ్‌పేయి కాదు. మోడీ నేతృత్వంలో పొత్తు ఆరోగ్యకరం కాదని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను మోడీ సర్కారు అణచివేస్తోందన్నారు. వాజ్‌పేయి ఎన్నడూ విభజన రాజకీయాలను సమర్థించలేదని అందుకే ఆయనకు డీఎంకే మద్దతు ఇచ్చిందని స్టాలిన్ అన్నారు. కాగా ప్రధాని మోడీ తమిళనాడు బీజేపీ కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల పొత్తుల నిమిత్తం గతంలో జట్టుకట్టిన అన్నాడీఎంకే, డీఎంకే మిత్రపక్షాలకు తలుపులు తెరిచే ఉంచామన్నారు. బీజేపీ ఎంటిగా మెజార్టీ సాధించినా మిత్రపక్షాలతో సంకీర్ణ ప్రభుత్వాన్నే ఏర్పాటు చేసిందని మోడీ అన్నారు.

## సీట్ల పంపకాలపై ఆర్జేడీ ప్రతిపాదనకు కాంగ్రెస్ నో



**పాట్నా:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సీట్ల పంపకాలపై ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ప్రతిపాదనను కాంగ్రెస్ పార్టీ తిరస్కరించింది. భాగస్వామ్య పక్షాలకు ఆర్జేడీ సీట్ల పంపిణీలో కాంగ్రెస్‌కు 10 సీట్లు, ఆర్ఎల్ఎస్పీకి, లెఫ్ట్ పార్టీలకు 4 సీట్లు, హెచ్ఏఎంకు 2 సీట్లు, ఎల్‌జేడీ, వీఐపీ ఇన్‌సాన్ పార్టీకి చెరో సీటు చొప్పున ఆఫర్ చేసింది. ఈ ప్రతిపాదనను కాంగ్రెస్ తిరస్కరించింది. అయితే 40 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ కనీసం 20 స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ ధీమా వ్యక్తం చేసింది. లెఫ్ట్ పార్టీలు సైతం 11 స్థానాలను డిమాండ్ చేశాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 81 ఎమ్మెల్యే సీట్లను గెలిచి ఆర్జేడీ అతిపెద్ద పార్టీగా అవతరించిన విషయం విదితమే.

## ఆ సీఎంను దొంగ అన్నందుకు టీచర్ సస్పెన్షన్


**భోపాల్:** జబల్‌పూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముఖేష్ తివారీ ఓ సమావేశంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్‌ను దొంగ అని సంబోధించిన నందుకు ఆ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. రాష్ట్రంలో బీజేపీ దాదాపు గత 14 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్నప్పుడు అనేక సమస్యలున్నాయి. సమస్యలపై నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కార్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. సొంత మనుషులే సమస్యలు సృష్టిస్తున్నారు. మాజీ సీఎం చౌహాన్, ప్రస్తుత ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ఇద్దరూ దొంగలే అని తివారీ సమావేశంలో పేర్కొన్నారు. తివారీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు నిరసన వ్యక్తం చేస్తూ, ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేయగా, తివారీని ఉపాధ్యాయ విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా ఉన్నతాధికారులు ప్రకటించినట్లు సమాచారం.

## ఫిబ్రవరి1 వరకు అరెస్ట్ నుంచి మినహాయింపు



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చిదంబరానికి ఢిల్లీ న్యాయస్థానం నుంచి మరోసారి ఊరట లభించింది. ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసులో అరెస్టు చేయొద్దని ఢిల్లీ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను కోర్టు మరోసారి పొడిగించింది. ఫిబ్రవరి 1వరకు ఆయనను సీబీఐ, ఈడీ నమోదు చేసిన ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసులో అరెస్టు చేయొద్దని సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి ఓపీ సైనీ ఆదేశించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సీబీఐ తరఫున న్యాయస్థానం ఎదుట హాజరవగా, చిదంబరం ఆయన తనయుడు కార్తీ చిదంబరం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఏఎం సింఘ్వీ హాజరయ్యారు. కాగా సీబీఐ కేసు ఆధారంగా ఈడీ నమోదు చేసిన మనీలాండరింగ్ కేసును కూడా ఈడీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నితీశ్ రాణా వినతిమేరకు కోర్టు వాయిదా వేసింది.

## ఎమర్జెన్సీ యోచనలో ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా-మెక్సికో సరిహద్దులో వివాదాస్పద గోడకు నిధులు సమకూర్చేందుకు జాతీయ అత్యవసర స్థితిని విధించేదిశగా అడుగులు వేస్తున్నారు. యూఎస్-మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణం అంశం ఇప్పటికే 21రోజులుగా షట్‌డౌన్‌కు దారితీసింది. బోర్డర్ వాల్ నిర్మాణానికి ట్రంప్ కాంగ్రెస్‌ను 5.7బిలియన్ డాలర్లు కోరుతున్నారు. ఈ గోడ నిర్మాణం జరిగితే అమెరికాలోకి మెక్సికో సరిహద్దు నుంచి అక్రమ వలసదారులను అడ్డుకోవడంతో పాటు డ్రగ్స్ రవాణా కూడా తగ్గుతుందని ట్రంప్ వాదిస్తున్నారు. అయితే ట్రంప్ విన్నపాన్ని డెమొక్రాట్లు పదేపదే తిరస్కరిస్తున్నారు. మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు అందించేందుకు నిరాకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ గురువారం దక్షిణ సరిహద్దులోని టెక్సాస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ట్రంప్ మరోసారి గోడ నిర్మాణం అంశాన్ని ప్రస్తావిస్తూ దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధిస్తే ఎదురయ్యే న్యాయపరమైన సవాళ్లపై దృష్టి సారించారు. సరిహద్దు గోడ నిర్మాణం ఖర్చుతో కూడినదైనా ప్రతి ఏడాది ఖర్చును తగ్గించి దానికంటే ఎక్కువే పొదుపు చేయవచ్చన్నారు. బుధవారం డెమొక్రాట్లు సమావేశం నుంచి వాకౌట్ చేసిన ట్రంప్ మాట్లాడుతూ డెమొక్రాట్లు గోడ నిర్మాణానికి అవసరమైన 5.7 బిలియన్ యూఎస్‌డాలర్లు కేటాయించకపోతే దేశంలో అత్యవసర పరిస్థితి విధించేసి మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి చివరి అవకాశం అన్నారు.

## మందుపాతర పేలి ఆర్మీమేజర్, సైనికుడు మృతి

**జమ్మూ:** జమ్మూ-కశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలోని నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదులు అమర్చిన మందుపాతర పేలడంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఓ ఆర్మీ మేజర్‌తోపాటు ఒక సైనికుడు ప్రాణాలు విడిచారు. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఇద్దరూ కన్నుమూశారని అధికారులు వెల్లడించారు. నౌషెరా సెక్టార్‌లోని లాం బెల్ట్ నియంత్రణ రేఖ వెంబడి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉగ్రవాదులు ఈ మందు పాతరను అమర్చారని అధికారులు తెలిపారు. పాకిస్తాన్ సరిహద్దు దళాల దాడులతో ఆర్మీ సైనికులు అప్రమత్తమయ్యారని అధికారులు వెల్లడించారు.

# నియోజకవర్గ కమిటీలను త్వరలో వేస్తా

• నాలుగేళ్లుగా అవమానాలు భరించా • ఎంతోమందిని ప్రభావితం చేశా
• విభజించి పాలించడానికి వ్యతిరేకం • నా భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తా : జనసేనాని పవన్‌కల్యాణ్



**ఏలూరు, ప్రభన్యూస్:** త్వరలో పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో పార్టీ కమిటీల్ని నియమించనున్నట్లు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు. ఇందుకోసం త్వరలో జిల్లా స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణానికి సమయం ఆసన్నమైందన్నారు. శుక్రవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో పశ్చిమగోదావరి జిల్లా శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పవన్ మాట్లాడుతూ రాత్రికి రాత్రే పార్టీ నిర్మాణం సాధ్యం కాదన్నారు. జనసేన నాయకుడిగా తన నడవడిదగా ఉంటుందో కార్యకర్తలకు తెలియజేసిన తర్వాతే వాళ్ళని కూడా తన దారిలో నడవమని చెప్తూనిగాన్నారు. ఇందుకు నాలుగేళ్ల సమయం పట్టిందన్నారు ఈ నాలుగేళ్లలో ఎన్నో అవమానాలు భరించానన్నారు. ఎందర్నో ప్రభావితం చేశానన్నారు. ఎన్నో సమావేశాలు పెట్టి తన ఆలోచనలను ఆచరణలో విసరించానన్నారు. ప్రజా సంక్షేమమే తనకు ముఖ్యమన్నారు. విభజించు పాలించడాన్ని తాను వ్యతిరేకిస్తానన్నారు. తన భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. ఇందుకోసం 25ఏళ్ళు పని చేయడానికి సిద్ధమైన రాజకీయాల్లో కొచ్చానన్నారు. రాజకీయాల్లో అవమానాల్లో పాటు విమర్శలకులు కూడా ఉంటారన్నారు. అన్నింటినీ తాను సమంగా భరిస్తున్నారు. ప్రజా జీవితంలో ఇష్టమని సారం మాట్లాడే హక్కు లేదన్నారు. తనవెన్ని విమర్శించినా ఆచితూచిస్పందిస్తానన్నారు. ఏ పార్టీకి ఏకనాయకత్వం సరికాదన్నారు. రాష్ట్రంలో ఒకరు మూడు దశాబ్దాల పాటు ముఖ్యమంత్రి పదవి ఆశిస్తున్నారు. మరొకరు ఇంకో సారి సీఎం చేయండం టున్నారు. కానీ ప్రజలు మాత్రం తమకు 25కిలోల బియ్యం కాదు.. 25ఏళ్ళ భవిష్యత్ ఇవ్వండంటూ ఆకాంక్షిస్తున్నారన్నారు. నాయకులు కలసికట్టుగా బలహీనవర్గాల వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. సంప్రదాయ రాజకీయాల్లో మార్పులకు జనసేన అంకురార్పణ చేస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీని నమ్మితాను మద్దతిస్తే తన అంచనాలకు మించి ఆ పార్టీ అవినీతిలో కూరుకు పోయిందని పవన్ ఆరోపించారు. దెందులూరు నియోజకవర్గంలోని దళితులు స్థానిక ఎమ్మెల్యే పై పలు ఆరోపణలు చేస్తున్నారు. కానీ అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టేందుకు ప్రభుత్వం భయపడుతోందన్నారు. ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని రాజకీయాల్లో మార్పులకునుగుణంగా మార్చుకోవాలన్నారు.

# చర్యలు తీసుకుంటేనే చర్చలు

• ఉగ్రవాదులతో టచ్‌లో పాక్ మంత్రులు • పాక్‌కు స్పష్టం చేసిన భారత్



ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ మద్దతునిస్తోందని, ఉగ్రవాదాన్ని సంప్రదాయంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శలు గుప్పించారు.

**న్యూఢిల్లీ:** శాంతి చర్చలకు భారత్ స్పందించడం లేదంటూ పాకిస్తాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ ఆరోపణలకు భారత ప్రభుత్వం బదులిచ్చింది. చర్చల పట్ల పాకిస్తాన్ చిత్తశుద్ధితో లేదని, ఉగ్రవాదాన్ని సంప్రదాయంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని భారత విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి రవీష్ కుమార్ విమర్శించారు. పాకిస్తాన్ వ్యాఖ్యలు తనకు అర్థకావడం లేదని, ఇమ్రాన్ ఖాన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో ఫోన్ చేసి భారత ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలిపారు. భారత్‌లోని ఉన్నతాధికారులు కూడా శుభాకాంక్షలు తెలిపారని ఆయన అన్నారు. పాక్‌లోని ఉగ్రవాద, ఉగ్రవాద కార్యకలాపాలను నిర్మూలించాలని సూచించారు. చర్చలకు సిద్ధమని చెప్తున్న పాకిస్తాన్ మంత్రులు అంతర్జాతీయ ఉగ్రవాదులతో అనేక వేదికలను ఎందుకు పంచుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. సెప్టెంబర్ 30న జమాత్ ఉద్ దవా చీఫ్ హఫీజ్ సయీద్‌తో పాకిస్తాన్ మంత్రి నూర్ ఉల్ హక్ ఖ్వాద్రి బహిరంగ వేదికను పంచుకున్నారని, ఈ సమావేశంలో ఇరువురూ భారత వ్యతిరేక నినాదాలు చేశారని, పాక్ ఆక్రమిత్ కశ్మీర్‌లో ఉగ్రవాద గ్రూపులను ఏర్పాటు గురించి మాట్లాడారని రవీష్ కుమార్ తెలిపారు. చర్చలు జరపాలనుకుంటే ముంబై, పఠాన్‌కోట్ దాడులకు పాల్పడిన ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలని కుమార్ డిమాండ్ చేశారు. నిషేధిత ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ మద్దతు కొనసాగుతోందని, పాక్ వైఖరిలో ఎలాంటి మార్పులేదని ఆయన అన్నారు. ఆర్థిక పరిస్థితి చక్కదిద్దుకునేందుకే పాకిస్తాన్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తోందని కుమార్ విమర్శించారు.

## భారతీయ ఐటీ నిపుణులకు ట్రంప్ గుడ్‌న్యూస్




• త్వరలో హెచ్-1బీ వీసాలలో సవరణలు

**వాషింగ్టన్:** డొనాల్డ్ ట్రంప్.. ఈ పేరు చెబితే అమెరికాలోని హెచ్-1బీ వీసాదారులు వణికిపోతుంటారు. ఎప్పుడు ఎలాంటి ప్రకటన వస్తుందోనని ఆందోళనకు గురవుతుంటారు. కానీ శుక్రవారం డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒకే ఒక్క ట్వీట్ అమెరికాలోని హెచ్-1బీ వీసాదారులకు ఆనందాన్ని కలుగజేస్తోంది. అమెరికా లోని హెచ్-1బీ వీసాదారులు ఇకపై భరోసాగా ఉండొచ్చు. అమెరికాలో నివసించేందుకు, పౌర సత్వాన్ని సులభంగా పొందేందుకు త్వరలో మార్పులు చేయనున్నాం. సమర్థ వంతమైన, అధిక నైపుణ్యం కలిగినవారు అమెరికాలో జీవితాన్ని కొనసాగించేందుకు ప్రోత్సహించనున్నాం.. అని ట్రంప్ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ అనేకమంది ఐటీ నిపుణులను ఆశ్చర్యానికి, అమితా నందానికి గురిచేస్తోంది. హెచ్-1బీ వీసా విషయంలో కఠిన నిబంధనలు తీసుకొస్తామని మొదటి నుంచి హెచ్చరిస్తున్న ట్రంప్ వ్యాఖ్యలపై కఠిన నిబంధనల విషయంలో గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ట్రంప్ తాజా ట్వీట్ చూసి ఐటీ నిపుణులు సంబరపడుతున్నారు. అత్యధిక హెచ్-1బీ వీసాలు పొందుతున్న భారతీయ ఐటీ నిపుణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పౌరసత్వం, గ్రీన్‌కార్డు కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న భారతీయ ఐటీ నిపుణులకు ఆశలు ట్రంప్ ట్వీట్‌తో ఒక్కసారిగా చిగురించాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

## రొమైన్ రోలాండ్ పురస్కారానికి 3 పుస్తకాలు

**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ నుంచి మలయాళం, తమిళంలోకి అనువదించిన మూడు పుస్తకాలను రొమైన్ రోలాండ్ పురస్కారానికి ఎంపికయ్యాయి. రొమైన్ రోలాండ్ బహుమతిని ఫ్రెంచ్‌నుంచి ఇంగ్లీష్‌తో సహా ఏ భారతీయ భాషల్లోకి అనువదించిన పుస్తకాలకు బహూకరిస్తారు. అదేవిధంగా ఈ ఏడాది కూడా ఫ్రెంచ్‌నుంచి ప్రాంతీయభాషల్లోకి అనువదించిన వ్యాసాలు, కల్పితకథలు తదితర పుస్తకాలనుంచి మూడు పుస్తకాలను ఇండో-ఫ్రెంచ్ జ్యూరీ ఎంపికచేసింది. లైఫ్ ఆఫ్ ఎన్ అన్‌నోన్ మేన్, మలయాళంలోకి ప్రభ ఆర్ ఛటర్జీ అనువదించిన రెనెస్ డిబ్రేటరించిన రివల్యూషన్ ఇన్ దిరివల్యూషన్, మలయాళంలోకి రఘుపతి గోవాజవ అనువదించిన జార్జియర్ అండర్సన్ మేకిన్ రచించిన ఆండ్రోయిడ్ మేకిన్, తమిళంలోకి ఎస్ ఆర్ కిశోర్ తమిళంలోకి అనువదించిన ఆల్బెర్ట్ కామెస్ రచించిన ది ప్లేగ్ అనువాదం తమిళంలోకి తదితర పుస్తకాలను జ్యూరీ షార్ట్‌లిస్ట్ చేసింది. కాగా జైపూర్ సాహితీ ఉత్సవాల్లో 2018 జనవరిలో ఈ పురస్కారం ప్రారంభమైంది. రొమైన్ రోలాండ్ పుస్తక బహుమతికి ప్రతిష్టాత్మక పురస్కారం, అవార్డు విజేతకు, పుస్తకాన్ని ప్రచురించిన పబ్లిషర్‌కు ఈ ఏడాది మార్చిలో జరిగే పారిస్ బుక్ ఫెయిర్ 2019కు ఆహ్వానం అందుతుంది. ఈ నెల 25న జైపూర్‌లో పురస్కార విజేతను ప్రకటిస్తారు.

## సోషల్ మీడియాలో రాజకీయ కామెంట్‌లు ఆపలేం


• ముంబై హైకోర్టుకు ఈసీఐ వెల్లడి

**ముంబై:** ఎన్నికల తేదీకి 48గంటలకు ముందు ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా లేదా అనుకూలంగా ప్రైవేటు వ్యక్తులు చేసే రాజకీయ వ్యాఖ్యానాలను నిరోధించలేమని ఎన్నికల కమిషన్ శుక్రవారం ముంబై హైకోర్టుకు విన్నవించింది. న్యాయవాది సాగర్ సూర్యవంశీ ప్రజాప్రయోజన వ్యాజ్యానికి సంబంధించి ఈసీ తమ న్యాయవాది ప్రదీప్ రాజ్‌గోపాల్ ద్వారా తమ ప్రతిస్పందన తెలియజేసింది. కాగా ఎన్నికలు జరిగే రోజుకు 48గంటల ముందుగా యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విటర్ వంటి సోషల్‌మీడియాలో ప్రైవేట్ వ్యక్తులు రాజకీయాలు లేదా ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు పోస్టు చేయకుండా ఈసీఐ నిషేధం విధించాలని పిల్‌లో న్యాయవాది సాగర్ సూర్యవంశీ కోరారు. ఈ సందర్భంగా ముంబై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నరేశ్ పాటిల్, జస్టిస్ ఎన్ఎం జామ్దార్‌తో కూడిన ధర్మాసనంతో ఈసీ మాట్లాడుతూ ఇప్పటికే రాజకీయనాయకులు, రాజకీయ పార్టీలు పోలింగ్ 48గంటలకు ముందు ఎటువంటి ప్రకటనలు, కామెంట్లు చేయకుండా నిబంధనలు అమలులో ఉన్నాయని తెలిపింది. సోషల్ మీడియాకూ కూడా ఈ నిబంధన వర్తిస్తుందన్నారు.

## మరో ఇద్దరికి సుప్రీం జడ్జీలుగా పదోన్నతి

**న్యూఢిల్లీ:** కర్నాటక, ఢిల్లీ హైకోర్టుల న్యాయమూర్తులకు సుప్రీంకోర్టు కొలీజియం ప్రమోషన్ ఇస్తూ నిర్ణయం తీసుకుంది. కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దినేష్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కొలీజియం ఈ నిర్ణయం తీసుకుంది. కొలీజియంలో న్యాయమూర్తులు ఏకే సిక్రీ, ఎస్ఏ బోబ్డే, ఎన్‌వీ రమణ, అరుణ్ మిశ్రాలు సభ్యులుగా ఉన్నారు. ఇద్దరు న్యాయమూర్తుల పదోన్నతికి సంబంధించిన వివరాలను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

## మైనారిటీల విషయంలో పాక్ బెస్ట్



**న్యూఢిల్లీ:** పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుంచి భారత్‌కు వలస వచ్చిన ఆరు ముస్లిమేతర మైనార్టీ వర్గాలకు భారత పౌరసత్వం కల్పించేందుకు రూపొందిస్తున్న పౌరసత్వ సవరణ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాలు, ముఖ్యంగా అస్సాంలో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీపై జమ్మూ-కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ విమర్శలు గుప్పించారు. మైనార్టీల విషయంలో పాక్ అనుసరిస్తున్న విధానాలతో భారత విధానాలను పోల్చి కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. మతం ఆధారంగా పౌరసత్వం కల్పించడం భయానకమని, అసహ్యకరమని ఆమె వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ తన విధానాల ప్రకారం మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తే విభజనగా భావిస్తామని చెప్పిన ఆమె.. మతప్రాతిపదికన ఏర్పడినప్పటికీ పాకిస్తాన్ మైనార్టీలపట్ల పాకిస్తాన్ తన దృక్పథాన్ని మార్చుకుందని, అక్కడి ఆలయాలను జాతీయ వారసత్వ సంపదగా ప్రకటించడంతోపాటు హిందూ వివాహ బిల్లును ఆమోదించిందని ఆమె గుర్తుచేశారు. పౌరసత్వ సవరణ బిల్లును రద్దు చేయాలంటూ ఈశాన్య రాష్ట్రాలు, ముఖ్యంగా అస్సాంలో ఆందోళనలు చెలరేగుతుండగా ఆందోళనకారులకు భరోసా ఇవ్వడం లేదని ఆమె ఆరోపించారు.

## మిచెల్‌కు దౌత్య అనుమతి



**న్యూఢిల్లీ:** ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న క్రిస్టియన్ మిచెల్ తన కుటుంబ సభ్యులు, న్యాయవాదులతో మాట్లాడేందుకు అనుమతిని ఇవ్వనుంది. బ్రిటిష్ హైకమిషన్ అభ్యర్థనకు భారత ప్రభుత్వం నుంచి దౌత్యపరమైన అనుమతి లభించింది. అనుమతి లభించిన నేపథ్యంలో గత నెలలో బ్రిటిష్ హైకమిషన్ అభ్యర్థనను గురువారం అనుమతి ఇచ్చామని భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న మిచెల్‌ను బ్రిటిష్ హైకమిషన్‌కు చెందిన ఒక అధికారి కలిశారని ఆయన మీడియాకు వెల్లడించారు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడేందుకు అనుమతి కోరుతూ ఢిల్లీ కోర్టులో మిచెల్ వేసిన పిటిషన్‌పై వచ్చిన అనేక వివరాలను ప్రశ్నించగా రవీష్ స్పందించారు.

## మోడీకి ఇంగ్లీష్ మాట్లాడటం రాదు



**కోల్‌కత:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి ప్రధాని నరేంద్ర మోడీపై విరుచుకుపడ్డారు. ఎన్నికల దృష్టిలో పెట్టుకుని వాస్తవాలను వక్రీకరిస్తున్న ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ సినిమా చిత్రీకరించారని, ఇది నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ వ్యక్తి యదార్థంగానే ప్రధాని మంత్రి అవుతారని, ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ సినిమా ద్వారా దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఎన్నికల ముందు మన్మోహన్ సింగ్‌పై సినిమా తీసినవాళ్లు నరేంద్ర మోడీపై వచ్చే సినిమాను కూడా చూడాలని, డిజాస్టర్ ప్రైమ్ మినిస్టర్ అనే సినిమా తీయాలని, భవిష్యత్తులో తీస్తారని మమత అన్నారు. కొంతమంది ఎన్నికల ప్రచారాలు ఉదుతున్నారని, వాస్తవాలు వక్రీకరిస్తూ సినిమాలు తీస్తున్నారని పాండించారు. బెంగాల్‌లో యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ సినిమా విడుదలైన థియేటర్ల వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆందోళనలను ప్రస్తావిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీని గబ్బర్‌సింగ్‌గా వర్ణించిన ఆమె.. మోడీ ముందు నుంచి అబద్ధాలు ఆడుతున్నారని, మోడీకి ఇంగ్లీష్ మాట్లాడటం రాదని, కనీసం సరిగా ఇంగ్లీష్ మాట్లాడడం రాదని విమర్శించారు.

## ఆకుముక్కు గబ్బిలాలను కాపాడాలి

• కేంద్రానికి ఓయూ రీసెర్చ్ టీమ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రకృతికి మేలు చేసే అరుదైన ఆకు ముక్కు గబ్బిలాలను కాపాడాలని కర్నాటక, కేంద్ర ప్రభుత్వాలను ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధన బృందం కోరింది. మను షులకు హాని కలిగించే కీటకాలను ఈ గబ్బిలాలు తింటాయి. కర్నాటక కోలార్ ప్రాంతంలోని హనుమాన్ క్వారీ గుహలలో గబ్బిలాలు ఉంటున్నాయి. గుహల సమీపంలో క్వారీ పనులు జరుగుతున్నందున ఆకు ముక్కు గబ్బిలాలు అంతరించిపోతున్నట్లు ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధన బృందం గుర్తించింది.

## గుట్కా మాముళ్లు ఇవ్వలేదని దాడి

తుర్కపల్లి పోలీసుల ప్రతాపం.. వ్యాపారి పరిస్థితి విషమం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** యాదాద్రి జిల్లాలో గుట్కా మామూళ్లు ఇవ్వలేదని చిరు వ్యాపారిపై తుర్కపల్లి పోలీసులు ప్రతాపం చూపించారు. చిరు వ్యాపారి పరిస్థితి విషమించడంతో భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చౌటుప్పల్ నియోజకవర్గం పరిధిలోని తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో సోలీపేట సత్యనారాయణ అనే చిరు వ్యాపారిపై గురువారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. దాడిలో సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే భువనగిరి ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని కాపాడలేమని డాక్టర్లు చెప్పడంతో భువనగిరికి పంపించారు. శుక్రవారం ఉదయం పోలీసుల దాడిని నిరసిస్తూ వ్యాపారస్తులు, బంధువులు పోలీస్‌స్టేషన్ ముట్టడికి యత్నించారు. సత్యనారాయణ ఆరోగ్యం మరింత క్షీణిస్తున్నందని సమాచారం రావడంతో పోలీసులు ఆయన కుటుంబసభ్యులతో రాజీకి ప్రయత్నాలు మొదలుపెట్టారు.



యూఏఈ ఉపాధ్యక్షుడు, ప్రధానమంత్రితో రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నేతలు

# మోడీజీ.. ప్రజల కష్టాలను పంచుకోండి

• విదేశాల్లోని భారతీయులకు చేయూతనివ్వండి • కార్మికుల సమస్యలను పరిష్కరించండి • ప్రధాని మన్‌కీ బాత్‌పై రాహుల్ విమర్శలు

**దుబయ్:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్‌పై విమర్శలు గుప్పించారు. మోడీ మాట్లాడాల్సింది ఆయన మనసులోని భావాల గురించి కాదు.. ప్రజల బాధల గురించి.. అని రాహుల్ మండిపడ్డారు. రెండ్రోజుల దుబయ్ పర్యటనకు వెళ్లిన రాహుల్ గాంధీ.. అక్కడి భారతీయ కార్మికుల సమస్యలపై ఆరాతీశారు. విదేశాల్లో భారతీయులకు కలుగుతున్న ఇబ్బందులను మోడీ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదన్న రాహుల్... మన్ కీ బాత్ లో ఈ అంశాలపై ప్రసంగించాలని డిమాండ్ చేశారు. దుబయ్‌లో భారతీయ కార్మికులు పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్న సమస్యలు కాంగ్రెస్ పార్టీకి తెలుసన్న రాహుల్.. తాము ఎల్లప్పుడు కార్మికుల బాధలను పంచుకునేందుకే ప్రయత్నిస్తామన్నారు. మీరిక్కడ రేయింబవళ్లు కష్టపడి పనిచేస్తారు.. పైసా..పైసా కూడబెట్టి మన దేశంలోని మీ వాళ్లకు పంపిస్తారు. ఇంతగా కష్టపడుతున్న మీలాంటి వారి గురించి మాట్లాడాల్సిన అవసరం ఎంతైన ఉంది. అని రాహుల్ కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. నా మనసులో ఏముందో చెప్పేందుకు నేనిక్కడికి రాలేదు. మీ మనసులోని బాధను పంచుకునేందుకు దుబయ్ వచ్చా.. అంటూ జబెల్ అలీ కార్మిక కాలనీ వాసులతో రాహుల్ చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతి నెల చివరి ఆదివారం రేడియా ద్వారా మన్ కీ బాత్ పేరుతో ప్రసంగిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. దేశంలోని వివిధ అంశాలతో పాటు విదేశాల్లో బాధలు ఎదుర్కొంటున్న భారతీయ కార్మికుల గురించి కూడా మోడీ మాట్లాడాలని రాహుల్ హితవు పలికారు. ఇక్కడ కనిపిస్తున్న పెద్దపెద్ద భవనాలు, విశాలమైన విమానాశ్రయాలు, మెట్రో రైలు మీ కష్టం లేకుండా నిర్మితమైనవి కావు.. దుబయ్‌లోని ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో మీ భాగస్వామ్యం ఉంది. మీరు చెమటోడ్చి, రక్తాన్ని చిందిస్తేనే ఇక్కడ ఆకాశ హార్మ్యాలు నిర్మితమయ్యాయి. ప్రతీ మతంలో మీ పేర్లు ప్రకాశిస్తున్నాయి. ప్రతీ రాష్ట్రం, ప్రతీ కులంలో మీ సేవలు కనిపిస్తున్నాయి. అని రాహుల్ చెప్పుకొచ్చారు.

## మనమే గెలుస్తున్నాం..

వచ్చే లోక్‌సభ ఎన్నికల గురించి ప్రస్తావిస్తూ.. యుద్ధం ప్రారంభమైంది.. మనమే గెలువబోతున్నాం... అని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కేరళ నాయకుడు ఊమెన్ చాంధీ, కాంగ్రెస్ పార్టీ విదేశీ వ్యవహారాల చైర్మన్ శ్యామ్ పిట్రోడాలతో కలిసి భారతీయ కార్మికులతో రాహుల్ ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. అంతకు ముందు దుబయ్‌లోని భారతీయ వ్యాపారవేత్తలతో భేటీ అయిన రాహుల్ గాంధీ.. పనికోసం వలసవచ్చిన భారతీయుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. దుబయ్ పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ.. ఆదేశ మంత్రులతోనూ సమావేశమై భారతీయ కార్మికుల సమస్యల పరిష్కారంపై చర్చలు జరిపారు.

# మేమొస్తే ఏపీకి ప్రత్యేక హోదా

ప్రజల చిరకాల స్వప్నాన్ని నెరవేరుస్తాం: దుబాయ్‌లో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ

**దుబయ్:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఏపీపై స్పె షల్ ఫోకస్ పెట్టారా..2019 లోక్‌సభ ఎన్నికలతో పార్టీకి పునర్ వైభవాన్ని తీసుకొచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నారా..? రాహుల్ వ్యాఖ్యలు చూస్తుంటే ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తోంది. పార్టీ కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు ప్రజల్లో బలం గా నాటుకున్న అంశాలనే ప్రధాన హామీలుగా ఎన్నికలకు వెళ్లేలా రాహుల్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల స్వప్నమైన ప్రత్యేక హోదాపై రాహుల్ స్పష్టమైన వైఖరితో ముందు కెళ్లతున్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని దేశ రాజధాని ఢిల్లీలో.. పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ నాయకులతో ఆందోళన చేయిస్తున్న రాహుల్... హోదాపై తన మనసులోని మాటను బయటపెట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు. రెండ్రోజుల పాటు దుబ య్ పర్యటనకు వెళ్లిన రాహుల్ గాంధీ.. ఆదేశంలోని భారతీయ కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ కార్యకర్తలు గతేడాది ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ... 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకొస్తే ప్రత్యేక హోదా హామీకే ప్రథమ ప్రాధాన్య తనిస్తామని పేర్కొన్నారు. మనమంతా ఐక్యం గా ముందుకు సాగితే ఏపీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రధాని మోడీని కూడా ఒప్పించ గలమన్న విశ్వాసం తనకుందని రాహుల్ చెప్పుకొచ్చారు.

**దుబయ్ ఉన్నతిలో మీ కృషి అమోఘం**


కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తాం.. మీరు భారత్‌కు, మన దేశపేద ప్రజలకు సాయం చేశారు. దుబయ్‌ని కూడా ప్రపంచంలోని గొప్ప నగరంగా తీర్చిదిద్దడంలో మీ పాత్ర మరువలేనిది. దుబయ్ నగర ఉన్నతి కోసం చెమటోడ్చి, రక్తాన్ని ధార పోశారు. భారతీయులపై ఇక్కడి ప్రజలకు ఆదరాభిమానాలు పెరిగేలా కృషి చేస్తున్నారు. అందుకు మీకు హృదయ పూర్వక ధన్యవాదాలు. అని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు.



దుబయ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కి

## తొలిదశ తెలంగాణ ఉద్యమ దివ్వె చెన్నారెడ్డి

• రేపు శతజయంతి ఉత్సవాలు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : ఈనెల 13న దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మర్రి శశిధర్‌రెడ్డి తెలిపారు. ఇందిరా పార్క్ రాక్‌గార్డెన్‌లోని చెన్నారెడ్డి సమాధి వద్ద ఉదయం 9గంటలనుంచి భజనలు, సర్వమత ప్రార్ధనలు జరపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అనేక మం ది ప్రముఖులు, వివిధ రంగాల నిష్ణా తులు పాల్గొని నివాళులు అర్పిస్తార న్నారు. దివంగత డాక్టర్ మర్రి చెన్నారెడ్డి వికా రాబాద్ జిల్లాలోని పెద్ద మంగ ళారంలో జన్మించారు. మధ్య తరగతి కుటుంబంనుంచి డాక్టర్‌గా కెరీర్ ఆరం భించిన కొద్ది కాలానికే ఆయన రాజకీయాలవైపు మొగ్గారు. యుక్తవయసులోనే రాజకీయరంగంలోకి అడుగు పెట్టారు. రాజకీయరంగంలో ఆయన స్వా తంత్ర్య సమరయోధుడిగా సుపరిచితమయ్యారు. అనతికాలంలోనే అతిచిన్న వయసులో ఎమ్మెల్యేగా, మంత్రిగా, కేంద్ర మంత్రిగా, రెండుసార్లు ఏపీ ముఖ్య మంత్రిగా, 4 రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేశారు. సుధీర్ఘ రాజకీయ ప్రస్తానం లో చెన్నారెడ్డి ఐదు దశాబ్దాలపాటు అనేక సేవలందించారు. డిసెంబర్ 1996 లో తమిళనాడు గవర్నర్‌గా ఉన్న సమయంలో చెన్నారెడ్డి మృతిచెందారు. తొలిదశ తెలంగాణ ఉద్యమానికి చెన్నారెడ్డి శ్రీకారం చుట్టడంతో 1969-71 లలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగసింది. ఈ ఉద్యమంతో ఆయన ప్రపంచం దృష్టిని ఆకర్శించారు. నాటి ఆయన కృషి 2014లో నెరవేరి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. కాంగ్రెస్ పార్టీ నిట్టనిలువుగా చీలిపోయిన 1978 సందర్భంలో ఆయన ఇందిరాగాంధీవైపు నిల్చి మద్దతు పలికారు. 1978, 1989లో ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న కీలక సమయాల్లో కాంగ్రెస్‌కు భారీ విజయాలను అందజేశారు.

## దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

**అమరావతి, ఆంధ్రప్రభ:** సంక్రాంతి సెలవులు రావడంతో బెజవాడ ఇంద్ర కీలాద్రికి భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది.సాధారణ భక్తులతో పాటు విఐపీ దర్శనాలు అధికమయ్యాయి. తాజాగా శుక్రవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎ.రాజశేఖర్‌రెడ్డి దంపతులు గుడిని సందర్శించి, దుర్మమ్మను ప్రత్యేక పూజలతో సే ంచారు. ఆలయ కార్యనిర్వహణాధికారి .కోటేశ్వరమ్మ న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు.అనంతరం న్యాయమూర్తికి ఈవో అమ్మ వారి క్యాలెండర్‌ను,తీర్థ ప్రసాదాలను అందజేశారు.



# హస్తినకు 'సర్వే' పంచాయితీ

• సస్పెన్షన్ కొనసాగుతుందా..? లేదా అధిష్టానం పక్కన పెట్టిందా • కుంతియా, ఉత్తమ్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఏఐసీసీకి సత్యనారాయణ ఫిర్యాదు



**హై దరాబాద్, ఆంధ్రప్రభ:** ఒక వైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం.. మరో వైపు పార్లమెంట్ ఎన్నికలు తరుముకొస్తున్న సమయం.. కానీ కాంగ్రెస్‌లో మాత్రం పాత సంస్కృతిని మర్చిపోవడం లేదు. సీనియర్లు నేతలు ఒకరిపై ఒకరూ ఫిర్యాదు చేసు కుంటున్నారు అంటూ ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయ కత్వం ఆందోళన వ్యక్తం చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్ర కుంతియా, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డిపైన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణను తీవ్రమైన విమర్శలు చేశా రంటూ ఆయన్ను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. సర్వే మాత్రం ఏఐసీసీ సభ్యుడిగా ఉన్న తనను పీసీసీకి సస్పెండ్ చేసే అధికారం లేదని, ఒక వేళ చర్యలు తీసుకుంటే ఏఐసీసీనే తీసుకోవాల్సి ఉంటుందని సర్వే చెబుతున్నారు. అయినా తాను ఎలాంటి తప్పులు చేయలేదని ఎన్నికల్లో జరిగిన తప్పులను నిలదీస్తేనే జీర్ణించుకోలేదని కొంత మంది తనను పార్టీ నుంచి సెస్పెండ్ చేశారని సర్వే వాదిస్తు న్నారు. పార్టీ ఓటమికి కారణమైన కుంతియా, ఉత్తమ్‌లను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పనిలో పనిగా ఏఐసీసీ క్రమశిక్షణ కమిటి చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి ఆంటోనికి కుంతియా, ఉత్తమ్‌లపై ఫిర్యాదు చేశారు. ఎన్నికల్లో జరిగిన తప్పులపై సమీక్షలో ప్రశ్నిస్తే దాడి చేయడమే కాకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆంటోనికి సర్వే వివరి ంచారు. దీంతో సర్వే సత్యనారాయణ సస్పెండ్ పంచా యతీ హస్తినకు చేరింది. దీంతో పాటు పార్టీలోని పలు వురు నేతలు కూడా పార్టీ అధిష్టానానికి ఒకరిపై మరొకరలు ఫిర్యాదులు చేసుకుంటున్నారు.

సర్వే సత్యనారాయణ పార్టీ నుంచి సస్పెండ్ అయినట్లా.. లేక కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నట్లా అనేది ఇంకా స్పష్టం కావడం లేదని ఆ పార్టీ నేతలే అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. పీసీసీ తీసుకున్న నిర్ణయాన్ని ఏఐసీసీ ఒక వేళ పక్కనపెడితే రాష్ట్రంలోని కాంగ్రెస్ రాజకీయ పరిస్థితి వేరుగా ఉంటుందని చెబుతున్నారు. ఒక వేళ సర్వేపై చర్యలు తీసుకుంటే మాత్రం కుంతియా, ఉత్తమ్‌లకు ఇక ఎదురే ఉండదని ఆయన సన్నిహితులు చెబుతు న్నారు. సర్వే సత్యనా రాయణ ఏమైనా పొరపాటు వ్యాఖ్యలు చేస్తే ముందుగా షోకాజ్ నోటీసు ఇచ్చి.. ఆయన వివరణను బట్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉండేదని పలువురు సీనియర్లు అభి ప్రాయప డుతు న్నారు. లేదంటే ఏఐసీసీ ఫిర్యాదు చేసి ఉంటే అధిష్టానమే నిర్ణయం తీసుకునేదని కూడా చెబుతున్నారు. కానీ పీసీసీ నాయకత్వం మాత్రం తొందరపడిందని పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత వాపోయారు.

రాష్ట్రంలో ఒక వైపు పంచాయతీ ఎన్ని కలు జరుగుతుండటంతో పాటు మరో మూడు నాలు గు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు ఉండగా నేతలం దరూ ఐక్యంగా ఉండి ముందుకు పోవాల్సిన అవసరం ఉందని పలువురు గుర్తు చేస్తున్నారు. ఒకవైపు అధికార టీఆర్ఎస్ దూకుడుతో ముందుకు పోతుంటే.. కాంగ్రెస్‌లో నాయకులు మాత్రం కలహాలతో ఉండటం పార్టీ కేడర్ జీర్ణించుకోలేక పోతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# తెరాసకు తొత్తుగా ఎన్నికల సంఘం

• కాంగ్రెస్ నేత మర్రి శశిధర్ రెడ్డి



**హై దరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్ర ఎన్నికల సంఘం అధికార టీఆర్ఎస్‌కు తొత్తుగా మారిందని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం కూడా టీఆర్ఎస్‌కు అనుకూ లంగా వ్యవహరి స్తోందని ఆయన విమర్శించారు. కొత్త ఓటర్ల జాబితా ను తయారు చేయడానికి ఎన్నికల సంఘానికి చిత్తశుద్ధి లేదని ఆయన విమర్శించారు. గాంధీభవన్‌లో శుక్ర వారంనాడు కాంగ్రెస్ నేతలు జి.నిరంజన్, బి. కమ లాకర్‌రావు, వినోద్‌రెడ్డి, నిజాముద్దీన్‌తో కలిసి మీడి యాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితాలో తప్పులు జరిగాయని చెప్పిన కమిషనర్.. ఆ తప్పులకు బాధ్యులు ఎవరో ఇప్పటి వరకు బయటపెట్టలేదని ఆయన ప్రశ్నించారు. ఓటర్ల జాబితాపై తప్పులు చేసిన వారిని గుర్తించి చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన నిలదీశారు. తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందన్నారు. కేబినెట్ సమావేశంలో ఎన్నికల సంఘానికి కేసీఆర్ ధన్యవాదాలు చెప్పడంలోనే మతలబు ఉందని ఆయన విమర్శించారు. అధికార పార్టీకి ఎన్నికల సంఘం అనుకూలంగా పని చేసినందునే కేసీఆర్ ధన్యవాదాలు చెప్పారని ఆయన తెలిపారు.

## ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది

• పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి



ఎన్డీఏ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలోకి వెళ్లిందని పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను ఆగమేఘాల మీద బదిలీ చేయ డంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. రాఫెల్ కుంభకోణం నుంచి తప్పిం చుకో వడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని మల్లు రవి ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కును ప్రధానమంత్రి నరేంద్రమోడి తన స్వార్థానికి వాడుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. అలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తప్పించడాన్ని చూస్తుంటే ప్రజాస్వామ్యం ఎంత ప్రమాదంలో ఉందో అర్థమవుతోందన్నారు.

## రాజకీయ ప్రయోజనాల కోసమే... రిజర్వేషన్లకు తూట్లు


• ఆర్.కృష్ణయ్య



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాజకీయ ప్రయోజనాల కోసమే రిజర్వేషన్ల సిద్ధాంతానికి తూట్లు పొడుస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విమర్శించారు. బీసీల పట్ల రాజకీయ పార్టీలు దుర్మార్గంగా ఆలోచిస్తున్నాయని అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆర్. కృష్ణయ్య అధ్యక్షతన 112 బీసీ సంఘాల సమావేశం జరిగింది. అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో ఒకే రోజులో బిల్లు ఆమోదించడాన్ని బీసీ సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయని ఆయన చెప్పారు. అన్నా డీఎంకే, రాష్ట్రీయ జనతాదళ్ వంటి పార్టీలు వ్యతిరేకించినప్పటికీ బిల్లును పాస్ చేయడం దురదృష్టకరమన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగహోదా కల్పించే బిల్లును ఆమోదించడానికి నెల రోజుల సమయం ఎందుకు తీసుకున్నారని ఆయన ప్రశ్నిం చారు. అవసరం లేకపోయినా అగ్ర కులల పేదల పేరుతో రిజ ర్వేషన్లు పెట్టారని, దీనిపై బీసీ కులాలు అసంతృప్తి, అగ్రహం వ్యక్తం చేస్తున్నాయని కృష్ణయ్య చెప్పారు. ఇటీవల కేంద్రం జరిపిన ఉద్యోగుల సర్వేలో ఎస్సీలు 15 శాతం, ఎస్టీలు 7 శాతం, ఓబీసీలకు 14 శాతం, అగ్రకులాలకు 64 శాతం ఉద్యో గులు ఉన్నట్లు తేలిందన్నారు. 15 శాతం జనాభా ఉన్న అగ్ర కులాలకు 64 శాతం ఉద్యోగులుంటే ఇంకా వారికి రిజర్వేషన్లు ఇవ్వడమేమిటని ఆయన ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 54 శాతం జనాభా ఉన్న బీసీలకు రాజకీయ రంగంలో 12 శాతం ప్రాతినిధ్యం కూడా లేదన్నారు. తెలంగాణలోని 102 బీసీ కులాలకు ఇంకా అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం దక్క లేదని కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో 112 బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, దాసు సురేష్, నీలా వెంకటేష్, చంద్రకళ, ఎ. మల్లయ్య, ఎల్. వెంకటాచారి, ఒంటేద్దు బాలయ్య, రాజమౌళి, విరేశం, జనార్దన్, ఉపేం ద్రకర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటం చేయండి

• 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు చెబుతూ వీహెచ్ లేఖలు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించిన 19 ఎమ్మెల్యేలను అభి నందిస్తూ, ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమం తరావు లేఖలు రాశారు. కాంగ్రెస్ కేడర్ మీ వైపే చూస్తున్నదని, ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమ స్యలపై గట్టిగా పోరాటం చేయాలని ఎమ్మె ల్యేలకు శుక్రవారం రాసిన లేఖలో వీహెచ్ పేర్కొ న్నారు. అధికార టీఆర్ఎస్ కుట్రలను చేధించుకుని విజయం సాధించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలి పారు. టీఆర్ఎస్ ఇచ్చిన హామీ లను అమలు చేసే విధంగా అసెంబ్లీలోనూ గట్టిగా పోరాటం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు రాష్ట్రాలైన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రాల్లో ఎన్నికల హామీలను అమలు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రత్యేక దృష్టిసారించి ఎన్నికల అమలు చేసేలా చూస్తున్నారని వీహెచ్ వివరించారు. గత నాలుగున్నరేళ్ల టీఆర్ఎస్ పాలనలోనూ రాష్ట్రంలో ప్రజలకు ఒన గూ రేందేమి లేదన్నారు. ప్రతిపక్షం లేకుండా చేయాలని సీఎం కేసీఆర్ చేస్తున్న కుట్రలను కూడా తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌కు మండల్, అనంతరామన్, హవనూర్ కమిషన్‌ల నివేదికలు అందజేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు

## తెలుగులో మండల్ కమిషన్ నివేదిక

• తొలి ప్రతిని గవర్నర్‌కు అందించిన బీసీ కమిషన్ సభ్యులు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ బీసీ కమిషన్ తెలుగులోకి అనువదించి, ప్రచురించిన మండల్ కమిషన్, హవనూర్, అనంతరామన్ కమిషన్ల నివేదికల తొలి ప్రతిని తెలుగు రాష్ట్రా ల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు అందించారు. బీసీ కమిషన్ తెలుగులోకి అనువదించిన ప్రతులను కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్, ఆంజనేయగౌడ్, జూలూరీగౌరీ శంకర్ కమిషన్ సభ్య కార్యదర్శి అనిత రాజేంద్రతో కలిసి శుక్రవారం గవర్నర్‌కు అందించారు. దీంతోపాటు ఇంగ్లీష్‌లో ప్రచురించిన బీసీ నోట్‌బుక్ గ్రంథాల తొలికాఫీని గవర్నర్‌కు అందించారు. భారత దేశ సామాజిక నేపథ్యం, ప్రజలకు రిజర్వేషన్ల ఆవశ్యకతకు గల ప్రామాణికమైన మండల్ కమిషన్, అనంతరామన్, హవనూర్ కమిషన్ నివేదికలను తెలుగులోకి తీసుకొచ్చి తెలంగాణ బీసీ కమిషన్ గొప్ప పని చేసిందని గవర్నర్ అభినందించారని కమిషన్ సభ్యులు తెలిపారు.

# 2021లో గగన్‌యాన్

• ఏప్రిల్ చివర్లో చంద్రయాన్ - 2 : శివన్

**బెంగళూరు :** ఏప్రిల్ రెండో వారంలో చంద్రయాన్ - 2ను ప్రయోగించనున్నట్టు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ చైర్మన్ కె.శివన్ శుక్రవారం తెలిపారు. దీనికి సంబంధించి ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నట్టు చెప్పారు. 2021 చివరి నాటికి గగన్‌యాన్ పేరుతో మహిళా వ్యోమగామిని అంతరిక్షంలో పంపనున్నట్టు వివరించారు. చంద్రయాన్-2ను జనవరి చివర్లో లేదా ఫిబ్రవరి 16లోపు లాంచ్ చేయాలని భావిం చామని, కానీ ఇది మార్చి 25 నుంచి ఏప్రిల్ రెండో వారానికి మార్చినట్టు తెలిపారు. ఆలస్యానికి కారణం కొన్ని పరీక్షలు నిర్వహించకపో వడ మే అని వివరించారు. చంద్రయాన్ - 2 ప్రయోగించేందుకు మొత్తం రూ.800 కోట్లు అవసరం అవుతాయని, చంద్రయాన్ - 1 కంటే ఆధునిక సాంకేతికతతో కూడి ఉంటుందని శివన్ ప్రకటించారు.

ఒక వేళ్ల ఏప్రిల్ లాంచ్ చేయకపోతే జూన్‌లోనే చేపడుతామని వివరించారు. 10 ఏళ్ల క్రితం చంద్రయాన్ - 1 చేపట్టామని, చంద్రయాన్ - 3,290 కిలోలు ఉంటుందని, చంద్రుని కక్ష్యలో ప్రవేశపెట్టి రిమోట్ సెన్సింగ్ పనితీరును పరిశీలిస్తుందని తెలిపారు. లూనార్ స్థలాకృతి, ఖనిజాల అన్వేషణ, మౌలిక సమృద్ధి, చంద్ర గ్రహణం, నీటి లభ్యత వంటి శాస్త్రీయ సమాచారాన్ని చంద్రయాన్ - 2 ద్వారా తెలుసుకుంటామని వివరిం చారు. లాంచ్ చేసిన తరువాత 35 నుంచి 45 రోజుల్లో చంద్రునిపైకి చేరుకుంటుందని, ఇది ఆరు దశల్లో కొనసాగుతుందని శివన్ చెప్పారు. చంద్రుని సౌత్ పోల్‌లో చంద్రయాన్ - 2ను లాంచ్ చేస్తామని, ఇప్పటి వరకు ఎవరూ అక్కడికి వెళ్లలేదని వివరించారు. డిసెంబర్ 2021లో మహిళా వ్యోమగామితో గగన్‌యాన్‌ను ప్రయోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు శివన్ వివరించారు. ఈ కార్యక్రమానికి రూ.9,023 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ కూడా ఆమోదం తెలపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



బీజేపీ జాతీయ మండలి సమావేశంలో ప్రధాని మోడీ, అధ్యక్షుడు అమిత్‌షా మంతనాలు

# ఆరు నిర్ణయాలు..

# అధికార పీఠం దక్కేనా!

**న్యూఢిల్లీ:** 2019 సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నరేంద్ర మోడీ బృందం వ్యూహాత్మకంగా ముందుకువెళ్తోంది. ప్రతిపక్షాలకు అంతుచిక్కని అస్త్రాలతో దూసుకుపోతోంది. ఇటీవల మోడీ తీసుకున్న ఆరు కీలక నిర్ణయాలు 2019 ఎన్నికల్లో బీజేపీని గట్టెక్కిస్తాయని రాజకీయ పండితులు అంచనా వెస్తున్నప్పటికీ.. విపక్ష పార్టీలు కూడా మూకుమ్మడిగా బీజేపీపై ఎదురుదాడికి దిగడంతో 2019 ఎన్నికల్లో మోడీ వర్సెస్ విపక్షాలు అన్నట్లుగా మారిపోయాయి. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ పార్టీ కేంద్రప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి విఫలయత్నం చేస్తున్నా... వారికి ఏ మాత్రం దొరక్కుండా మోడీ చకచకా పావులు కదుపుతూ ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి కంచుకోట లాంటి మూడు రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత మోడీ తన వ్యూహాలకు మరింత పదును పెంచారు. అగ్రవర్ణల్లో ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 10శాతం రిజర్వేషన్లకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేయించుకున్న మోడీ.. అదే అస్త్రంతో ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు. తాను తీసుకొన్న ఆరు కీలక నిర్ణయాలే మరోసారి బీజేపీకి అధికారాన్ని కట్టబెడతాయని ధీమాతో ఉన్న మోడీ అదే ఊపుతో దూసుకుపోతున్నారు.

## రైతులకు సహాయం

దేశంలో ఎన్నడూ లేని విధంగా అధికంగా మోడీ ప్రభుత్వ హయాంలో రైతు ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు జరిగాయి. మరోవైపు పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ప్రభుత్వంపై రైతులు ఆగ్రహంతో ఉన్నారని భావించిన మోడీ సర్కార్ మూడు లక్షల కోట్ల రూపాయలతో గిట్టుబాటు ధరలు లేక బాధపడుతున్న రైతులకు ఉపశమనం కల్పించేవిధంగా మూడు అవకాశాలను మోడీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గిట్టుబాటు ధర లభించని రైతులకు పరిహారం, రుణమాఫీ వంటివి అమలు చేసేలా కసరత్తు జరుగుతోంది.



## చిన్న వ్యాపారులకు సహాయం



ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జీఎస్టీలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టిన మోడీ ప్రభుత్వం ఇటీవలే చిరు వ్యాపారులకు భారీ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఈ నెల 10న జాతీయ విక్రయ పన్ను నిబంధనలలో మార్పుని చేసిన కేంద్రం..దీని ద్వారా అదనంగా 20 లక్షల చిన్నవ్యాపారాలను పన్ను నుంచి మినహాయించ్చింది. 40 లక్షల వరకు వార్షిక విక్రయాలు జరిపే వ్యాపారులకు సైతం జీఎస్టీ నుంచి మినహాయింపు ప్రకటించింది.

ఈ మినహాయింపులు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమలులోకి రానున్నాయి.. ఎన్నికలు కూడా ఏప్రిల్ మొదటివారంలో జరిగే అవకాశముందని ప్రభుత్వ వర్గాల నుంచి లీకులు బయటికి వస్తున్న నేపథ్యంలో చిరు వ్యాపారులకు మోడీ సర్కారు ఇచ్చిన ఊరట మంచి ఫలితాలివ్వొచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఉల్లిపాయలు



ఉల్లిపాయల ధర పెరిగిన కారణంగా బీజేపీ ఓ సారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయింది. అప్పటినుంచి బీజేపీకి ఉల్లి సర్కార్ అనే పేరు కూడా ఉండిపోయింది. ఎట్టిపరిస్థితుల్లో ఉల్లి సీన్ సార్వత్రిక ఎన్నికల్లో రిపీట్ కాకూడదని, ఉల్లి మచ్చ పోవాలని ఉల్లి రైతుల కోసం మోడీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అయితే ఎన్నికల ముందు మోడీ ఎన్ని జిమిక్కులు చేసినా బీజేపీకి తాము ఓటు వేయబోమని ఇటీవల మహారాష్ట్ర, యూపీ రైతులు హెచ్చరించిన నేపథ్యంలో గతేడాది డిసెంబర్ 28 కొత్త ఏడాది కానుకగా ఉల్లిరైతులకు ఎగుమతుల ప్రోత్సాహకాలను 10శాతం రెట్టింపు చేసింది. ఈ ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం ద్వారా రైతులు ప్రభుత్వం వద్ద నుంచి క్రెడిట్ పొందేందుకు అనుమతి లభిస్తుంది. ఇది వివిధ పన్నులు చెల్లించడానికి ఉపయోగపడుతుంది.

## ఈ-కామర్స్ నిబంధనలు

గతేడాది డిసెంబర్ 26న అమెజాన్.కామ్, వాల్ మార్ట్‌కి చెందిన ఫ్లిఫ్ కార్ట్ గ్రూపులను కంపెనీలలో ఈక్విటీ వడ్డీ ఉన్న కంపెనీల నుంచి ఉత్పత్తులను ఆన్ లైన్ ద్వారా అమ్మడంపై నిషేధం విధిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 1నుంచి ఈ నిర్ణయం అమలులోకి రానుంది. తమ వ్యాపారాలను బలహీనపరుస్తూ ఈ కామర్స్ కంపెనీలు తమను బలవంతంగా తమ ఉత్పత్తులను చాలా తక్కువ ధరలకు అమ్ముకొనేలా చేస్తున్నారని రిటైలర్లు, ట్రేడర్ల నుంచి ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది. దిగ్గజ ఈకామర్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవడం ద్వారా మధ్యతరగతి వ్యాపారులు తమ ప్రభుత్వానికి అండగా నిలబడతార్నన భావన మోడీలో ఉన్నట్లు తెలుస్తోంది.

## విక్రయ పన్ను రద్దు

గతేడాది డిసెంబర్ 22న దాదాపు 20 వస్తువులపై విక్రయ పన్ను రేటుని భారీగా తగ్గించింది. టీవీ ధరలు, సినిమా టిక్కెట్లు, బ్యాటరీలు ఈ తగ్గినవాటిలో ఉన్నాయి. ఈ నిర్ణయం కూడా సామాన్య ప్రజలను టార్గెట్ చేస్తూ ఒక మౌనవ్యూహంతో మోడీ తీసుకొన్న నిర్ణయాలుగా అర్థమవుతోంది.




## ఉద్యోగాల్లో రిజర్వేషన్లు

అగ్రకులాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని నాలుగేళ్లుగా రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఉద్యమాలు ఉద్ధృతంగా కొనసాగిన సమయంలో కూడా నోరు మెదపని నరేంద్రమోడీ ముందస్తు వ్యూహంలో భాగంగా ప్రతిపక్షాలకు మదిలో కూడా మెదలని అస్త్రాన్ని సంధించారు.

అగ్రకులాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా బిల్లును తీసుకొచ్చి పార్లమెంట్ ఆమోదముద్ర పడేలా వ్యూహాలు రచించారు. వార్షిక ఆదాయం 8లక్షల కన్నా తక్కువ వున్నవారు, ఐదెకరాల కన్నా తక్కువ వ్యవసాయభూమి కలిగి ఉన్నవారు ఈ రిజర్వేషన్లు పొందటానికి అర్హులవుతారు. దీనిని ప్రధానంగా గమనిస్తే మధ్యతరగతి వారినే మోడీ అస్త్రంగా మార్చుకోవాలని భావించినట్లు అర్థమవుతోంది. భారత్ లో ఇప్పటికే అత్యంత వెనుకబడిన తరగతులకు విద్య, ఉద్యోగాల్లో కోటా ఉంది. భారత చరిత్రలో మొదటిసారిగా అగ్రకులాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పించడం జరిగింది. వె ఈ నిర్ణయం 2019లో సునాయాసంగా బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చే అవకాశముందని పలువురు రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.




# కమలమే గెలుస్తుంది

• లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయండి
• ఈసీబీ రిజర్వేషన్లపై ప్రజల్లో అవగాహన పెంచండి
• బీజేపీ జాతీయ మండలి సమావేశాల్లో అమిత్‌షా పిలుపు

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో తిరిగి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు ధీమా వ్యక్తం చేశారు. సాంస్కృతిక జాతీయవాదం, పేదప్రజల అభివృద్ధి కోసం తాము పనిచేస్తున్నామని అన్నారు. అయితే సిద్ధాంతమనేది లేకుండా, మహాఘట్ బంధన్ పేరుతో విపక్ష పార్టీలన్నీ అధికారం కోసం ఏకమవుతున్నాయని అన్నారు. శనివారం రాంలీలా మైదానంలో బీజేపీ జాతీయ మండలి సమావేశాలు ప్రారంభయ్యాయి. ఈ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, పార్టీ కురువృద్ధ నేత ఎల్ కె.అద్వానీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, సుష్మాస్వరాజ్, నితిన్ గడ్కరీ, పార్టీ పదాధికారులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నాయకులు హాజరయ్యారు. అగ్రకుల పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు పాస్ చేయడాన్ని బీజేపీ జాతీయ మండలి అభినందించింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీని పార్టీ నేతలు గజమాలతో సత్కరించారు. గత లోక్‌సభ ఎన్నికలకంటే ఈసారి ఉత్తరప్రదేశ్‌లో తమకు మరిన్ని సీట్లు వస్తాయని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఆశాభావం వ్యక్తం చేశారు. మహాకూటమికి ఎటువంటి విధానం లేకుండా కేవలం అధికారం కోసమే జతకలుస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బ్యాంకు రుణాల ఎగవేతదారులు యథేచ్ఛగా తిరిగారని, ప్రధానమంత్రి పీఠంపై చౌకిదారు కూర్చోవడంతో వారంతా దేశం విడిచిపారిపోయారని అమిత్‌షా అన్నారు. అయితే ఎగవేతదారులను పట్టుకువచ్చేందుకు కఠినమైన చట్టాలు తీసుకువచ్చామన్నారు.

తమది అభివృద్ధి నినాదమైతే, విపక్షాలది అధికారనినాదమని, వీటి మధ్య వచ్చే ఎన్నికల్లో పోటీ ఉంటుందన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లు, జిఎస్టీ, పెద్దనోట్ల రద్దు లాంటి అనేక విప్లవాత్మక మార్పులను మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. అగ్రకుల పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చరిత్రాత్మక బిల్లును పాస్ చేశామన్నారు. దీనిపై విపక్షాల మొసలి కన్నీరు కార్చాయని ఎద్దేవా చేశారు.

సిక్కుల ఊచకోతకు పాల్పడిన నింది తులను కటకటాల్లోకి పంపేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. చొరబాట్లను అరికట్టేందుకు పౌరసత్వచట్ట సవరణ బిల్లు తీసుకువస్తే, కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోం దన్నారు. తమ హయాంలో యూరిలో ఉగ్రదాడి జరిగితే, వెంటనే పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రయిక్స్ జరిపి గట్టి బుద్ధి చెప్పామని అన్నారు.

## మరోసారి మోడీ సర్కార్...ఇదే నినాదం

అబ్ కి బార్ ఫిర్ మోడీ సర్కార్ అనే నినాదాన్ని వేదిక బ్యానర్ అగ్రభాగంలో ప్రదర్శించారు. నమో అగైన్ అనే టీ షర్టులతో బీజేపీ నాయకులు కనిపించారు. గత 2014 ఎన్నికల్లో అబ్ కీ బార్ మోడీ సర్కార్ అనే నినాదాన్ని జనంలోకి తీసుకువెళ్లగా...ఈ సారి దానికి ఫిర్ మోడీ సర్కార్ అనేది జోడించడం విశేషం. మరోసారి మోడీ సర్కార్ అనే నినాదంతో ప్రజల్లోకి వెళతామని బిజెపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి కామర్సు బాలసుబ్రమణ్యం తెలిపారు. మోడీ నాయకత్వంలో తిరిగి మళ్లీ అధికారంలో వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశాల్లో ఏపీ, తెలంగాణ బీజేపీ అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, కె.లక్ష్మణ్, నేతలు కిషన్‌రెడ్డి, వెదిరె శ్రీరాం, చింతల రామచంద్రారెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాణిక్యాల రావు పాల్గొన్నారు.

# బౌద్ధ క్షేత్రాల్లో పర్యాటకం

• అటవీ పరిశోధన సంస్థకు నిధులు • కేంద్ర మంత్రులతో తెలంగాణ బీజేపీ నేతల మంతనాలు • పలు అభివృద్ధి ప్రాజెక్టులపై వినతి పత్రాలు

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** భారతీయ జనతా పార్టీ జాతీయ మండలి సమావేశాలకు హాజరయ్యేందుకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర నేతలు పలు అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించేందుకు కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. కే. లక్ష్మణ్ ఆధ్వర్యంలోని బృందం కేంద్ర మంత్రులు హర్షవర్ధన్, అల్ఫోన్స్ కన్నంతనమ్ ను కలిశారు. కేంద్ర పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న అల్ఫోన్స్‌కు తెలంగాణ రాష్ట్రంలోని బౌద్ధ మత క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల గురించి వివరించారు. సూర్యాపేట జిల్లాలో ఫణిగిరి, జగిత్యాల జిల్లా కోటి లింగాల, కరీంనగర్ జిల్లాలో ధూళికట్ట, నల్లగొండ జిల్లా బుద్ధవనం, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, ఆదిలాబాద్ జిల్లా బదన్‌కుర్తి,



వరంగల్ జిల్లా కోరుకొండ వంటి బౌద్ధ క్షేత్రాలను కలుపుతూ ఒక టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇవన్నీ ఎంతో చారిత్రక, వారసత్వ సంపదకు ప్రతీకలు అని పేర్కొన్నారు. వాటిని క్లస్టర్లుగా చేసి అభివృద్ధి చేస్తే పర్యాటకులను ఆకర్షిస్తాయని తెలిపారు.

ఇందులో జగిత్యాల జిల్లా కోటిలింగాల శాతవాహనుల మొట్టమొదటి రాజధాని నగరమని గుర్తుస్తూ.. అక్కడి మట్టి కోట విశేషాలను వివరించారు. కోట గోడ కిలోమీటర్ పొడవు, 300 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల ఎత్తుతో నిర్మించారని ఆయన తెలిపారు. గ్రీకు యాత్రికుడు మొగస్తనీస్ తన ఇండికా పుస్తకంలో ప్రస్తావించిన 30 కోటగోడల్లో ఇదొకటని గుర్తు చేశారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇక్కడ జరిపిన తవ్వకాల్లో క్రీస్తు పూర్వం 4వ శతాబ్దానికి చెందిన స్తూపం ఒకటి బయటపడింది. ఆనాటి రోమన్ బంగారు నాణేలు, ఇటుకలు, ముద్ర కలిగిన నాణేలు, శాతవాహనుల నాణేలు కూడా ఈ తవ్వకాల్లో లభించాయని పేర్కొన్నారు. ఇలా ప్రతీ క్షేత్రానికి ఎంతో చారిత్రక ప్రాశస్త్యం ఉందని డా. లక్ష్మణ్ తన లేఖలో ప్రస్తావించారు.

మరోవైపు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డా. హర్షవర్ధన్‌ను కలిసిన తెలంగాణ నేతల బృందం, హైదరాబాద్ నగర శివార్లలో 1997లో ఏర్పాటు చేసిన అటవీ పరిశోధనా సంస్థకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెంచాలని కోరారు. ప్రతియేటా ఆ సంస్థకు ఇచ్చే నిధులు అక్కడ పనిచేసే సిబ్బంది జీతభత్యాలకే సరిపోతుందని, ఇక పరిశోధనకు నిధులు సరిపోక సంస్థ ఏర్పాటు చేసిన ఉద్దేశమే దెబ్బతింటోందని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు పెంచి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే పరిశోధనలకు ఆస్కారం కల్పించాలని కోరారు.



# ఏపీలో పేదల పింఛన్ రెట్టింపు


**నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో:** రాష్ట్రంలోని నిరుపేదలందరికీ సంక్రాంతి కానుకగా ప్రస్తుతం ఇస్తున్న రూ. 1000ల పెన్షన్‌ను రూ. 2 వేలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. పెంచిన పెన్షన్ జనవరి నుంచే వర్తిస్తుందని, ఫిబ్రవరిలో కొత్త పెన్షన్ రూ. 2 వేలతో పాటు జనవరి రూ. 1000లు కలిపి మొత్తం రూ. 3 వేలుగా నిరుపేదలకు ఇస్తామని ఆయన తెలిపారు. నెల్లూరు జిల్లా బోగోలులో జన్మభూమి - మా ఊరు ముగింపు సభలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలతో పాటు వివిధ నిరుపేదలకు అందిస్తున్న పెన్షన్‌ను రూ. 1000ల నుంచి రూ. 2 వేలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు.




# నీళ్లను ఆపండి

• పాకిస్థాన్‌కు మన జలాలు వెళ్లొద్దు • కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
• ఆరుగురు సీఎంలతో రేణుకా మల్టీ పర్పస్ డ్యాం ఒప్పందం

**న్యూఢిల్లీ:** సింధు జలాల ఒప్పందం ప్రకారం భారత్ మిగులు జలాలను పాకిస్థాన్‌కు వెళ్లకుండా నిలిపివేయాలని కేంద్ర జల వనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. యమునా బేసిన్ పైన నిర్మించే రేణుకా మల్టీ పర్పస్ డ్యాం ప్రాజెక్టుకు సంబంధించి ఒప్పంద ప్రక్రియను గడ్కరీ శుక్రవారం ఆరుగురు ముఖ్యమంత్రుల సమక్షంలో పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్, హర్యాణ సీఎం మనోహర్‌లాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్ సీఎం జైరాం ఠాకూర్ పాల్గొన్నారు. అలహాబాద్, హైబ్రిడ్ యాన్యుటీలో భాగంగా తీసుకొచ్చిన నమామీ గంగా ప్రాజెక్టు, నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా పేరుతో వన్ సిటీ వన్ ఆపరేటర్, ప్రయాగ్‌రాజ్ వాటర్ ప్రయివేటు లిమిటెడ్ ద్వారా యూపీ జల్ నిగమ్ అండ్ దిలీప్ పోరవల్‌కు సంబంధించిన ఒప్పందాల తంతు కూడా పూర్తయింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గడ్కరీ మాట్లాడుతూ.. దేశానికి సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని, కానీ వాటి నిర్వహణే అసలు సమస్యగా మారిందన్నారు. సింధు జలాల ఒప్పందం ప్రకారం చూస్తే భారత్‌కు చెందిన నీటి వాటా పాకిస్థాన్‌కు వెళ్తోందని, ముందు దాన్ని నిలుపుదల చేయాలని అన్నారు. అలా చేయడంతో పంజాబ్, హర్యాణ, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్‌తో పాటు ఢిల్లీకి ఎంతో లాభం చేకూరుతుందని తెలిపారు. ఒప్పందం ప్రకారం.. సట్లెజ్, బియాస్, రావి నీళ్లు భారత్‌కు, చినాబ్, ఝేలుం, సింధు జలాలను పాకిస్థాన్‌కు కేటాయించడం జరిగిందని అన్నారు. మొత్తం 168 మిలియన్ ఎకరాల అడుగులు ఉండగా, వాటిలో మూడు నదులకు సంబంధించి 33 మిలియన్ ఎకరాల అడుగులు భారత్‌కు చెందుతుందని, అంటే 20 శాతం వాటా ఉంటుందని తెలిపారు. సింధు జలాల ఒప్పందం ప్రకారం.. భారత్ 93 నుంచి 94 శాతం నీళ్లు మాత్రమే వినియోగిస్తోందని, మిగిలిన నీళ్లన్నీ పాకిస్థాన్‌కు వెళ్లిపోతున్నాయని, వాటిని ముందుగా ఆపాలని ఆదేశించారు. 2016, యూరీ ఎటాక్ తరువాత ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టు ద్వారా నీటిని నిలుపుదల చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. మూడు ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా 100 శాతం నీటిని భారత్ వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఒక ప్రాజెక్టుపై సంతకాలు పూర్తయ్యాయని, మరో రెండు వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. రేణుకాజీ డ్యాం ప్రాజెక్టు అగ్రిమెంట్ చారిత్రాత్మకం అని, దీనికి త్వరలో కేబినెట్ అనుమతి కూడా లభిస్తుందని గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు. యమునా నదిపై కిశౌ మల్టీ పర్పస్ ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదనపై త్వరలో సంతకాలు పూర్తవుతాయన్నారు.



# మాఊరు-మారాజ్యం

# సర్పంచ్ నుంచి మంత్రిగా..

## రాజకీయ జీవితానికి గ్రామస్థాయి రాజకీయాలే పునాదులు



**కొత్తగూడెం, ప్రభన్యూస్ :** గ్రామస్థాయి రాజకీయాలతో మంత్రి దాకా ఎదిగి సామాన్యులు ఏ పదవినైనా అలం కరించ వచ్చని నిరూపించారు మాజీ మంత్రి, ప్రస్తుత కొత్తగూడెం శాసనసభ్యులు వనమా వెంక టేశ్వరరావు. కాంగ్రెస్ కార్యకర్తగా కింది స్థాయి నుంచి వార్డు సభ్యుడిగా అనంతరం సర్పం చ్‌గా ఒక్కో మెట్టు ఎక్కుతూ అంచెలంచలుగా మంత్రి స్థాయి వరకు వెళ్లి ఎన్నో ఎత్తు పల్లాలు చూసి అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్న ఆయన తిరిగి కొత్తగూడెం ఎమ్మెల్యేగా ప్రజా జీవితాన్ని కొనసాగిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాత పాల్వంచకు చెందిన ఓ సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన వనమా రాజకీయ అరంగేట్రం పంచాయతీ ఎన్నికలతోనే ప్రారంభమైంది. 1971 నుంచి 1987వరకు 16 సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు ఆయన పాల్వంచ సర్పంచ్‌గా పని చేశారు. ఉత్తమ సర్పంచ్‌గా ఆనాటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా బంగారు పతకాన్ని సాధించారు. 1978-79 కొత్తగూడెం ల్యాండ్ మార్టిగేజ్ బ్యాంక్ ఛైర్మన్‌గా కూడా పని చేశారు. అంచెలం చెలుగా ఎదుగుతూ పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా నాయకుడిగా ఎదిగి 1989లో జరిగిన శాస నసభ ఎన్నికలకు పోటీ చేసి శాసనసభ్యుడిగా గెలుపొందారు. 1992లో కొత్తగూడెం నోటి ఫైడ్ ఛైర్మన్‌గా, 1994లో వరంగల్ ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్‌గా, 1999లో పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తూ అదే ఏడాది కొత్తగూడెం శాసనసభ్యుడిగా తిరిగి విజయం సాధిం చారు. 2000 సంవత్సరం నుంచి 2014 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. ఆ సమయంలోనే మొత్తం పది నియోజకవర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపుకు పూర్తి స్థాయిలో కృషి చేసి పదికి పది నియో జకవర్గాలు గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించారు. 2004లో మరో సారి శాసనసభ్యుడిగా ఎన్నికైన ఆయన 2008 దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి మంత్రి వర్గం లో వైద్య విధాన పరిషత్ మంత్రిగా కూడా పని చేశారు. ఇలా చిన్న సర్పంచ్ పదవి నుంచి మంత్రిగా ఎదిగిన ఆయన రాజ కీయ జీవితానికి గ్రామస్థాయి రాజకీయాలే పునాదులు వేశాయని చెప్పవచ్చు.

ఈ సందర్భంగా ఆయన ఆంధ్రప్రభ ప్రతినిధితో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో తాను రాజ కీయాలలో ఎదుర్కొన్న ఆటుపోట్లే తనను ఈ స్థాయికి తీసు కొచ్చాయని, ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నా పల్లె రాజకీయాలు తన రాజకీయ జీవితానికి అక్కరకు వచ్చాయని తెలిపారు.

# వార్డు మెంబర్ నుంచి డిప్యూటీ స్పీకర్ వరకు

- ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపు
- సర్పంచ్‌గా, సమితి వైస్ ఛైర్మన్‌గా విజయం
- ఎస్ఎఫ్‌సీ ఛైర్మన్‌గా, టీటీడీ బోర్డు సభ్యునిగా నియామకం
- అనారోగ్యం రీత్యా రాజకీయాలకు దూరం
- తాజాగా కుమారుడు కొప్పుల మహేష్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం







**రంగారెడ్డి, ప్రభన్యూస్:** కృషి పట్టుదల సాధించాలనే పట్టుదల ఉంటే ఎంతటి కార్యాన్నైనా సాధించవచ్చునని నిరూపించారు కొప్పుల హరీశ్వర్ రెడ్డి... వార్డుమెంబర్‌గా రాజకీయాల్లో వచ్చి అంచలంచెలుగా ఎదిగారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి తనకు తానే సాటి అని నిరూ పించుకున్నారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఒకటిరెండుసార్లు మినహాయిస్తే ఎక్కువ శాతం విజయం సాధించారు.తాజాగా అనారోగ్యం పాలు కావడంతో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన కుమారుడు కొప్పుల మహేష్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

హైదరాబాద్ మహానగరానికి 70కిలోమీటర్ల దూరంలో పరిగి నియోజకవర్గం ఉంది. ఈ నియోజకవర్గంలో పరిగి పంచాయతీ మేజర్ పంచాయతీ. అది 1970వ సంవత్సరం నూనూగు మీసాల యువకుడు వార్డుమెంబర్‌గా నామినేషన్ వేశాడు. చాలామంది సీనియర్లు రంగంలో దిగారు. చిన్న పిల్లోడికి ఎవరు ఓటు వేస్తారని అంతా భావించారు. అందరి అంచనాలు తారుమారు చేసి వార్డుమెంబర్‌గా కొప్పుల హరీశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. వార్డుమెంబర్ అయ్యాక వెంటనే ఉప సర్పంచ్ బరిలో దిగి విజయం సాధించారు. ఆ పదవిని పక్కాగా వినియోగించుకున్నాడు. 1978 వరకు గ్రామాభివృద్ధిలో భాగస్వామి అయ్యారు. 1978లో సర్పంచ్ ఎన్నికలు వచ్చాయి. ఇందులో పోటీ చేసి విజయం సాధించాడు. సర్పంచ్‌గా కొనసాగుతున్న సమయంలోనే పరిగి సమితి ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ పదవిలో కొనసాగుతూనే 1983 సంవత్సరంలో పరిగి ఎమ్మెల్యేగా స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

### రాజకీయ గురువుపైనే విజయం..

మాజీ మంత్రి కమతం రాంరెడ్డి కొప్పుల హరీశ్వర్‌రెడ్డికి రాజకీయ గురువుగా ప్రచారం ఉంది. ఆ గురువుపైనే పలుమార్లు విజయం సాధించి తనకు తానే సాటి అని నిరూపించుకున్నారు. 1985 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అప్పట్లో కమతం రాంరెడ్డిపై గెలుపొందారు. 1989లో మాత్రం రాజకీయ గురువు చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తరువాత నుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1994, 1999, 2004, 2009 పరిగి ఎమ్మెల్యేగా కొప్పుల హరీశ్వర్‌రెడ్డి వరుస విజయాలు సాధించారు. 1985 నుంచి 1987వరకు ఆగ్రో ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా పని చేశారు. 1987నుంచి 1989 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా పని చేశారు. 1997నుంచి 1999 వరకు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా రెండేళ్లపాటు పని చేశారు.

### సైకిల్ గుర్తుపైనే విజయాలు

తెలుగుదేశం పార్టీలో కొనసాగిన సమయంలోనే ఆయన ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1985, 1994, 1999, 2004, 2009 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో తెదేపా గుర్తుపైనే ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2013 సంవత్సరంలో తెదేపా నుంచి బయటకు వచ్చా రు. తెరాసలో చేరి 2014 ఎన్నికల్లో పరిగి నుంచే పోటీ చేసి ఓడిపో యారు. తెరాసలో పొలిట్‌బ్యూరో సభ్యునిగా కూడా కొన సాగు తున్నారు. గత కొన్ని మాసాలుగా అనారోగ్యం రీత్యా రాజ కీయాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్వర్‌రెడ్డి రాజకీయ వారసుడు కొప్పుల మహేష్‌రెడ్డి పరిగి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

### 2001లో డిప్యూటీ స్పీకర్‌గా..

1999లో జరిగిన ఎన్నికల్లో అప్పట్లో తెదేపా ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పట్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తూళ్ల దేవేందర్‌గౌడ్ మాత్రమే మంత్రి అయ్యారు. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నుంచి పోటీచేసి విజయం సాధించిన కొండ్రు పుష్పలీల కూడా మంత్రి అయ్యారు. రెండేళ్లకు పుష్పలీల మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అప్పట్లో వికారాబాద్ నుంచి చంద్రశేఖర్, పరిగి నుంచి కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, చేవెళ్ల నుంచి పట్లోళ్ల ఇంద్రారెడ్డి, తాండూరు నుంచి పట్నం మహేందర్‌రెడ్డి విజయం సాధించారు. ఇంద్రారెడ్డి మినహా అంతా తెదేపాకు చెందిన వాళ్లే. పుష్పలీల మంత్రి పదవి పోయిన తరువాత హరీశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, మహేందర్‌రెడ్డి మంత్రి పదవి ఆశించారు. కానీ వీలుకాలేదు. దీంతో ముగ్గురు త్రిమూర్తులు తిరుగుబావుటా ఎగురవేశారు. సమీక్షా సమావేశాలు అప్పట్లో వికారాబాద్ జిల్లాలో పెట్టించారు. పరిస్థితి చేజారుతుండటంతో అప్పట్లో కొప్పుల హరీశ్వర్‌రెడ్డికి డిప్యూటీ స్పీకర్ పదవి కట్టబెట్టారు.

# సోషల్ మీడియా పంచాయతీ..

## గ్రామాలు, కుల సంఘాల వారీగా వాట్సప్ గ్రూపులు



**కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో:** నిన్నటివరకు శాసనసభ ఎన్నికల్లో సోషల్ మీడియా హల్‌చల్ చేయగా, ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లో ప్రభావం చూపిస్తున్నది. ప్రతి ప ల్లెపై సోషల్ మీడియా ప్రభావం కనిపిస్తోంది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 1211 పంచాయతీలు ఉండగా మూడు విడతలుగా ఎన్నికలు జరుగుతున్నాయి. పంచాయతీ ఎన్నికల కీలక ఘట్టమైన మొదటి విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ, పరిశీలన ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియలేదు. గ్రామాల్లో వాట్సప్ గ్రూపులు పెరుగుతున్నాయి. రంగంలో ఉండాలనుకుంటున్న సర్పంచ్ నుంచి వార్డు సభ్యుల వరకు తమతమ అనుచరులను జత చేస్తూ గ్రూపులను క్రియేట్ చేస్తున్నారు. గ్రామం పేరుమీద కొందరు. గ్రామంలో యువజన సంఘాలు ఉంటే మరికొందరు, మహిళా సంఘాలు ఇలా పోటాపోటీగా గ్రూపులు ఏర్పాటు చేసుకుంటూ పోస్టింగ్‌లు ప్రారంభించారు. ఇక్కడితో ఆగకుండా గ్రామాల్లో కుల సంఘాల వారీగా గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. నేను పలాన గ్రామానికి సర్పంచ్‌గా పోటీ చేస్తున్నా... నేను వార్డు సభ్యునిగా పోటీ చేస్తున్నా... నాకు అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని కొందరు, నేను మీ వాడిని, మన కులం నుంచి ప్రాతినిథ్యం ఉండాలి, మీరంతా మద్దతు ఇవ్వండని కొందరు పోస్టింగ్‌లు చేస్తున్నారు. తాజా మాజీ సర్పంచ్‌లు కొందరు మళ్లీ పోటీ చేసేందుకు అవకాశం రావడంతో గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ పోస్టింగ్‌లు చేస్తున్నారు. కొందరు అభ్యర్థులైతే ఎమ్మెల్యేలతో కలసి ఉన్న ఫొటోలను, పార్టీ నేతలను కలసినప్పటి ఫొటోలను జత చేస్తూ వీరి మద్దతు నాకే ఉంది, మీరూ మద్దతివ్వండని పోస్టింగ్‌లు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు స్మార్ట్‌ఫోన్లు, ఐఫోన్లు విస్తరించడం, ముఖ్యంగా యువత, గ్రామాల్లో చదువుకున్న వారి చేతిలో స్మార్ట్‌ఫోన్లు ఉండటంతో పంచాయతీ ఎన్నికల వార్తలు, ప్రచారాలు చక్కర్లు కొడుతున్నాయి. శాసనసభ ఎన్నికల్లో ఇలాంటి పోస్టింగులే జరిగాయి, పంచాయతీ ఎన్నికల్లో మరింత జోరుగా ప్రచారాలు సాగుతున్నాయి. వాట్సప్ గ్రూపులు క్రియేట్ చేసి పోస్టింగ్ చేస్తున్న వారు కొందరైతే, ఫేస్‌బుక్‌లలో లైవ్ వీడియోలను ఉంచి ప్రచారం తంతు సాగిస్తున్నారు. మొదటి విడత నామినేషన్ల ఉపసం హరణ ఈనెల 13 సాయంత్రం 3 గంటలతో ముగుస్తుంది, బరిలో నిలిచే అభ్యర్థులకు గుర్తులను కూడా ఇదేరోజు కేటాయిస్తారు. గుర్తుల కేటాయింపు అనంతరం మొదటి విడత ఎన్నికలు జరిగే జనవరి 21 వరకు మొదటి విడత ప్రచారంలో సోషల్ మీడియా పై చెంయుగా నిలవనుంది.

# పంచాయతీయే పార్లమెంటు!

పంచాయతీ బలోపేతం చేయాలని అంటారు. దీని ప్రకారం.. మద్దతు ఇవ్వడమంటే ఏంటీ అన్నది మరో ప్రశ్న. రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయకపోతే గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేసే అధికారం ఉంటుందా? ఆలస్యానికి వివరణ ఇవ్వాలని ప్రజా పంపిణీ సిబ్బందిని నిలదీసే శక్తి పంచా యతీలకు ఉంటుం దా? గ్రామంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలులో పంచాయతీల అధికారమెంత? వీటి పరిధి ఏంటీ వంటి క్షేత్రస్థాయి ప్రశ్నలకు వచ్చే సమాధానాల్లోనే స్వపరిపాలన సాధికారత ఎంత అన్నది తెలు స్తుం దని ఈ రంగ నిపుణులు అభి ప్రాయపడుతున్నారు.

### పంచాయతీలోనే పరిష్కారముంది..!

నిజానికి చాలా మందికి తెలీని మరో నిజం ఏంటంటే.. గ్రామ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి మండలాధికారి వద్దకో, జిల్లా కలెక్టర్ వద్దకో వెళుతుంటారు. అయితే వారు తమ ఫిర్యాదులను పంచాయతీల ద్వారా ప్రభుత్వానికి పంపుకోవచ్చు. పరిష్కారాలు క ూడా ఇదే మార్గంలోనే పొందవచ్చు. తమ సమస్యలకు పరిష్కారం పంచాయతీలోనే ఉందని తెలిస్తే, వారు సర్పంచు, వార్డు సభ్యులపై ఒత్తిడి తీసుకొస్తారు. పంచాయతీ కమిటీ మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది. ఇలాంటి అనేక విషయాలపై పంచాయతీలకు ఎన్నికైన వారికి, గ్రామ ప్రజలకు స్పష్టత ఇవ్వడం ద్వారా సాధికారత సాకారమవుతుందని అంటారు.

రెండవ అంశం.. గ్రామ పంచాయతీలకు నిధుల సేకరణ. తమిళనాడు, కర్నా టక, కేర ళ, హరియాణ తదితర రాష్ట్రాల్లో పంచాయతీ స్థాయిలో పన్ను వసూలు చేస్తుంటారు. ఆస్థి పన్నును చాలా పంచాయతీలు వసూ లు చేస్తుం టాయి. అయితే చిన్న గ్రామాలు, వనరులు తక్కువగా ఉండి, పేదరికం ఎక్కు వగా ఉండే పంచాయతీల్లో ఆస్థి పన్ను వసూలు గురించి పెద్దగా మాట్లాడుకోవడానికి ఏమీ ఉండదు. అలాంటి గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వాలే నిధులు సమకూర్చాల్సి ఉంటుంది.

### ప్రజా ప్రతినిధులతోనే అభివృద్ధి..

మూడవ అంశం.. గ్రామ పంచాయతీలకు ఎంత అనుభవం ఉన్న అధికారిని లేదా ఉద్యోగిని నియమించినా గ్రామాభ్రివృద్ధి పెద్దగా జరగదని గత అనుభవాలను నిపుణులు గుర్తు చేస్తున్నారు. ఏ గ్రామం అయినా అభివృద్ధి చెందాలంటే అంకిత భావం, అవగాహన, అనుభవం ఉన్న గ్రామ సర్పంచు, వార్డు సభ్యుల సహకారం తప్పనిసరి అంటున్నారు. స్థానికంగా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం, ఆర్థికాభివృద్ధి, ఇతర పౌర వ్యవహారాల నిర్వహణకు ప్రజల చేత ఎన్నికైన ప్రజా ప్రతినిధుల ద్వారానే సాధ్య మే.





గ్రామ స్వపరిపాలన సజావుగా జరగడానికి చట్టపరంగా అన్ని సదుపాయాలు రాజ్యాంగంలో, చట్టంలో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సమృద్ధిగానే అందు తున్నాయి. స్థానికంగా పంచాయతీల విచక్షణ మేరకు పన్నులు, టోల్ తదితరాలను వసూలు చేస్తూనే ఉన్నారు. నిబంధనలున్నాయి, నిధులున్నాయి. అయినా ఎక్కడో లోపం ఉందని పరిశీలకులు అంటారు. పంచాయతీలు తమ బాధ్యతలను, విధులను నిర్వర్తించడంలో లోటు కనిపి స్తుందంటారు. పంచాయతీలు ప్రభావంతంగా, సంపూర్ణ సాధికారతతో పని చేయాలంటే అది క్షేత్రస్థాయి నుంచి మార్పు రావాలా? లేదంటే పై నుంచి చొరవ తీసుకోవాలా అనే ప్రశ్న కీలకమైంది.

ఒక ఉదాహరణ చూస్తే, అంగన్‌వాడీలు పంచాయతీల పర్యవేక్షణలో ఉండాలి అన్నది ఒక నిబంధన. ఇక్కడ పర్యవేక్షణ అంటే ఏంటీ అనే ప్రశ్న ఎదురవుతుంది. అంగన్‌వాడీల పనితీరును పంచాయతీ బాధ్యులు తనిఖీ చేయడమా? వారు తప్పు చేస్తే శిక్షించే అధికారం ఉంటుందా? లేదంటే వివరణ అడ గగ లుగు తారా? అలాగే ప్రజా పంపిణీ వ్యవస్థను

# ఏకగ్రీవం వైపుగా గ్రామాల చూపు

- 2013లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 71 ఏకగ్రీవాలు
- ఇప్పటికే మొదటి దశలో 28 ఏకగ్రీవాలు
- గత ఎన్నికల్లో ఏకగ్రీవాల బ్రేక్ అయ్యే అవకాశం
- ప్రభుత్వ ప్రోత్సాహంతో గ్రామాల్లో ఏకగ్రీవం వైపు అడుగులు
- కొన్ని గ్రామాల్లో చట్ట విరుద్ధంగా వేలం పాటలు
- జిల్లాలో వేడెక్కిన పంచాయతీపోరు





**నిజామాబాద్, ప్రభన్యూస్ బ్యూరో :** గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా మారిన పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లుగా పోటీకి సిద్ధమౌతున్నారు. రాజకీయ పార్టీలు కూడా పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావించడంతో గ్రామాల్లో అసెంబ్లీ ఎకన్నికలను మరిపించేలా పోటీ నెలకొంది. అయితే ఎన్నికల్లో పోటీ చేయడం గ్రామాల్లో అనవసర రాజకీయ అల్లర్లు లేకుండా చేసేందుకు కొన్ని గ్రామాలు ఆదర్శంగా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి. మరికొన్ని గ్రామాలు ఏకగ్రీవాల పాటలు నిర్వహించి సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులను అంగడి సరుకుగా మార్చాయి. ప్రభుత్వ ప్రోత్సాహకానికి తోడుగా, వేలం ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాల్లో అభివృద్ధి చేపట్టవచ్చని భావిస్తున్నాయి. ఇందుకోసం ఇప్పటికే మొదటి దశ పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో ఏకగ్రీవం అయ్యాయి. ఉప సంహరణకు గడువు ఇంకా రెండు రోజులు ఉండటంతో మరిన్ని గ్రామాలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం అనేక గ్రామాల్లో అభ్యర్థుల ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీలు తమ వంతు పాత్ర వహిస్తున్నాయి.

### గతంలో నిజామాబాద్ జిల్లాలో అత్యధికం

గత పర్యాయం నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో 71 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. సర్పంచ్‌తో సహా వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. అత్యధికంగా ఆర్మూర్ డివిజన్‌లోని నందిపేట్ మండలంలో 6 గ్రామాల్లో ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. లెక్క ప్రకారం 71 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నుకోగా, పరోక్షంగా అనేక గ్రామాల్లో డమ్మీ అభ్యర్థులను రంగంలో పెట్టి సర్పంచ్‌లను తాము చెప్పిన వారినే పరోక్షంగా గ్రామాభివృద్ధి కమిటీలు గెలిపించాయి. ఎన్నికల సంఘంతో ఇబ్బందులు తలెత్తకుండా, ఏకగ్రీవం బదులుగా తూతూ మంత్రంగా ఎన్నికలు జరిపి వేలం ద్వారా సర్పంచ్‌లను పరోక్షంగా ఎన్నుకున్న గ్రామాలు ఉన్నాయి. 2013లో 718 గ్రామ పంచాయతీలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఉండగా ఇందులో 71 గ్రామాలు ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకున్నాయి. గ్రామాల్లో తీర్మా ణాలతో సర్పంచ్‌లను ఎన్నుకోవడంతో పాటు గ్రామాల్లోని సమస్యలను తీర్చాలనే ఒప్పందాలతో ఎన్నికైన వారికి షరతులు పెట్టారు. దీనికి తోడు ఒక్కో గ్రామ పంచాయతీకి ప్రభుత్వం ఏకగ్రీవాల నజరానా కింద రూ. 9లక్షల 83 వేలను మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామాల్లో అనేక సమస్యలకు పరిష్కారం దొరికింది.



### ఏకగ్రీవాలతో గ్రామాల అభివృద్ధి



ఏకగ్రీవంగా ఎన్ను కోవడం ద్వారా ప్రజలకు స్వచ్ఛందంగా సేవా చేయా లనే భావన కలుగుతుంది. తద్వారా ప్రతి పైసాకు జవాబుదారితనం పెరుగుతుంది. రూ.10 లక్షల ప్రభుత్వ సహాయంతో జలాల్‌పూర్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాం. ఆదర్శంగా నిలిచి, అభివృద్ధి సాధించగలిగాం.

**-అన్నం సాయిలు (మాజీ సర్పంచ్ - జలాల్‌పూర్, వర్ని మండలం)**

### మొదటి దశలోనే 28 ఏకగ్రీవాలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 718 గ్రామాలు ఉండగా, జిల్లాల పునర్విభజనతో కామారెడ్డి జిల్లాలో 526, నిజామాబాద్ జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. చిన్న గిరిజన తాండలను కూడా పంచాయతీలుగా మార్చడంతో ఉ మ్మడి జిల్లాలో 1056 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. ఎక్కువగా ఎస్టీ గ్రామ పంచాయతీలకు ఎస్టీ రిజర్వేషన్ రావడంతో ఈ సారి ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రభుత్వ ప్రోత్సాహాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మొదటి దశలోనే ఉప సంహరణలు పూర్తికాక ముందే 28 ఏకగ్రీవాలు అయ్యాయి. మరింత సమయం ఉండటంతో పాటు రెండు, మూడు దశల్లో 707 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరుగాల్సి ఉంది. దీంతో మరిన్ని గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో ఏకగ్రీవాలు అయ్యే అవకాశం ఉంది. గతంలో 71 ఏకగ్రీవాలు జరుగగా, ఈ సారి వందకు పైగా గ్రామాల్లో ఏ కగ్రీవంగా ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నేటి నుంచి వన్డే సమరం

**ఆస్ట్రేలియా గడ్డపై మరో సమరం ప్రారంభమవుతోంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు సిడ్నీ క్రికెట్ మైదానంలో ఆడనున్న తొలి వన్డేలో ఆతిథ్య దేశంతో భారత్ తలపడుతోంది. ఇప్పటివరకు ఆస్ట్రేలియాలో ఆడిన వన్డేల్లో భారత్ రికార్డు బలహీనంగా ఉంది. మొత్తం 48 వన్డే మ్యాచులాడగా 35 మ్యాచుల్లో పరాజయం పాలైంది. ఇటీవల ముగిసిన టెస్ట్ సిరీస్‌లో చారిత్రాత్మక విజయం నమోదు చేసిన కోహ్లీ సేన వన్డేల్లో కూడా అదే జోరు కొనసాగించి విజయం సాధించాలని ఉత్సాహంతో ఉంది**



ఉ. 7:50 నుంచి ప్రారంభం

**• సిడ్నీ వేదికగా సమాయత్తమైన భారత్- ఆస్ట్రేలియా**

**సిడ్నీ:** ఆస్ట్రేలియాలో చారిత్రాత్మక టెస్ట్ సిరీస్ విజయం అందించిన ఊపుతో నేడు ఆతిథ్య దేశంతో వన్డే సిరీస్‌ను భారత్ ప్రారంభిస్తోంది. సిడ్నీలో తొలి మ్యాచ్‌ను ఆడుతోంది. ప్రపంచకప్‌కు సమాయత్తం కావడానికి ఈ వన్డే సిరీస్‌ను భారత్ ఉపయోగించుకోనుంది. మరోవైపు టెస్ట్ సిరీస్‌లో ఓటమిని మరిచిపోవడానికి వన్డే సిరీస్‌ను ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో ఆసీస్ బరిలోకి దిగుతోంది. విజయంతో ఉత్సాహంగా ఉన్న భారతజట్టుకు పాండ్యా, రాహుల్ రూపంలో సమస్యలు చుట్టుముట్టాయి. టీవీ షోలో మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలతో సస్పెన్షన్‌కు గురైనా హార్దిక్ పాండ్యా, కెఎల్ రాహుల్‌లపై విచారణ పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో వీరు పూర్తి సిరీస్‌కు దూరమవుతున్నారు. ఆల్ రౌండర్ పాండ్యా, ఓపెనర్ రాహుల్ లేకపోవడంతో జట్టులో సమతూకం లోపించే అవకాశముంది. బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడంతో 10 ఓవర్లు బౌలింగ్ చేసే ఆటగాడి ఆవసరం జట్టుకు ఉంది. వ్యక్తిగత అభిప్రాయాలను టీమిండియా సమర్థించదని కోహ్లీ శుక్రవారం ప్రీమ్యాచ్ మీడియా సమావేశంలో పేర్కొన్నాడు. పాండ్యా గైర్హాజరితో జట్టుకు మరో ఆల్ రౌండర్ కావాల్సి ఉంటుంది. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. పాండ్యాలేని లోటును పూడ్చడానికి కోహ్లీ ముగ్గురు పేసర్లతో కూడిన జట్టును మైదానంలోకి దించాలనుకుంటే మహ్మద్ షమీ, ఖలీల్ అహ్మద్‌లతోపాటు భువనేశ్వర్ కుమార్‌కు చోటు లభిస్తుంది. సిడ్నీ పిచ్‌పై గడ్డి ఉండటంతో ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లను కోహ్లీ బరిలోకి దించే అవకాశముంది. పాండ్యా స్థానంలో ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాను తీసుకుంటానని కోహ్లీ చెప్పాడు. అతను కుల్దీప్‌తో కలిసి బరిలోకి దిగుతాడాని సంకేతాలనిచ్చాడు. అవసరమైతే పార్ట్ టైం బౌలర్‌గా కేదార్ జాదవ్ ఉపయోగించుకోనున్నాడు. ఓపెనర్ల జోడీ తర్వాత నెంబర్ త్రీ బ్యాట్స్‌మన్‌గా కోహ్లీ బ్యాటింగ్ చేయనుండగా, మిగతా బ్యాటింగ్‌లైనప్‌లో కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ, అంబటి రాయుడు మిడిలార్డర్‌లో ఉంటారు. 2018లో ధోని అంతగా రాణించలేకపోయాడు. 20 వన్డేల్లో సగటున 25 చొప్పున 275 పరుగులు మాత్రమే చేశాడు. ధోని స్ట్రైక్ రేట్ కూడా ఆందోళన పరుస్తోంది. తన వన్డే కెరియర్లో 87.89 స్ట్రైక్ రేట్ కలిగివున్న ధోని ప్రస్తుతం 71.42తో ఉన్నాడు. వన్డే జట్టులోకి నెంబర్ ఫోర్ బ్యాట్స్‌మన్‌గా అంబటి రాయుడు ను జట్టులో చేర్చుకుంది. గత సెప్టెంబర్‌లో ఆసియాకప్, వెస్టిండీస్‌తో ఆడిన 11 వన్డేల్లో రాయుడు 392 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు అర్ధ సెంచరీలున్నాయి. అతని బ్యాటింగ్ సగటు 56 పరుగులు. అతనితో పాటు జట్టులోకి వచ్చిన మిగతా ఆటగాళ్లతో పోలిస్తేరాయుడు నిలకడగా రాణిస్తున్నాడు. అయితే రాయుడు ఇంగ్లండ్‌లో ఆడిన మ్యాచ్‌లకు భిన్నంగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుంది.



**ఆస్ట్రేలియాలో భారత్ వన్డే రికార్డ్ బలహీనం**

1985లో వరల్డ్ చాంపియన్‌షిప్, 2008 లో సీబీ సిరీస్‌లు కలిపి ఆస్ట్రేలియాలో భారత్ ఆడిన 48 వన్డేల్లో భారత్ 35 మ్యాచుల్లో పరాజయం పాలైంది. గతంలో ఇక్కడ పర్యటించిన వన్డే జట్టు మిడిలార్డర్‌లో సమస్యలు తలెత్తాయి. 2016లో పర్యటించిన ధోని నేతృత్వంలోని భారత జట్టు 1-4తేడాతో సిరీస్‌ను ఓడింది. ఐదు మ్యాచుల సిరీస్‌లో శర్మ 441 పరుగులు, కోహ్లీ 381 పరుగులు చేసి బ్యాటింగ్‌లో టాప్‌లో నిలిచారు. ధావన్ 287 పరుగులు చేశాడు. మిడిలార్డర్‌లో చెప్పుకోతగ్గ పరుగులు చేసినవారులేరు. చివరి వన్డేలో మనీష్‌పాండే పోరాడి సెంచరీ చేయడంతో భారత్ సిరీస్‌లో ఒక మ్యాచ్ గెలిచింది.

## ప్రతీకారేచ్ఛలో ఆసీస్

సవాల్‌కు దీటైన సవాల్ చేసే నాయకుడు స్టీవ్ స్మిత్, కీలకమైన ఓపెనర్ డేవిడ్ వార్నర్ లేని ఆస్ట్రేలియా జట్టు బలహీనంగా కన్పిస్తున్నప్పటికి.. తమ జట్టు వన్డే సిరీస్ గెలిచి టెస్ట్ సిరీస్ ఓటమికి బదులు తీర్చుకుంటుందని ఆసీస్ కెప్టెన్ చెపుతున్నాడు. 2016 భారత్‌తో సిరీస్‌లో వార్నర్ మూడు మ్యాచుల్లో 220 పరుగులు చేయగా, స్మిత్ ఐదు మ్యాచుల్లో 315 పరుగులుచేశాడు. మరోవైపు మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్‌కు ఈ సిరీస్‌కు విశ్రాంతి ఇచ్చారు. ఆస్ట్రేలియా తొలి వన్డేకు జట్టును ప్రకటించింది. నాథన్ లియాన్ ఒక్కడే స్పిన్నర్‌గా ఉండగా పీటర్ సిడిల్ 2010 తర్వాత తిరిగి జట్టులోకి వచ్చాడు. కీపర్ బ్యాట్స్‌మన్ అలెక్స్ కేరీ తొలిసారిగా కెప్టెన్ అరోన్ ఫించ్‌తో కలిసి ఓపెనర్‌గా దిగనున్నాడు. ఉస్మాన్ ఖవాజా, షువాన్ మార్ష్, పీటర్ హాండ్స్ కోంబ్ మిడిలార్డర్‌లో బరిలోకి దిగనున్నారు. మార్కస్ స్టొయినెస్, గ్లెన్ మాక్స్‌వెల్ నెంబర్ ఆరు, ఏడు స్థానాల్లో బ్యాటింగ్‌కు దిగనున్నారు. సిడిల్ ఎనిమిదేళ్ల తర్వాత పేసర్‌గా మళ్లీ తన ప్రతాపం చూపనుండగా, జాసన్ బెహ్రెండార్ఫ్ తన కెరియర్లో తొలి వన్డేను ఆడుతున్నాడు.

### జట్లు

**భారత్:** విరాట్ కోహ్లీ( కెప్టెన్), కెఎల్ రాహుల్, శిఖర్ ధావన్, అంబటి రాయుడు, దినేష్ కార్తిక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోని(వి.కీ), హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, యుజువేంద్ర చాహల్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్‌కుమార్, ఖలీల్ అహ్మద, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్.

**ఆస్ట్రేలియా( 11మంది ఆటగాళ్లు):** ఆరోన్ ఫించ్ ( కెప్టెన్), అలెక్స్ కేరీ( వి.కీ), ఉస్మా ఖవాజా, షువాన్ మార్ష్, పీటర్ హాండ్స్‌కోంబ్, మార్కస్ స్టొయినిస్, గ్లెన్ మాక్స్‌వెల్, నాథన్ లియాన్, పీటర్ సిడిల్, జ్యే రిచర్డ్‌సన్, జాసన్ బెహ్రెండార్ఫ్.



విధిసు

# పాండ్యా రాహుల్‌పై సస్పెన్షన్!

**• విచారణ కొనసాగుతుంది**

**• తాజాగా మళ్లీ షోకాజ్ నోటీసులు?**

**పాండ్యా వ్యాఖ్యలు కోడ్ ఆఫ్ కండక్ట్ పరిధిలోకి రావు: లీగల్ సెల్**

సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ సిఫారసు మేరకు పాండ్యా, రాహుల్ వివాదాన్ని బీసీసీఐ లీగల్ సెల్‌కు పంపించగా లీగల్ సెల్, పాండ్యా వ్యాఖ్యలను పరిశీలించిందని పీటీఐ వార్తా సంస్థ శుక్రవారం వెల్లడించింది. ఈ వ్యాఖ్యలు బీసీసీఐ కోడ్ ఆఫ్ కండక్ట్ పరిధిలోకి రావని బీసీసీఐ బోర్డు లీగల్ సంస్థ సిరిల్ అమర్ చంద్ మంగల్‌దాస్ తెలిపిందని వార్తా సంస్థ పీటీఐ వెల్లడించింది. బీసీసీఐ తీసుకున్న లీగల్ సలహాప్రతి తన వద్ద ఉందని వార్తా సంస్థపేర్కొంది.



**న్యూఢిల్లీ:** భారత క్రికెటర్లు పాండ్యా, రాహుల్‌లపై వేటు పడింది. వీరిద్దరిపై చర్యలు చేపట్టడానికి విచారణ కొనసాగుతోందని బీసీసీఐ పాలక కమిటీ ఛైర్మన్ వినోద్ రాయ్ చెప్పాడు. శుక్రవారం రాయ్ మీడియాతో మాట్లాడుతూ... కాఫీ విత్ కరణ్ టీవీ షోలో మహిళలతో తనకు ఉన్న సంబంధాలను పాండ్యా వెల్లడించిన తీరుపై వివాదం చెలరేగింది. వారిద్దరికి షోకాజ్ నోటీసులు జారీచేశాం. వారి వివరణలు తీసుకున్నాము. వారిపై రెండు వన్డేల నిషేధానికి నేను సిఫారసు చేయగా నా సహచర సభ్యురాలు డయానా ఎడుల్జీ ఈ అంశాన్ని లీగల్ సెల్‌కు బదిలీ చేయాలని సూచించింది. ప్రస్తుతం వీరిపై సస్పెన్షన్ విధిసున్నామని..విచారణ కొనసాగిస్తామని రాయ్ వెల్లడించాడు. దీనితో ఆస్ట్రేలియాతో ఆడే మూడు వన్డేలకు వీరి పేర్లు పరిగణనలోకి తీసుకోరని తెలిపాడు. కాగా వీరిద్దరిపై విచారణ ప్రారంభానికి ముందే మళ్లీ షోకాజ్ నోటీసులు జారీచేయాలని బీసీసీఐ ఆలోచిస్తున్నదని అధికార వర్గాలు తెలిపాయి. విచారణ ప్రక్రియ బీసీసీఐ అంతర్గత కమిటీతో లేదా తాత్కాలిక అంబుడ్స్‌మన్‌తో చేయిస్తారా అన్నది ఇంకా స్పష్టంకాలేదని అధికారులు వెల్లడించారు. అయితే వారిద్దరు ఆస్ట్రేలియాలతో మిగతా జట్టుతోపాటు ఉండాలా వద్దా అన్న విషయంపై టీం మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నాడు. కొంతమంది వారిని జట్టు తో పాటు ఉంచాలని భావిస్తుండగా, బీసీసీఐలో మెజారిటీ సభ్యులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని సదరు అధికారి వెల్లడించాడు. ఒకవేళ వారు భారత్‌కు తిరిగి వస్తే.. వారి స్థానాల్లో రిషభ్ పంత్, మనీష్ పాండే పేర్లు పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. వారికి అదనంగా విజయ్ శంకర్, శ్రేయస్ అయ్యర్, పేర్లను కూడా పరిశీలించే అవకాశముందన్నాడు.

# ఆస్ట్రేలియా ఓపెన్ మెయిన్ డ్రా లో ప్రజ్నేష్




**మెల్‌బోర్న్:** ప్రజ్నేష్ గుణేశ్వరన్ తన గ్రాండ్ స్లామ్‌కు అర్హత సాధించాడు. శుక్రవారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయర్ టోర్నీ పురుషుల సింగిల్స్ పోటీలో ప్రజ్నేష్ జపాన్‌కు చెందిన యోసుకె వాటనుకిపై 6-7(5), 6-4, 6-4 తేడాతో ఓడించాడు. క్వాలిఫయింగ్ రౌండ్ చివరి మ్యాచైనా ఈ పోటీలో గెలుపుతో ప్రజ్నేష్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు ఎంపికయ్యాడు. గత ఐదేళ్లలో పురుషుల సింగిల్స్‌లో మెయిన్ డ్రాకు ఎంపికైన మూడో ఆటగాడు ప్రజ్నేష్. గతంలో సోమదేవ్ బర్మన్, యుకీ బాంబ్రిలు గ్రాండ్ స్లామ్‌లో మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. చెన్నైకు చెందిన 29 ఏళ్ల ప్రజ్నేష్ తొలి సెట్‌లో హోరాహోరీగా పోరాడినప్పటికి స్వల్ప తేడాతో ఓటమి పొందాడు. అయితే రెండు, మూడో సెట్లలో పుంజుకున్న ప్రజ్నేష్ అద్భుత ఆటను ప్రదర్శనచేస్తూ విజయం సాధించాడు. ఇది నాకు అద్భుత విజయం. గ్రాండ్ స్లామ్ మెయిన్ డ్రాకు ఎంపికయ్యాను. ఇందుకోసం కలగన్నాను. నాకు సంతోషంగా ఉంది. నా ఆనందాన్ని వర్ణించలేకపోతున్నాను అని మ్యాచ్ అనంతరం ప్రజ్నేష్ వ్యాఖ్యానించాడు. యుకీ 2018లో నాలుగు గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో పాల్గొన్నాడు. సోమ్‌దేవ్ బర్మన్ 2013లో యూఎస్ ఓపెన్‌లో ఆడాడు. క్వాలిఫయర్ టోర్నీలో ఆడిన మూడు మ్యాచుల్లో గెలిచిన ప్రజ్నేష్ 40వేల ఆస్ట్రేలియా డాలర్లు( రూ.20లక్షలు) గెలుచుకున్నాడు. ఈ మ్యాచ్‌లకు నేను ముందే మానసికంగా, శారీరకంగా సిద్ధమై వచ్చాను. ప్రత్యర్థిని ఓడించడానికి నా శక్తిని ఉపయోగించాను అని ప్రజ్నేష్ చెప్పాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్లో ప్రజ్నేష్ తన తొలి పోటీలో అమెరికాకు చెందిన 39వ ప్రపంచ ర్యాంకర్ ఫ్రాన్సెస్ టియాఫోతో తలపడే అవకాశముంది.

## భారత్ టాప్ ఆర్డర్‌పైనే మా దృష్టి



ఆసీస్ కెప్టెన్ ఆరోన్ ఫించ్

**సిడ్నీ:** భారత టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌ను పెవిలియన్‌కు పంపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆస్ట్రేలియా కెప్టెన్ ఆరోన్ ఫించ్ అన్నాడు. శుక్రవారం ప్రీ మ్యాచ్ మీడియా సమావేశంలో ఫించ్ మాట్లాడుతూ..భారత్‌తో వన్డే సిరీస్‌లో టాప్ బ్యాట్స్‌మెన్ శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను ఔట్ చేయడంపై దృష్టి పెడతామని ఫించ్ పేర్కొన్నాడు. గత 12 నెలల్లో విరాట్ సగటు 133 పరుగులు కాగా, శిఖర్ 75, రోహిత్ 50 పరుగులతో ఉన్నాడన్నాడు. వీరు క్రీజులో కుదురుకుంటే మాకు కష్టం. సాధ్యమైనంత వేగంగా వీరిని ఔట్ చేయాల్సి ఉంటుందన్నాడు. దినేష్, జాదవ్, ధోనీలు వారి ఆట వారు ఆడతారు. వారిని ఇంకా పరీక్షించలేదన్నాడు. ఇక్కడ మూడు వన్డేల అనంతరం.. భారత్, పాకిస్తాన్‌లో న్యూజిలండ్‌తో వార్మాప్ మ్యాచులుంటాయి. ఉపఖండంలో వన్డేలు కూడా కష్టమే.అయినా.. మా సొంత గడ్డపై గెలిచి అక్కడికి చేరుకుంటాం అదే విశ్వాసంతో అక్కడ కూడా గెలుస్తామని ఫించ్ ధీమా వ్యక్తం చేశాడు.





# వారి వ్యాఖ్యలను భారత జట్టు సమర్థించదు


**సిడ్నీ:** కాఫీ విత్ కరణ్ టీవీ షోలో హార్దిక్ పాండ్యా, కెఎల్ రాహుల్ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదం కావడంతో ఈ అంశం జట్టుపై ప్రభావం చూపదని కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. శుక్రవారం కోహ్లీ మీడియాతో మాట్లాడుతూ.. పాండ్యా,రాహుల్ వ్యాఖ్యలు డ్రెస్సింగ్ రూం నైతిక విలువలపై ప్రభావం చూపవన్నాడు. ఆస్ట్రేలియాతో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌కు వీరిద్దరు అందుబాటులో ఉండటమనేది బీసీసీఐ శుక్రవారం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నాడు. 'భారత జట్టు కోణం నుంచి ఆలోచిస్తే.. ఆ సందర్భంలో చేసిన అసంబద్ధ వ్యాఖ్యలను మేము తప్పకుండా వ్యతిరేకిస్తాము. అవి ఇద్దరు ఆటగాళ్ల మధ్య చోటుచేసుకున్న మాటలైనా సరే వాటిని అంగీకరించం. వారి ఆలోచనలు, వ్యాఖ్యలు, వారి సంభాషణలు వ్యక్తిగతమైనవైనప్పటికి వాటితో పూర్తిగా మేము ఏకీభవించమని కోహ్లీ పేర్కొన్నాడు. వారిద్దరు ఈ వివాదంతో గట్టిగా దెబ్బతిన్నారు. పరిస్థితులు తమకు కనుకూలంగా లేవని వారికి అర్థమైంది. మేము బీసీసీఐ నిర్ణయంకోసం ఎదురుచూస్తున్నాము. కొన్ని ఘటనలు మన నియంత్రణలో ఉండవు అని కోహ్లీ తెలిపాడు. పాండ్యా, రాహుల్‌లను రెండు వన్డేల్లో నిషేధించాలని బీసీసీఐ పాలక కమిటీ ఛైర్మన్ వినోద్ రాయ్ గురువారం సిఫారసు చేయగా సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ ఈ అంశాన్ని బీసీసీఐ లీగల్ సెల్‌కు అప్పజెప్పాలని సూచించింది.

### వివాదాలకు జట్టు దూరం

ఈ వివాదం విషయానికి.. జట్టును దూరంగా ఉంచాలని కోహ్లీ భావిస్తున్నాడు. ఈ అంశంలో వారిద్దరిని సమర్థించేదిలేదని పేర్కొన్నాడు. ప్రపంచకప్ ఎంతో దూరంలో లేదు. ప్రపంచకప్‌లో బరిలోకి దిగే ఆటగాళ్ల తో మళ్లీ మళ్లీ ఆడాలని కోరుకుంటున్నాను. దీనికి మినహాయింపుగా టెస్ట్ సిరీస్‌లో తీవ్రంగా శ్రమించిన జస్ప్రీత్ బుమ్రాపై ఒత్తిడిని తగ్గించేందుకే అతనికి విశ్రాంతి ఇచ్చామని కోహ్లీ చెప్పాడు. పాండ్యా,రాహుల్ ఆసీస్‌తో మూడు వన్డేలకు అందుబాటులో ఉండకపోవచ్చు అదేవిధంగా బుమ్రాకూడా లేకపోవడంతో.. ప్రపంచకప్‌కోసం మరో దఫా ప్రయోగాలకు అవకాశం చిక్కిందన్నాడు. భువనేశ్వర్ కుమార్ మళ్లీ రంగం లోకి వచ్చాడు. టెస్టుల్లో అతను బాగా కష్టపడ్డాడు. ఖలీల్ అహ్మద్ తనకు లభించిన అవకాశాలు అందిపుచ్చుకుని రాణించాడు. మహ్మద్ షమీ కొత్త బంతితో రాణించే సామర్థ్య మున్న ఆటగాడు. పేసర్ల విభాగంలో అతను తన స్థానాన్ని పక్కా చేసుకునే అవకాశముంది. బుమ్రా స్థానంలో మహ్మద్ సిరాజ్ ఎంపిక సెలెక్టర్ల ఆలోచన నుంచి వచ్చింది. మేము భువనేశ్వర్, బుమ్రా తర్వాత మరికొంతమంది బౌలర్లకోసం చూస్తున్నాము, మెరుగైనవారికి అవకాశం దక్కుతుం దన్నాడు. వారి రాణించే స్థాయిని బట్టి ప్రపంచకప్ జట్టులో ఎవరెవరు ఉంటారన్నది తెలుతుంది. ఆస్ట్రేలియాపై చారిత్రాత్మక టెస్ట్ సిరీస్ విజయంతో మా ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం పెంపొందింది. పాండ్యా, రాహుల్ వివాదం మా జట్టు చైతన్యం, స్ఫూర్తికి అడ్డురాదు. ఆటకు సంబంధంలేని బహిర్గత విషయాలు జట్టును ప్రభావితం చేయవు. ప్రపంచకప్‌కు మేము సమాయత్తమవుతున్నాము. ఆటోర్నీకోసం ఉత్సుకతతో ఉన్నామని కోహ్లీ చెప్పాడు.

ఆస్ట్రేలియాగడ్డపై ఆస్ట్రేలియాను ఓడించి తొలిసారిగా టెస్ట్ సిరీస్‌ను సొంతం చేసుకుని చరిత్ర సృష్టించిన కోహ్లీసేన పాండ్యా, రాహుల్ టీవీ షోలో చేసిన వ్యాఖ్యలతో మైదానం వెలుపల ప్రశ్నలను ఎదుర్కొంటోంది.

**పాండ్యా నిషేధానికి గురైతే.. జడేజా ఉన్నాడు : కోహ్లీ**



వీరిద్దరు రెండు వన్డేల నిషేధాన్ని ఎదుర్కొనున్నారు. ఒకవేళ పాండ్యాపై నిషేధం వేటు పడితే.. ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా అతని స్థానాన్ని భర్తీ చేయడానికి ఉన్నాడని కోహ్లీ చెప్పాడు. ఈ విషయంపై పదేపదే మేము వ్యాఖ్యానించం. బీసీసీఐ ప్రకటించిన ఆటగాళ్లతో సమతూకమైన జట్టుతో బరిలోకి దిగుతామని కోహ్లీ అన్నాడు.

## సెమీస్‌లో అవధే వారియర్స్‌పై విజయం ఫైనల్లో బెంగళూరు



**బెంగళూరు:** ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ సీజన్ 4 టోర్నీలో బెంగళూరు రాప్టర్స్ ఫైనల్‌కు చేరిన తొలిజట్టుగా నిలిచింది. శుక్రవారం జరిగిన తొలి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో బెంగళూరు, 4-2 తేడాతో అవధే వారియర్స్‌ను ఓడించింది. రెండు పురుషుల సింగిల్స్ మ్యాచుల్లో గెలిచిన బెంగళూరు 2 పాయింట్లు పొందగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో ట్రంప్ మ్యాచ్‌గా ఆడి గెలిచిన అవధే వారియర్స్ 2 పాయింట్లు పొందడంతో ఇరు జట్లు 2-2తో సమానంగా ఉన్నాయి. నాలుగో మ్యాచ్‌లో పురుషుల డబుల్స్‌లో బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌గా గెలిచి మరో రెండు పాయింట్లు పొందడంతో మొత్తం 4-2తేడాతో విజయం సాధించింది. ఫలితం తేలడంతో మహిళల సింగిల్స్ మ్యాచ్ జరగలేదు. బెంగళూరు జట్టు ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ 15-10,15-7 తేడాతో ఎస్ డబ్ల్యు హోను( వారియర్స్) ఓడించగా, రెండో పురుషుల సింగిల్స్‌లో సాయ ప్రణీత్(బెంగళూరు) 15-4, 15-9 తేడాతో ఎల్ డి క్యూన్( వారియర్స్)ను ఓడించాడు. మిక్స్ డబుల్స్ లో క్రిస్టియాన్‌సేన్- పొన్నప్ప(వారియర్స్) ట్రంప్ మ్యాచ్‌గా ఆడుతూ ఎల్లిస్- స్మిత్( బెంగళూరు) జోడీని 15-7, 15-10తేడాతో ఓడించింది. కీలకమైన పురుషుల డబుల్స్‌లో అహ్సన్- సెతియాన్ (బెంగళూరు) ట్రంప్ మ్యాచ్‌గా ఆడుతూ 15-9, 15-14 తేడాతో లీ- క్రిస్టియాన్‌సేన్ జోడీపై విజయం సాధించి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. నేడు జరుగనున్న రెండో సెమీ ఫైనల్లో నేడు హైదరాబాద్ హంటర్స్‌తో ముంబై రాకెట్స్ తలపడనుంది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్ 1
శనివారం 12 జనవరి 2019

# ఈ అమ్మాయిలు... పాముల నేస్తాలు!

నీ నల్లని వాల్జెడ.. నడుముపై నాట్యమాడుతోంది నల్లత్రాచులా! .. అని పడతి జెడను, పామును ఉపమానాలంకారంతో అందంగా బంధిస్తారు కవులు. ఆ మాట ఎలా ఉన్నా.... ఈ అమ్మాయిలు మాత్రం వాల్జెడ సవరించుకున్నంత సుకుమారంగా పాములతో చెలిమి చేస్తున్నారు. వంటిట్లో బొద్దింక కనిపిస్తేనే భయంతో మహిళలు కేకలు పెడతారు. కానీ..వీళ్లు మాత్రం సినిమాలు షికార్లు చేయాల్సిన వయసులో సమాజానికి మేలు చేసే సరీసృపాలను చంపొద్దంటూ....హితబోధ చేస్తున్నారు.. పాములను ఎందుకు చంపొద్దంటే..వాటివల్ల జీవవైవిధ్యానికి,మానవాళికి పరోక్షంగా కలిగే మేలును గుక్కతిప్పుకోకుండా ఏకరువు పెడుతున్నారు.మీకు భయమయితే మాకు చెప్పండి..ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సంస్థ హెల్ప్ లైన్ నెంబర్ 8374233366 రి కాల్ చేయండి..వాటిని కాపాడేందుకు రిస్క్ మేం తీసుకుంటాం అంటున్నారు ఈ హైదరాబాద్ అమ్మాయిలు...ఏరోనాటికల్ ఇంజనీ రింగ్ చదివి,అమెజాన్‌లో జాబ్ చేస్తున్న లక్ష్మీ సాయి, బీఏ ఫైనలియర్ చదువుతున్న లహరి! అవసరమైతే ఉద్యోగాలు వదులుకుంటాం....వైవాహిక జీవితానికి దూరంగాఉంటాం కాని ..పాములను పరిరక్షించే తమ ప్యాషన్‌కు మాత్రం దూరం కామని అంటున్న సాయిలక్ష్మీ,లహరి మనోగతం ఏంటి? పాము కాటేస్తే ప్రాణానికి హాని కలుగుతుందని తెటలిసీ..అంతటి రిస్క్ ఎందుకు తీసుకుంటున్నారు? మూడు పదులైనా దాటని వయస్సులో పాముల పట్ల జీవకారుణ్యం చూపడంలో ఆంతర్యం ఏమిటి? వివరాలు వారి మాటల్లోనే..!



## ఉద్యోగాన్నైనా వదిలేస్తా!

**- సాయిలక్ష్మి**

నాపేరు సాయి లక్ష్మీ విశ్వనాథ్. మాది చెన్నై.. నాన్న ఉద్యోగ రీత్యా ఆరో తరగతిలోనే హైదరాబాద్ వచ్చాము.పెరిగింది,చదువుకుంది,ఉద్యోగంచేస్తుంది హైదరాబాద్‌లోనే. అందుకే నేను హైదరాబాదీనే. ..ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి అమెజాన్‌లో ఉద్యోగం చేస్తున్నా. పాములను రక్షించడం నాకు ప్యాషన్.ఎంతటి ప్యాషనంటే.. అవసరమైతే ఉద్యోగం వదిలేస్తాను..కానీ స్నేక్ కంజర్వేషన్‌ను మాత్రం వదులుకోను. నా అభిరుచిని గౌరవించే వారినే పెళ్లిచేసుకుంటా..లేదంటే లేదు. నాకు చిన్నప్పటి నుంచి డిస్కవరీ ఛానెల్ చూడడం అలవాటు. దాంతో పిల్లి,కుక్క,పక్షులలాగే పాములంటే ఇష్టం ఏర్పడింది. అదే నాతో పాటు పెరిగి పాములను పరిరక్షించడం ప్యాషన్‌గా మారింది. ఇకపోతే ఉద్యోగం శరీరానికి సంబంధించింది..బతుకు తెరువు కోసం....కానీ పాములను కాపాడడం మనసుకు సంబంధించింది. దీనిలో మానసిక సంతృప్తి ఉంది. అది లేకుంటే ఎంత సంపాదించినా.. జీవితానికి అర్థం ఉండదు. అందుకే ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సంస్థలో వాలంటరీగా సేవలు అందిస్తున్నా ...ఏదో లబ్ధికోసం ఈ పనిచేయడం లేదు...జనారణ్యంలో ప్రాణాలు కోల్పోకుండా వనారణ్యంలోకి చేర్చడం ద్వారా పాముల జాతులు అంతరించి పోకుండా నా వంతు ప్రయత్నం చేస్తున్నా. ఈ సమాజంలో మనుషుల లాగే పశుపక్ష్యాదులు ఓ భాగమే. పాములూ మనలాగే ప్రాణమున్న జీవులే. మిస్‌హ్యాండ్లింగ్ చేస్తే.. దానికి బాధవుతుంది. ప్రాణభీతితో కాటేస్తుంది. అంతే తప్ప దాని దారిన దాన్ని పోనిస్తే అది మనజోలికి రాదు. పాము కనిపించగానే అదేదో శత్రువు అయినట్లు దాన్ని మనమే చంపేస్తున్నాము. అవి మనుషుల్ని కాటేయాలని అనుకోవు.

### ఆరుమాసాలు ట్రైనింగ్

పాముల పరిరక్షణ కోసం ఏర్పడిందే ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సంస్థ హైదరాబాద్‌లో ఏర్పడింది. అందులో నా లాంటి వాలెంటీర్లకు ఆరు మాసాలు శిక్షణ ఇస్తారు. విషం ఉన్న,లేని పాములను ఎలా గుర్తించాలి, ఎలా పట్టుకోవాలని అనే విషయంలో పూర్తిస్థాయి తర్ఫీదు ఇస్తారు. ప్రస్తుతం ఆ సంస్థలో 40 మందివరకు అమ్మాయిలం ఉన్నాము. అందులో 20 మంది యాక్టివ్‌గా పనిచేస్తాము. ఎవరి ఇండ్లలోకి అయినా పాము వస్తే సంస్థహెల్ప్ లైన్‌కు ఫోన్ చేస్తే, వాళ్లు ఫోన్ వచ్చిన ఏరియా సమీపంలో ఉన్న వాలంటీర్లను సంప్రదిస్తారు. వాళ్లకు వీలు కాకపోతే దగ్గర్లోఅందుబాటులో ఉన్నవారిని పంపిస్తారు.

### ముందు అవగాహన కల్పిస్తాం

మేము ఎక్కడకు వెళ్లినా అక్కడి పాముల పట్ల అవగాహన కల్గిస్తాము. పాము వల్ల కలిగేమేలు వివరిస్తాము. కొన్ని సార్లు ఇంటిలో దూరిన పాము గోడ కలుగుల్లోకి వెళ్తుంది. అలాంటప్పుడు దానిని రక్షించడం వీలు కాదు. అప్పుడు ఇంటివాళ్లు రంధ్రాన్ని సిమెంటుతో పూడ్చేస్తామని అంటారు.అలా చేస్తే పాము లోపల చనిపోతుంది. అలా చేయకుండా వారిని ఒప్పిస్తాము. లేదంటే .. ఇంటి యజమానిని ఒప్పించి గోడ రంధ్రం పెద్దగాచేసి..పాము రక్షిస్తాము. అలా పట్టుకున్న పామును సైనిక్ పురిలో ఉన్న మా షెల్టర్‌కు చేరుస్తాము.అక్కడి నుంచి అటవీశాఖ అధికారుల సహకారంతో వాటిని అడవి లోవదిలేస్తాము. నేను సంస్థలోచేరిన ఏడాది కాలంలో 100కుపైగా పాములను రక్షించగలిగాను.

### భయం ఉండదు. కానీ...

పాము అంటే భయం ఉండదు కానీ, విష సర్పాలను పట్టుకునేట ప్పుడు కాస్త రిస్క్ చేయాల్సి ఉంటుంది. పొరపాటున పాము కాటేస్తే.. మమ్ములనే కాటేసింది. కాబట్టి ప్రజల్లో పాముల పట్ల..మరింత వ్యతిరేకత పెరుగుతుం ది.అప్పుడు మా లక్ష్యానికి దెబ్బ తగులు తుందని మాత్రం భయప డతాం. చాలా జాగ్రత్తగా వాటిని హ్యాండ్లింగ్ చేస్తాము. నేను కోరేది ఒక్కటే జీవవైవిధ్యా నికి పాముల మనుగడ చాలా అవసరం. పరోక్షంగా మానవాళికి పాములను చంపకండి. మీకు భయమనిపిస్తే మా హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయండి. మేము వాటిని కాపాడు తాము!



(ఫైల్ ఫొటో)



## మొదట్లో అమ్మ భయపడింది : లహరి

మాది హైదరాబాద్. మా అమ్మానాన్నలు వ్యాపారంచేస్తారు. నేను బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. మూగ జీవాలంటే నాకు చాలా ఇష్టం. పామూ ఓ మూగజీవి. పాములంటే ప్రజల్లో సహజంగానే భయం ఉంటుంది. వాటిని పోగొట్టాల్సింది పోయి... కొన్ని టీవీ సీరియల్స్,సినిమాల్లో పాములు కాటేస్తే చనిపోయినట్లు చూపిస్తూ....పాముల పట్ల శతృత్వం పెంచుతున్నాయి. పాములంటే భయపడే వారే..నాగదేవత అంటూ పూజిస్తారు. పుట్టలో పాలు పోస్తారు. ఆహారం లేకపోతే చనిపోతా..అనేంత ఆకలి ఉన్నప్పుడు మాత్రమే పాము కొద్దిగా పాలు తాగుతుంది. ఎక్కువగా తాగితే దాని ప్రాణానికి హానికరం. నిజంగా పాములు మనిషికి హాని తలపెట్టవు. వాటి ప్రాణాలమీదికి వస్తే తప్ప కాటేయ వు.అది తెలియక...సరైన అవగాహన లేక మనం వాటిని చంపుతున్నాము. పాముల వల్ల సమాజానికి మేలు జరుగుతుందని ప్రజల్లో అవగాహన కల్పించేం దుకే ఫ్రెండ్స్ ఫర్ స్నేక్స్ సొసైటీల వాలెంటరీగా చేరాను.

### విషం ఉన్న రకాలు నాలుగే

మన దగ్గర ఎన్నో రకాల పాములున్నాయి. కాని అందులో కోబ్రా, ఎర్ర రక్తపింజర, చిన్నపింజర, కట్టపాములకు మాత్రమే కోరల్లో విషం ఉంటుంది. ఇంకే ఏపాములకు విషం ఉండదు. మనం నివాసాల కోసం.. పరిశ్రమలకోసం ..రెండు దశాబ్దాలుగా వ్యవసాయ భూములు, అడవులను నరికేశాము. ప్రస్తుతం ఎటు చూసినా కాంక్రీట్ జంగిల్. అందుకే తలదాచుకోవడానికి పాములు జనావాసాల్లోకి వస్తున్నాయి. వాటిని చూడగానే భయంతో మనం చంపేస్తున్నాము. కాని పాములు ప్రజలకు మేలు చేస్తున్నాయని మరిచి పోతున్నాము. కలుగులో ఉన్న ఎలుకలను తినేది ఒక్క పాము మాత్రమే. ఎలుకలు పెరిగిపోతే ప్లేగు వ్యాధి వస్తుంది. అలాగే పంటపొలాల్లో పంటను నాశనంచేస్తున్న ఎలుకలను ర్యాట్ స్నేక్స్ తినేస్తాయి. అందుకే వాటిని రైతు నేస్తాలు అంటాము.

### జీవితాంతం..

పాములను కాపాడాలనేది నాకు ప్యాషన్. మా పెద్దమ్మకు వన్యప్రాణులంటే ఇష్టం. నల్లమల అడవిలో పులుల గణనకోసం అధికారులతో కలిసివెళ్లేది. ఒకవిధంగా ఆమె నాకు స్ఫూర్తి. మనిషిగా సాటి మనిషికి చేతనైనంత సాయం చేయడం మన ధర్మం. అందుకే నాకు సమాజానికి సేవచేయాలంటే ఇష్టం. సొసైటీకి పరోక్షంగా మేలుచేస్తున్న పాముల పరిరక్షణను మార్గంగా ఎంచుకున్నా. జీవితాంతం పాములను కాపాడుతూనే ఉంటా. ప్రస్తుతం చదువుకుంటున్న నేను..ఉద్యోగం వచ్చినా నా ప్యాషన్‌ను కొనసాగిస్తాను. నా అభిరుచికి అడ్డు వస్తుందనుకుంటే పెళ్లిని కూడా త్యాగం చేస్తా. కానీ పాములను పరిరక్షించే పనిమాత్రం వదులుకోను.

నా ప్యాషన్ చూసి అమ్మ మొదట్లో భయపడింది. నా ప్రాణాలకు రిస్క్ అని. అందుకే నేను ఓసారి అమ్మను పాము పట్టేటప్పుడు తీసుకెళ్లి..అవగాహన కల్గించాను. ఇప్పుడు ఆమెకు భయం పోయింది. మన ఇంట్లో తిరిగే బొద్దింకలు,బల్లులు,ఎలుకలలాంటివే పాములు కూడా. ఎలుకలు, బొద్దింకల వల్ల రోగాలు వచ్చే అవకాశం ఉంది.కాని పాము చాలా పరిశుభ్రత పాటించే జీవి.అందుకే మనం వాటి జోలికివెళ్లకుంటే అవి మనల్ని ఏమీచేయవు. కనిపిస్తే వాటి దారిన వాటిని వెళ్లనీయండి. భయం అనిపిస్తే మా హెల్ప్ లైన్‌కు కాల్ చేయండి. కాని పాములను చంపవద్దు. అలాచేయడం వల్ల మనం సమాజానికి ఎంతో మేలుచేసినవాళ్లం అవుతాము.

### ప్రతి ఆదివారం...!

చెప్పానుగా ..నాకు పాములంటే భయంలేదు.. పాములను ఎలా హ్యాండిల్ చేయాలో సొసైటీ శిక్షణ ఇచ్చింది. పాములను తోకపట్టి గుంచి విసిరి వేస్తుంటారు. అలా చేయడం వల్ల వాటికి దెబ్బలు తగులుతాయి. కొన్ని సార్లు గాయలపాలై చనిపోతాయి కూడా. అందుకే పాములను చాలా జాగ్రత్తగా పట్టుకుని షెల్టర్‌కు తరలిస్తాము. ప్రస్తుతం నగరంలో 60 మందికిపైగా నాలాంటి వాలెంటీర్లు ఉన్నారు. మేం ఏంచేసినా..ఆశించిన ప్రయోజనం రాదు. అందుకే ప్రజల్లో అవగాహన పెంచడం కోసం సంస్థ తరుపున ప్రతి ఆదివారం నెహ్రూ జూపార్క్ లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ఇది పూర్తిగా స్వచ్ఛంద కార్యక్రమం.. ఎలాంటి ఫీజు ఉండదు. అందుకే పాములు ఇళ్లలోకి వచ్చినప్పుడు మా సంస్థ హెల్ప్ లైన్‌కు కాల్ చేయమని కోరుతున్నా.. ఎందుకంటే కంజర్వేషన్ అనేది ఏ ఒక్కరోఇద్దరో చేస్తే చాలదు.. అది డోర్ స్టెప్‌నుంచే ప్రారంభం కావాలి. మనకు మేలు చేసే పాములను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే!

**- చొల్లేటి వేంకటేశ్వరా చారి**

## * రంగవల్లిక *



కె.నాగలక్ష్మి, తాండూరు

15 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు



11 చుక్కలు
5 వచ్చేవరకు
మధ్యచుక్క





నీలారపు ధీరజ, 6వ తరగతి, హన్మకొండ

### మీరూ ముగ్గులు పంపొచ్చు

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ,
8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.


## ముచ్చటగా ముప్పై రోజుల్లో...!

బంధం ఏదైనా కాలం గడిచే కొద్దీ స్పార్క్ తగ్గిపోవడం సర్వసాధారణం. ముఖ్యంగా దాంపత్యంలో! మొదట్లో ఉన్న ఉత్సాహం, ఉత్తేజం రోజులు గడిచినా కొద్దీ సన్నగిల్లుతుంది. జీవితం నిస్సారంగా మారుతుంది. కారణం కుటుంబ భారం కావచ్చు..పని ఒత్తిడి కావచ్చు.. మొత్తానికి మొదట్లో ఉన్న ప్రేమానురాగాలు సన్నగిల్లుతాయి. జీవితం రొటీన్‌గా మారిపోతుంది. అయితే చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే మాత్రం దాంపత్య బంధం పునరుత్తేజం అవుతోంది. 30 రోజుల్లో పెళ్లైన కొత్తలోని ఉన్న ఉత్సాహం ఉరకలు వేయాలంటే ఏం చేయాలో చూద్దాం!

- మీరు మీ భాగస్వామితో ఉన్నప్పుడు ఆఫీస్ ఫైల్స్ తిరగేయడం..మెయిల్స్ ,మెసేజ్‌లు చెక్ చేయడం మానేయండి.ల్యాప్‌ట్యాప్,సెల్ ఫోన్ లాంటి పరికరాలు పక్కన పడేయండి..మీ సమయమంతా మీ భాగస్వామితో ముచ్చట్లకు కేటాయించండి.
- వారాంతంలో రోజువారి పనులకు పూర్తిగా సెలవివ్వండి. పని ఒత్తిళ్లకు దూరంగా.. మీ భాగస్వామితో ఏకాంతంగా గడిపేలా ప్లాన్ చేసుకోండి. మీ పెళ్లైన కొత్తలో అనుభవించిన తీపిజ్ఞాపకాలను నెమ రేసుకోండి. ఒకరితో ఒకరు మాట్లాడుతూ రోజంతా గడపండి. మీరు జీవితాంతం ప్రేమానురాగాలతో కలిసి జీవించేందుకు ఏమి చేయాలనుకుంటున్నారో తెలియజేయండి.
- సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు, మీ భాగస్వామికి స్వీట్లు, పండ్లు లాంటివి తెచ్చి, ఇద్దరు కలిసి భోజనం చేయడం రివాజు.. కానీ వారానికి ఒకరోజు రొటీన్‌కు భిన్నంగా ప్లాన్ చేసుకోండి. మీ భాగస్వామితో కలిసి బయటకు డిన్నర్‌కు వెళ్లం డి. అందుకోసం ముందుగానే రెస్టారెంట్‌లో టేబుల్ రిజర్వు చేసిపెట్టుకోండి. టేబుల్ మీద ఫ్యాన్సీ క్లాత్ అలంకరించి ఉండేలా చూసుకోండి. దంపతులు ఇద్దరు వివాహం జరిగిన కొత్తరోజులను గుర్తుచేసుకుంటూ డిన్నర్ ముగిం చండి.
- ఈ ఉరుకుల పరుగుల జీవితాల్లో భాంర్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగం చేయక తప్పని పరిస్థితి.కొందరు వేర్వేరు ప్రాంతాలలో ఉద్యోగం చేస్తుంటారు. అలాంటప్పుడు వారానికి ఒకరోజు మీరు కలిసిన ప్పుడు..ఎప్పటిలా కాకుండా మీ భాగస్వామి పట్ల మీ ప్రేమ, ఆమె సాంగత్యంలో మీ అనుభూతులను,మీ భావాలను మాటలతో కాకుండా..రాతల రూపంలో వ్యక్త పరచండి. పరస్పరం వారానికి ఒక రోజు చేయడం వల్ల.. మీ స్వదస్తూరితో మీరు రాసిన .ఆ రాతలు మీ భాగస్వామిని పెళ్లి అయిన తొలినాళ్లలోని జ్ఞాపకాలలోకి తీసుకెళ్తుంది.
- మీరు ఇద్దరు మాట్లాడుకంటున్నప్పుడు, లేదా ప్రయాణం చేస్తున్నప్పుడు.. ప్రేమ పూర్వకంగా భాగస్వామి చేతిని మీ చేతిలోకి తీసుకుని ముచ్చట్లు చెప్పండి.అలాగే ఆదివా రాల్లో ఒకరికి ఒకరు తలను మాసాజ్ జేసుకోండి. ఒక ఐదు సెకన్లపాటు ఆలింగనం చేసుకోండి. నిద్రపోయే ముందు గుడ్‌నైట్ చెప్పడం ,ఉదయం లేవగానే గుడ్ మార్నింగ్ చెపడం మరిచిపోకండి. ఇవి చిన్నవిషయాలే అయినా దాంపత్య బంధాన్ని నిత్యనూతనంగా ఉంచుతాయి.
- ప్రతి మనిషికి చెస్‌ఆడడం, జిమ్‌కు వెళ్లడం, పెయింటింగ్ వేయడం లాంటి ఇతరత్రా హాబీలు ఉంటాయి. పెళ్లి అయినా హాబీలు మారవుకదా! పెళ్లయిన తర్వాత హా బీలలో కామన్‌గా ఉన్నదాన్ని గుర్తించి...ఇద్దరు కలిసి చేయండి. కామన్ హాబీ లేకుంటే మీ భాగస్వామికి హాబీలలో దేనిమీద మీకు ఆసక్తి ఉంటుందో దానిని ఆమె/అతనితో కలిసి చేయండి. అది మీ బంధాన్ని బలోపేతం చేస్తుంది.



# 'వివేక'వాణి




నీకంటూ ఒక దేశం ఉంది. దానికి గర్వించదగ్గ సంస్కృతి ఉంది. ధైర్యం వహించు, భారతీయుడినని సగర్వంగా ప్రకటించు అన్నారు వివేకానందులు. పురుషుల వలె దేశంలో ప్రతి స్త్రీ విద్యావంతురాలు కావాలి. పురుషునితో సమానంగా జీవించే హక్కు ప్రతి స్త్రీకి ఉంది. తన కాళ్లపై తాను నిలబడగలగాలి, స్త్రీలు విద్యావంతులైతే తమ భవిష్యత్తును తామే రూపొందించుకుంటారు.

**మ**హత్తర బాధ్యతలు నెత్తికెత్తుకున్న వారు మహనీయులు. అటువంటివారిలో వివేకానందుడు ఒకరు. హిందూ జాతి, సంస్కృతులపై విదేశీయుల బౌద్ధిక దురాక్రమణలు విశృంఖలంగా సాగుతున్న రోజుల్లో హిందూతత్వం గురించి, సనాతన ధర్మ ఔన్నత్యాన్ని గురించి విశ్వానికి చాటి చెప్పాలని నిర్ణయించుకున్నారు వివేకానందులు. పాశ్చాత్యుల సంకుచిత మత దృక్పథాలలో ఉన్న దురహంకారాన్ని తుదముట్టించాలని, అపోహలను రూపుమాపాలని తలపోశారు ఆయన. హిందూత్వం అంటే మానవ ధర్మ సంస్కృతుల, ఆలోచనారీతుల, తాత్విక వైవిధ్యాల, జీవన లక్ష్యాల సమగ్ర సమాహారమని ప్రాచీన ఋషుల భావాలను దృఢపరచడానికి సిద్ధమయ్యారు వివేకానంద. ఇదొక మహత్తర బాధ్యత. ఆ బాధ్యత నెరవేరే అవకాశం వస్తుందా? అన్న సందేహం ఆయనలో మొలకెత్తింది.

**యత్నకృతే యది న సిద్ధ్యతి కోత్ర దోషః** (ప్రయత్నం చేసినా లక్ష్యం సిద్ధించకపోతే తప్పెవరిది?). ఇది భర్తృహరి మాట. ఇది వివేకానందుని మదిలో మెదిలింది. ముందుకు కదిలాడు వివేకానందుడు. **ఉద్యోగినం పురుష సింహముపైతిలక్ష్మీః** (ప్రయత్నంతోనే సకలాన్ని సాధిస్తాడు మనిషి) అని అడుగు ముందుకు వేయాలి. తడబాటుకు తావు లేదు. అందుకు ఆయన వేదికను ఎంచుకున్నారు. అదే చికాగోలో జరిగిన ప్రపంచ మత మహాసభ.

ఆ సభకు చేరడానికి వివేకానందుడు నానా కష్టాలు పడ్డారు. మరొకరైతే ఆ కష్టాలకు భయపడి మధ్యలోనే తప్పుకునేవారు. జార్జి డబ్ల్యు హేర్ అనే మహిళ స్వయంగా సభాధ్యక్షుడైన జె.హెచ్. బారోస్‌కు వివేకానందుని పరిచయం చేసింది. ఆ విధంగా ఆయన సభలో పాల్గొనగలిగారు. 1893 సెప్టెంబర్ 11న ఆయన వేదికను అలంకరించారు. సభ తొలినాడు వివేకానందుడు 32వ స్థానంలో ప్రసంగించవలసి వచ్చింది. అధ్యక్షులు పదే పదే గుర్తు చేసినా తాను చివరలో మాట్లాడతానని వివేకానంద చెప్పారు. అంతవరకూ ప్రసంగించిన వారందరూ రాసుకు వచ్చిన పాఠాన్నే చదివారు. ఎవరికి వారు తమ మతమే గొప్పదని చెప్పు కొచ్చారు. ఏడు వేల మంది ప్రతినిధులు గల సభలో ఒక్కొక్క వ్యక్తి ప్రసంగం పూర్తి కాగానే అది వినడానికి వచ్చిన కొంతమంది లేచి వెళ్లిపోయే వారు. వివేకానంద ప్రసంగించే సమయానికి సభ వెలితిగా ఉంది. అయినా ఆయన నిరుత్సాహపడలేదు. ఇతర వక్తల వలె ఆయన రాసుకున్నది చదవలేదు. ప్రసంగం ఆశువుగా సాగింది.

స్ఫురద్రూపి అయిన వివేకానందుడు కాషాయాంబరాలతో అదే రంగు తలపాగాతో వేదికపై నిలిచారు. మొదటగా ఆయన చేసిన 'సోదర సోదరీ మణులారా!' అనే సంబోధన అందరినీ సోదర భావంతో చూడాలని చాటే భారతీయ సంస్కృతిని విలక్షణ తత్వాన్ని పరిచయం చేసింది. సభను ఆనంద కోలాహలం ముంచెత్తింది. దిక్కులు పిక్కటిల్లేలా కరతాళ ధ్వనులు మిన్ను ముట్టేయి. అది విని సభ ప్రాంగణం బయట ఉన్న వారు సైతం పరుగు పరుగున లోపలికి వచ్చారు. వివేకానందుడు హిందూమతం ప్రతినిధిగా ప్రసంగించినా ఆయన మాట్లాడినది సర్వ మానవ సౌభ్రాత్రాన్ని పెంపొందించాలనే విశ్వ మతం గురించే. నాటి నుంచి ఆయన ఆరు రోజులు ఆరుసార్లు ప్రసంగించారు. ఆయన ప్రసంగాలన్నీ హిందూ మతాన్ని విశ్వ మతానికి అన్వయిస్తూ విశ్లేషించడమే!

ప్రతి ప్రసంగంలో వివేకానందుని వాణి అమృతవాణి. సనాతన, అధునాతన ప్రపంచ వాణి. ఏ ప్రాంతానికి చెందిన వారైనా, మతానికి చెందినవారైనా, ఏ భాష మాట్లాడే వారైనా అవశ్యం అనుసరించి ఆచరించాల్సిన దివ్య వాణి. అదే వివేకానందుని వివేక వాణి. ఆయన ఆ సభలో మతం గురించి చెబుతూ, 'మతం అంటే సమ్మతం. అన్ని మతాలు చెప్పేది సత్యం. ఆ సత్యం భిన్నత్వంలో ఏకత్వం. అనేకము, ఏకముతో లయిస్తే అదే భగవంతుడు. సాకారుడు, నిరాకారుడు రెండూ దేవుడే. అది తెలుసుకోవడం ఆయా వ్యక్తుల స్థాయిని బట్టి ఉంటుంది. ఈ సత్యాన్ని తెలియజెప్పే ధర్మం హిందూ ధర్మం. అది సనాతనం. ఎప్పుడూ ఉండేది' అన్నారు. వివేకానందుడు శ్రోతలలో వివేక విచక్షణలు కలిగించడానికి విస్తృతంగా ఉపనిషత్తులు, భగవద్గీత, స్తోత్రాలను ఉటంకించారు. వివేకానంద వాణి అమెరికా నలుమూలలకు చేరింది. మరునాటి నుంచి సభా ప్రాంగణం కిక్కిరిసింది. శ్రోతలు వెళ్లిపోకుండా ఆయన ప్రసంగం ఆఖరున ఉంచేవారు నిర్వాహకులు. ఆయన ప్రసంగం ఇంకా ఇలా సాగింది. 'ఒక్కటే సత్యం. అదే భగవంతుడు. ఆయనను ఏ పేరుతోనైనా పిలవొచ్చు. నదులన్నీ సముద్రంలో కలసినట్లు మనుషులు ఏ దేవుణ్ని ప్రార్థించినా అవి ఒక్క సర్వేశ్వరునికే చేరుతాయి. ఆధ్యాత్మిక చింతనలో ఎవరికి ఏ మార్గం అనుకూలమైనా లక్ష్యానికి చేరడమే ముఖ్యమని ద్రష్టలైన భారతీయ ఋషులు ప్రపంచానికి ఉద్బోధించారు' అని ఆయన ఉద్ఘాటించారు. ఆయన తమ బోధనల్లో భారతీయ యువతను ఉద్దేశించి చేసిన ప్రసంగాల్లో 'నీకంటూ ఒక దేశం ఉంది. దానికి గర్వించదగ్గ సంస్కృతి ఉంది. ధైర్యం వహించు, భారతీయుడినని సగర్వంగా ప్రకటించు అన్నారు. పురుషుల వలె దేశంలో ప్రతి స్త్రీ విద్యావంతురాలు కావాలి. పురుషునితో సమానంగా జీవించే హక్కు ప్రతి స్త్రీకి ఉంది. తన కాళ్లపై తాను నిలబడగలగాలి, స్త్రీలు విద్యావంతులైతే తమ భవిష్యత్తును తామే రూపొందించుకుంటారు' అన్నారు వివేకానంద. సమాజం పట్ల ప్రతి వ్యక్తికి బాధ్యత ఉంది. అందుకు అవసరమైనవి త్యాగం - సేవ అన్నారు. భరత మాత సనాతన దేవత. పరమ దేవత. ఈ సత్యం జాతీయ తత్వం. హిందూత్వం. ఇది మన దేహంలో కణ కణాన కలిసి ప్రవహిస్తోంది. ఈ జాతీయ తత్వాన్ని అలవరుచుకున్న వారికి ఈ మాతృ భూమి ఒడి, గుడి, బడి అని అన్నారు. వివేకానందుడు ప్రపంచ మతాల సభలోనే కాక ఈ దేశమంతా తిరిగి వినిపించిన వాణిని అందుకుని, ఆచరణలో చూపించడం ఈ దేశవాసుల కర్తవ్యం, తద్వారా సనాతన ధర్మ సంస్కృతులను పరిరక్షించినవారలమవుదాం.

* మతం శక్తివంతమైనది. దానిని నశింపజేయడం ఎవరి తరం కాదు. మతం మంచిని పెంచుతుంది. మారణ హోమాన్ని కాదు, మానవ శ్రేయస్సును, సౌభ్రాత్రాన్ని పెంపొందిస్తుంది. ఈ సత్యాన్ని ప్రపంచానికి చెప్పేదే సనాతన ధర్మం. ఈ ధర్మానికి ప్రతీకగా ఇక్కడ నిలుస్తున్నందుకు గర్విస్తున్నాను

* ప్రపంచం పరిశుద్ధంగా ఉండాలంటే మానవుడు జ్ఞానిగా, విశుద్ధంగా, ఆత్మ బలోపేతునిగా, విద్యావంతునిగా, శీలవంతునిగా ఉండాలి.

* ప్రతిమలను భగవంతునిగా పూజించడంలో తప్పులేదు. ప్రతిమనే భగవంతునిగా చెప్పడం సరికాదు

* మాతృభూమి అంటే మట్టిముద్ద, నీళ్లు, రాళ్లు కాదు. పంచభూతాత్మకమైన ఈ శరీరానికి చైతన్య శక్తి. జాతీయ అస్తిత్వానికి ఆధారం. ఈ వాస్తవాన్ని మన ఋషులు గుర్తించారు.

- వివేకానంద

- ఏ. సీతారామారావు
8978799864

# చింతన


## తిరుప్పావై

### పాశురం 28

**కఱవైగళ్ పిన్‌శెన్ఱు కానమ్ శేర్న్దుణ్బోమ్**
**అఱివొన్ఱు మిల్లాద వాయ్‌క్కులత్తు, ఉన్దన్నై**
**ప్పిఱవి పెఱున్దనై పుణ్ణియమ్ నాముడైయోమ్;**
**కుఱైవొన్ఱు మిల్లాద కోవిన్దా! ఉన్దన్నోడు**
**ఉఱవేల్ నమక్కిఙ్గు ఒళిక్క వొళియాదు,**
**అఱియాద పిళ్ళైగళోమ్, అన్బినాల్ ఉన్దన్నై**
**చ్చిఱు పేర్ అళైత్తనవుమ్ శీఱి యరుళాదే**
**ఇఱైవా నీ తారాయ్ పఱై, యేలో రెమ్బావాయ్**

**తాత్పర్యం**


శ్రీకృష్ణా! పశువుల వెనుబడిపోవు అజ్ఞానులం. వాటి వెనుక అడవికి పోయి శుచిలేకనే భుజించు వారలము. ఇసుమంతైనా జ్ఞానములేనట్టి పుణ్యమంటే తెలియని గొల్ల కులమునకు చెందిన వారలమైనప్పటికి, మాతో సమానమైన వానిగ నిన్ను పొందినవారల మయ్యా! మేము మాకెన్ని లోపము లున్ననూ తీర్చ గలిగినట్లు పరిపూర్ణుడవు నీవు. గోవిందా! ఇచట నీకు మాకు గల ఈ సంబంధము మన మిరువురము కలసి పోగొట్టు కొందు మనిననూ పోవు నది గాదు సుమా! లోక మర్యాదలను ఎరుంగని చిన్న పిల్లలము. ప్రేమాతిశయముచే తెలియక ఇప్పటివరకు నిన్ను తగీతగని చిన్ని చిన్ని పేర్లతో పిలచినాము. అంతమాత్రాన కోపపడక, ఓ స్వామీ! మేము కోరిన పఱై అనుదానిని మాకొసంగి కటాక్షించుము.





- జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సౌజన్యంతో

## నా భక్తులకే క్షేత్ర విజ్ఞానం అవగతం




**అధ్యాయం-13, శ్లోకం -19**

**ఇతి క్షేత్రం తథా జ్ఞానం**
**జ్ఞేయం చోక్తం సమాసతః।**
**మద్భక్త ఏతద్విజ్ఞాయ**
**మద్భావాయోపపద్యతే॥**

**తాత్పర్యం**

ఈ విధముగా క్షేత్రము, జ్ఞానము, జ్ఞేయములను గూర్చు నాచే సంక్షేపముగా చెప్పబడినది. కేవలము నా భక్తులే దీనిని పూర్తిగా అవగాహనము చేసికొని నన్ను పొందగలరు.

**భాష్యం**

ఇప్పటి వరకూ ఈ అధ్యాయమున 6,7 శ్లోకాలలో శరీరము, భౌతిక జగత్తునకు కారణమైన భౌతిక మూలకాల గురించి, 8 నుండి 12వ శ్లోకములందు ఆత్మ పరమాత్మలను తెలుసుకొను జ్ఞాన మార్గమును, 13 నుండి 18వ శ్లోకము వరకు ఆత్మ పరమాత్మల గురించి వివరించటం జరిగింది. కాబట్టి ఈ మూడు అంశాలైన క్షేత్రము, ఇరువురు క్షేత్రజ్ఞులు, వారిని అర్థము చేసుకొనుటను, కలిపి 'విజ్ఞానము' అందురు. జ్ఞానము అంటే జీవుడు తన బద్ధ స్థితిని తెలుసుకొని తన భౌతిక చైతన్యమును భగవత్ చైతన్యమును ఉద్ధరించుకొనుట. అనగా జ్ఞానమనేది భగవద్భక్తి యొక్క ప్రాథమిక అవగాహన. అయితే ఇక్కడ స్వయంగా భగవంతుడే తెలియజేస్తున్నట్లు కేవలము భక్తులు మాత్రమే ఈ జ్ఞానమును పరిపూర్ణముగా అర్థము చేసుకోగలుగుతారు. అనగా భగవద్గీతా బోధనల నుండి భక్తులు మాత్రమే పూర్తి ఫలితాన్ని పొందగలుగుతారే గాని మిగిలినవారు పొందలేరు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



# గోప్యతా ప్రధానమే!

**వ్య**క్తికి గాని, కుటుంబానికి గాని, సమాజానికి గాని, రాష్ట్రానికిగాని, దేశానికి గాని, ఆఖరుకి ప్రపంచానికి కూడా గాలి, నీరు, తిండి తర్వాత అత్యవసరమైనది గోప్యత. గోప్యత అంటే అన్నింటిని అంతా చెప్పేయకుండా అవసరమైన మేరకే వెల్లడించి కొంత విషయాన్ని రహస్యంగా ఉంచడం. ఆధునికంగా అవలోకిస్తే పాలకులు కూడా కొన్ని పరిమితుల మేర గోప్యత పాటించాలి. అది వారు ప్రభుత్వ బాధ్యతలు చేపడుతూ ప్రమాణ స్వీకారం చేసినప్పుడు పాటించాల్సిన బాధ్యత.

గోప్యతని ముఖ్యంగా తొమ్మిది విషయాలలో పాటించి తీరాలని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఎందుకు గోప్యత అవసరమో కారణాలను చెబుతున్నాయి. ఈ తొమ్మిదింటిని నవ గోప్యాలు అంటారు. ఆయువు, విత్తము (డబ్బు), ఇంటి గుట్టు, మంత్రం, ఔషధం, సంగమం, దానం, మానం, అవమానం అనే వాటిని నవ గోప్యాలు అంటారు. వీటి విషయంలో గోప్యత పాటించకుంటే జరిగే అనర్థాలు ఏమిటో పరిశీలిద్దాం.



### ఆయువు

ఆయువు లేకపోతే మనిషికి భవిష్యత్తు శూన్యం. భవిష్యత్తు ఆశావహంగా ఉంటేనే మనిషి అభివృద్ధిని సాధించగలడు. ఆయువు తీరిపోతుందంటే కాకలు తీరిన వీరుడైనా, శూరుడైనా భయంతో, బెంగతో ఆలోచనలతో, ఆందోళనలతో ముందుగానే చనిపోవడం ఖాయం. ఆయువు విషయంలో గోప్యత లోపిస్తే అది యదార్థమైనా నిండు మనిషిని బాధి స్తుంది. అందువల్ల వైద్యుడైనా, జ్యోతిష్కుడైనా ఆయువు విషయంలో గోప్యత పాటించాలని శాస్త్రకారుడు చెప్పేడు.

### ధనం

ధనం వల్ల ఎన్నో ప్రమాదాలుంటాయి. ఎవరి దగ్గరైనా ఎక్కువ డబ్బున్న విషయం బహిరంగమయితే దొంగలు బరితెగించి ఆ వ్యక్తిని చుట్టుముట్టి దానిని దోచుకుపోయే అవకాశం ఉంది. లేదా పాలకులే ఆ ధనాన్ని స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. మరో పక్క డబ్బులేదనే విషయం వెల్లడయితే సమాజంలో చిన్న చూపుకు గురయ్యే అవకాశం కూడా ఉంది.

### ఇంటిగుట్టు

ప్రతి గృహంలో ఎన్నో సమస్యలు ఉంటాయి. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి గానీ వాటిని బహిరంగపరచి పంతాలకు, పట్టింపులకి పోతే ఇంటి రహస్యాలు వీధిన పడతాయి. దానితో ఆ ఇంటిలోనివారు చులకన అయిపోతారు. కుటుంబం దెబ్బతింటుంది. తద్వారా సమాజ వ్యవస్థ దెబ్బతింటుంది. ఇంటి రహస్యాలు బయటపడితే ఇతరులు తలదూర్చి సమస్యలను జటిలం చేసే అవకాశం కూడా ఉంది. ఇంటిగుట్టు లంకకు చేటు అన్న నానుడి ఉండనే ఉంది.

**'రమ'ణీయం**

### మంత్రం

విశ్వాసం ఉన్న వారికే మంత్రం చెప్పాలి. మననం చేసేది మంత్రం కనుక రహస్యంగా ఉపదేశించాలి. విశ్వాసం లేని వారికి ఉపదేశించడం వల్ల మంత్రం అగౌరవం పాలయ్యే అవకాశం ఉంది. దుర్వినియోగం అయ్యే అవకాశం ఉంది. కొన్ని మంత్రాలు విశ్వాసం లేని వారికి ఉపదేశం చేయకూడదనే నియమం కూడా ఉంది.

### ఔషధం

ఈ సృష్టిలో ప్రతి ఆకు, మొక్క ఔషధ కారకమే. అయితే వాటితో సరైన విధంగా ఔషధాలు తయారు చేసే ప్రక్రియలు ఉంటాయి. లేని పక్షంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ప్రతి వారికి నైపుణ్యం లేకపోయినా ఆ రహస్యం తెలిస్తే వారు వారికి తోచిన విధంగా, రోగ లక్షణాలు తెలియకుండా ఔషధాలను తయారుచేస్తే అనేక అనర్థాలు జరుగుతాయి. అందువల్ల ఔషధం విషయంలో గోప్యత అవసరం.

### సంగమం

సంగమం అంటే కలుపుకోవడం. ప్రతి కలయికలోనూ, భేటీలోనూ ఎంతో రహస్య సమాచారం ఉంటుంది. ఆ సమాచారం బహిర్గతమైనపుడు ఆ వ్యక్తుల వ్యక్తిత్వాలకే కాకుండా దాని వల్ల సమాజానికి కూడా ఎంతో హాని జరు గుతుంది. అందువల్ల సంగమం విషయంలో గోప్యత అవసరం.

### దానం

దానం బహిర్గతమైతే, ఇచ్చే వ్యక్తి దగ్గర ఎక్కువ డబ్బు ఉందని పలువురు అతనిని వేధించి డబ్బు తీసుకునే అవకాశం ఉంటుంది. అంతేకాక అతని వద్ద ఎక్కువ డబ్బు ఉందని అసాంఘిక శక్తులు అతనిపై దాడి చేయవచ్చు. అంతేగాక దానం ఇచ్చిన వ్యక్తిని ప్రత్యేక లక్షణాలు గల వ్యక్తిగా సమాజం పరిగణిస్తుంది. దానితో అతనిలో అహంకారం పెరిగే అవకాశం ఉంది.

### మానం

మానం అంటే గౌరవం. గౌరవాన్ని మనిషి కాపాడుకోవాలి. మనం ఎంత ఒద్దికగా, అణకువతో ఉంటే అంతగా మన గౌరవం పెరుగుతుంది. మన గౌరవాన్ని బహిరంగపరచి బలవంతుడినని విర్రవీగితే అగౌరవం, అధోగతి ప్రాప్తిస్తుంది.

### అవమానం

మనం పొందిన అవమానాలను రహస్యంగా ఉంచుకోవాలి. లేకపోతే ఈ విషయం మరొకరికి తెలిసి వారు కూడా అదే చేసేందుకు సిద్ధపడవచ్చు. అందులో మన బలహీనత ఏదైనా ఉంటే దానిని ఇతరులు ఆసరాగా తీసుకునే అవకాశం ఉంది. ఆ అవమానాన్ని మరచిపోయే ప్రయత్నం చేయాలి. పదేపదే గుర్తు చేసుకుంటే క్రోధం పెరిగి, పగ ప్రతీకారాలకు దారి తీస్తుంది. అశాంతికి ఆజ్యం పోస్తుంది. అందువల్ల అవమానాల విషయంలో గోప్యత పాటిస్తే కాలానుగుణంగా దానిని మరచిపోయే అవకాశం ఉంటుంది. సమస్య ద్విగుణీకృతం కాకుండా గోప్యత దోహదం చేస్తుంది.

నీ చుట్టూ ఉన్న ముళ్ళన్నిటినీ నీవు ఏరివేయలేవు. కాని ఆ ముళ్ల బారిన పడకుండా మనం పాదరక్షలు ధరిస్తే అవి మనను బాధించవు. అలాగే ఈ గోప్యతలు పాటిస్తే కొన్ని సమస్యలను నివారించుకోవచ్చు.



- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

## దిన ఫలాలు

**మేష రాశి:** పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. శుభవార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

**వృషభ రాశి:** అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో చిరు సమస్యలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించ గలుగుతారు.

**మిథున రాశి:** వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహ కార్యాలు, కార్య క్రమాలు కలసి వస్తాయి. మానసికధైర్యం పెరుగుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

**కర్కాటక రాశి:** దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనం దాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

**సింహ రాశి:** ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

**కన్యా రాశి:** ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

**తులా రాశి:** విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనం దాన్ని కలిగిస్తాయి.


**వృశ్చిక రాశి:** వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు తగ్గుతాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

**ధనూ రాశి:** ఉద్యోగ ప్రయత్నాలు లభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

**మకర రాశి:** ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికిపోయి చెడుకోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

**కుంభ రాశి:** నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.


**మీన రాశి:** విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్య ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com




# భద్రత కోసం నిర్మిస్తే వింత అయ్యింది



గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను 500 సంవత్సరాల క్రితమే నిర్మించారు. అప్పట్లో ప్రతీ నగరానికి గోడ కవచంగా ఉండేది. గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను ఒక రాష్ట్రం లేదా ఒక వంశం నిర్మించలేదు. అంచెలంచెలుగా దీన్ని నిర్మించారు. కిన్ షి హూంగ్ చైనా మొదటి చక్రవర్తి. ఆయన హాయంలో ఈ గోడను నిర్మించాలన్న ఆలోచన కలిగింది. అప్పట్లో అఖండ చైనా చిన్న చిన్న ముక్కలుగా విడిపోయింది. దీంతో చక్రవర్తులు ఎవరి దేశానికి వారు గోడ నిర్మించుకోవడం అనివార్యమైంది. ఈ గోడల వల్లే ఆయా దేశాల రక్షణకు ఈ గోడే ఆధారపడి ఉంటుంది.

**తైపా మట్టి**

ఇటుకలు ఉపయోగించడం అప్పట్లో లేదు. కాబట్టి చైనా గోడ నిర్మాణంలో తైపామట్టిని వినియోగించారు. అయితే మిగ్ వంశస్తుల కాలంలో వీటి నిర్మాణానికి ఇటుకలను విరివిగా ఉపయోగించారు. ఇటుకలు, టైల్స్, సున్నము, రాళ్లు ఉపయోగించారు. ఇటుకల ఉపయోగం వల్ల నిర్మాణంలో వేగం తగ్గింది. రాళ్ల స్థానంలో ఇటుకల ఉపయోగం చాలా సులువైంది. మట్టి కంటే ఇటుకలు ఎక్కువ బరువును మోస్తాయి. ఇటుకలకంటే రాళ్ల నిర్మాణం ఎక్కువ దృఢత్వాన్ని కలిగి ఉంటుంది. కానీ రాళ్ల ఉపయోగం అంత సులువైంది కాదు అందుకే ఇటుకలను ఎక్కువగా ఉపయోగించారు. రాళ్లను పునాదుల కొరకు ఇటుకలను గోడల నిర్మాణానికి ఉపయోగించారు.

తుఫానులవల్ల దెబ్బతింది

**ఇసుక తుఫానుల ధాటి**

గ్రేట్ వాల్ ఆఫ్ చైనాకి ఇసుక తుఫానుల ధాటి ఎక్కువే. ఐదు మీటర్ల నుంచి రెండు మీటర్లకు కుదించుకుపోవడానికి ఇదే ప్రధాన కారణం.

దీంతో ఈ గోడ కొద్దికొద్దిగా ఆకర్షణ కోల్పోతుంది.

ఇప్పటిదాకా ప్రపంచ వింతల్లో ఒకటైన గ్రేట్ వాల్ ఆఫ్ చైనా పొడవు ఐదువేల కిలోమీటర్లుగా ఉంటుందని అంచనావేశారు. అయితే చైనా ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో తాజాగా నిర్వహించిన సర్వే, మ్యాపింగ్‌ల ప్రకారం గ్రేట్ వాల్ ఆఫ్ చైనా పొడవు 8,851 కిలోమీటర్లు అని తేల్చారు.

దేశం: చైనా
పొడవు: 8,851 కిలో మీటర్లు
ఎత్తు: ఐదు నుంచి ఎనిమిది మీటర్లు

## పకపక

### టిఫిన్ బాక్స్



**దుకాణుదారుడు:** నేను మీకు దుకాణంలోని ఒక్కో చెప్పుల జత చూపించాను. ఇప్పుడైతే ఒక్కటి కూడా మిగల్లేదు

**కస్టమర్:** అక్కడ ముందు డబ్బాలో ఏముంది?

**దుకాణుదారుడు:** అమ్మో, అందులో నా లంచ్ బాక్స్ ఉంది.

### ట్రక్కు నడిపేవాణ్ణి



సైకిల్ మీద వెళుతున్న ఒక వ్యక్తి మరో వ్యక్తిని ఢీకొట్టాడు.

**సైకిలిస్ట్:** బ్రదర్ మీరు చాలా అదృష్టవంతులు.

**బాధితుడు:** నువ్వు నన్ను ఢీకొట్టావు. పైగా నన్ను అదృష్టవంతుడివి అంటున్నావు ఏంటి సంగతి?

**సైకిలిస్ట్:** ఇవ్వాళ సెలవు దొరికింది కాబట్టి సైకిల్ నడుపుతున్నాను. లేకపోతే ట్రక్కు నడిపించేవాణ్ణి.

### డ్రైవింగ్ లైసెన్స్



చందు బైక్ మీద వెళుతున్నాడు. పోలీస్ అతన్ని ఆపి ట్రాఫిక్ వారోత్సవాలు జరుగుతున్నాయి. మీకు రెండువేల రూపాయల నగదు లభించింది. దీన్ని ఏం చేస్తావు?

**చందు:** దీంతో నేను ఎంచక్కా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుంటాను.

### గుర్తుండడం లేదు



**రాజు:** సర్ ఏం గుర్తుండడం లేదు!
**టీచర్:** అలాగా క్లాస్‌లో నిన్ను ఎప్పుడు కొట్టాను?
**రాజు:** సోమవారం సర్
**టీచర్:** ఇదెలా గుర్తుండిపోయింది?
**రాజు:** సర్ ప్రాక్టికల్‌లో ప్రాబ్లం లేదు. థియరీలో ప్రాబ్లం ఉంది మరి!

# ఉప్పు నీటి నుంచి మంచినీరు


పిల్లలూ! బావినీళ్లు ఉప్పగా ఉంటాయి. ఈ నీటిలో ఉన్న ఉప్పును తొలగించి త్రాగునీటిగా మార్చుకోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం.

**కావాల్సిన పదార్థాలు**
**ఓ చిన్న కప్పు (గ్లాసు లేదా స్టీల్)**
**పెద్ద మిక్సింగ్ బౌల్**
**నున్నగా ఉన్న చిన్న రాయి**
**ప్లాస్టిక్ తొడుగు**
**స్ట్రింగ్ లేదా స్కాచ్ టేప్**
**4 కప్పుల డ్రింకింగ్ వాటర్**

### ఇలా చేయాలి

1. పెద్ద మిక్సింగ్ బౌల్‌లో నాలుగు కప్పుల నీటిని కలపాలి. వీటిలో రెండు టేబుల్ స్పూన్స్ ఉప్పు కలపాలి. ఉప్పు కరిగే వరకు బాగా తిప్పాలి.
2. చిన్న ఖాళీ కప్పును బౌల్ మధ్యలో పెట్టాలి. ఉప్పు నీటిని దీనిలో పడకుండా జాగ్రత్తపడాలి.
3. ప్లాస్టిక్ పేపర్‌తో బౌల్ మూసేయాలి. టేప్‌తో కొనలను సీల్ చేయాలి.
4. ప్లాస్టిక్ పేపర్ భాగం మీద రాయిని ఉంచాలి. అంటే చిన్న కప్పుపై భాగంలో దీనిని పెట్టాలి. పేపర్ మధ్య భాగం వంగే విధంగా రాయి ఉంటుంది.





### ఎలా.. ఎందుకు?

ఈ బౌల్‌ను కొద్దిసేపు ఎండలో బెట్టాలి. ఇలా ఎండలో పెట్టడం వల్ల ఈ ప్రక్రియ ప్రారంభమౌతుంది. సూర్య కిరణాలు బౌల్ మీద పడటంతో దశలవారిగా ఉప్పు నీటిగా మార్చుకోవచ్చు.

### ఇప్పుడు చూడండి

కొన్ని గంటల్లో నీటిచుక్కలు ప్లాస్టిక్ పేపర్ మీదికి చేరుకుంటాయి. ఈ నీటిచుక్కలు బౌల్ మధ్యలో ఉన్న కప్పులో పడతాయి. మీరుగనక ఈ నీటిని త్రాగినట్లయితే మీరు నోటీస్ చేసే అవకాశం ఉంది. ఈ నీళ్లు ఉప్పగా ఉండవు.

### ఆలోచించండి

ఉప్పు నీరు త్రాగేనీరుగా మారడం ఎలా?

నీళ్లు మూడుస్థితుల్లో ఉంటుంది. ఘన, ద్రవ, గ్యాస్ రూపంలో ఉంటుంది.ఈ మూడు స్థితులు కూడా నీటి అణువులకు ఉండే శక్తి మీద ఆధారపడి ఉంటుంది. ఎప్పుడైతే సూర్యుడి క్రింద బౌల్ పెట్టినట్లయితే నీటి అణువులు ఉపరితలం మీదికి చేరుకుంటాయి. సూర్యుని నుంచి శక్తిని పొందుతాయి. మళ్లీ గ్యాస్ (నీటి ఆవిరి) క్రిందికి మారిపోతాయి. ఈ ప్రక్రియనే ఆవిరి ప్రక్రియ అని అంటాం. నీటి ఆవిరిని ప్లాస్టిక్ పేపర్ నిరోధించగలుగుతుంది.

నీటి అణువులు శక్తిని కోల్పోతాయి. నీటిలో పడిపోతాయి. నీటి చుక్కలు ప్లాస్టిక్ పేపర్ మధ్య భాగానికి పల్లంగా ఉండటంతో నెమ్మదిగా నీటి చుక్కలు మధ్య కప్పులో పడిపోతాయి. ఈ నీళ్లు స్వచ్ఛమైనవి. ఎందుకంటే కేవలం నీటి అణువులు మాత్రమే ఆవిరయ్యాయి. కానీ ఉప్పు మాత్రం పెద్దబౌల్‌లోనే ఉండిపోయింది.

# కలుషిత ఆహారాన్ని పక్షులు ముట్టుకోవు

**జంతువులను ఎందుకు ప్రేమించాలి, వాటికి మేత, సంరక్షణ గూర్చి పర్యావరణవేత్త, పార్లమెంట్ సభ్యురాలు మేనకాగాంధీ పిల్లల వెబ్ సైట్ గా ఖ్యాతి పొందిన ''చంపక్''కు సమాధానాలిచ్చారు. అవేంటో తెలుసుకుందాం.**



**ప్రశ్న:** మేము ఇటీవల పెద్ద ఇంటికి మారిపోయాం. మంచి గార్డెన్ చెట్లు కూడా తీసుకెళ్లాం. మా అమ్మ పక్షి పెంపకందారులను మా గార్డెన్‌లో నియమించింది. కానీ ఏ ఒక్క పక్షి కూడా తినడానికి మా గార్డెన్‌కి రావడం లేదు. నేను మిశ్రమ ధాన్యాన్ని నానబెట్టి, బ్రెడ్డు, నీటిని వాటికి ఇస్తున్నాను. అయినప్పటికీ పక్షులు తినడానికి రావడం లేదు?

**రాధ, 10 సంవత్సరాలు**

**జవాబు:** డియర్ రాధా, పక్షులు శుభ్రంగా ఉన్న దానానే తినడానికి ఇష్టపడతాయి. కాబట్టి పక్షి పెంపకందారుడు కూడా శుభ్రంగా ఉండాలి. కాబట్టి మీ పక్షి పెంపకందారుడు కీలకంగా వ్యవహరిస్తాడు. మరో కారణం కూడా ఉంది. ఆహారం, నీరు సరిపడినంత ఉన్నప్పుడు పక్షులు ఇటువైపు చూడవు. అప్పుడు పక్షి పెంపకందారుడి అవసరమే ఉండకపోవచ్చు. మిశ్రమ ధాన్యాన్ని నానబెట్టి కాకుండా పొడిపొడిగా ఇవ్వాలి. స్వచ్ఛమైన నీటిని పెట్టాలి. ఫంగస్ ఉన్న నీటిని పక్షులు ముట్టుకోవు. మీ గార్డెన్‌లో కొద్దిరోజుల తర్వాత చూడండి. పక్షుల సంఖ్య క్రమక్రమంగా పెరిగిపోతుంది.

# చుక్కలు కలపండి



# పతంగులతో బీకేర్‌ఫుల్

పిల్లలూ! సంక్రాంతి అంటే ఠక్కున గుర్తొచ్చేది పతంగులే. రకరకాల పతంగులు మార్కెట్లోకి వచ్చేశాయి. ఈసారి చైనా మాంజాను పూర్తిగా నిషేధించారు. ఈ మాంజా వల్ల మనుషులకే కాదు మూగజీవాలు కూడా చనిపోతున్నాయి. పతంగుల ఎగరవేయడంలో కాస్త జాగ్రత్త చర్యలుపాటిస్తే చాలా మంచిది. ఏమరుపాటుగా ఉన్నామో అంతే సంగతులు. ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్టవుతుంది. అవేంటో తెలుసుకుందాం.

**సురక్షిత చర్యలను తీసుకోండి**

- రోడ్ల మీద పతంగులు ఎగరవేయకూడదు.
-తెగిన పతంగులు రోడ్డు మీద పడుతుంటాయి. వాటిని పట్టుకోవడానికి పరుగెత్తకూడదు. ఇలా పరుగెత్తుతున్న సమయంలో వాహనాలు వచ్చి ఢీకొట్టే ప్రమాదముంది.
- ఎయిర్ పోర్టు దగ్గర్లో పతంగులను ఎగరవేయకూడదు
- పతంగుల కోసం రోడ్ల మీద పరుగెత్తితే వీధికుక్కలు పిల్లలవెంటపడి కరవొచ్చు.
- పతంగుల కోసం చెట్లు, టెలిఫోన్ పోల్స్ వంటివి చేస్తుంటారు చాలామంది పిల్లలు. ఇలా చేయడం ప్రాణాల మీదికి తెచ్చుకున్నట్టవుతుంది.
- విద్యుత్ స్థంభాలకు దగ్గర్లో పతంగులను ఎగరవేయకూడదు. చేతిలో దారం విద్యుత్ తీగలను తాకితే కూడా కరెంట్ షాక్ తగొలొచ్చు.



# పదాల అల్లిక (పజిల్)

పిల్లలూ...ఈ రోజు మీకిస్తున్న పదాలు అన్నీ 'ప్ర' అనే అక్షరంతో మొదలవుతున్నాయి. మిగిలిన రెండు అక్షరాలను నింపి పదాలను తయారుచేయండి. ఆధారాల్లో ఇచ్చిన వివరాలను బట్టి పదాల అర్థాలను గ్రహించండి.

**ఆధారాలు**

1. మనమే...ప్రజాస్వామ్యం నిర్వచనంలో వీరి చేత...వీరివలన...వీరికొరకు...పరిపాలన అంటారు.
2. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఓట్లు వేయమని...అడుగుతారు కదా...అదేఇది.
3. వందనం...నమస్కారం...దణ్ణం...ఏదైనా. 'పరిణామం' లోంచి మీకు అవసరమైన అక్షరాలను తీసుకోండి.
4. మనచుట్టూ ఉన్న చెట్లు కొండలు గుట్టలు జలపాతాలు...వీటన్నింటినీ కలిపి ఇలా అంటారు....'త్యాగరాజకృతి'లో మీకు కావాల్సిన అక్షరాలు ఉన్నాయి.
5. ముందడుగు...అభివృద్ధిని ఇలా పిలుస్తారు....'శరణాగతి'లో మీకు కావాల్సిన అక్షరాలు ఉన్నాయి.
6. మెరుపు, వెలుగు...అనే అర్థంలో వాడతారు...సంక్రాంతికి కోనసీమలో ఈ పేరుతో ఉత్సవం జరుగుతుంది....బాహుబలి హీరోపేరులోని మొదటి రెండు అక్షరాలు.
7. ఏదైనా విద్యలో లేదా వృత్తిలో కళలో చక్కని నైపుణ్యం సాధిస్తే...ఇది ఉన్న వ్యక్తులుగా గుర్తింపు వస్తుంది.
8. ఆనందం...అనే అర్థంలో వాడే పదం ఇది. 'ఆమోదం'లో...మీకు కావలసిన రెండు అక్షరాలు ఉన్నాయి.
9. చెడు, కీడు, గాయాలు...వీటన్నింటినీ తెచ్చిపెట్టే పదం ఇది. దీనికి దూరంగా ఉండాలని కోరుకుంటాం.
10 మొదటి...అనే అర్థంలో వాడే పదం...దీనితరువాతే రెండవ మూడవ స్థానాలు ఉంటాయి...
11. ఒక ప్రాంతాన్ని ఇలా పిలుస్తారు.....'ఆదేశం'లో మీకు కావలసిన అక్షరాలు ఉన్నాయి.
12 స్త్రీలను ఇలా కూడా పిలుస్తారు...'మదనకామరాజు కథ'లో మీకు అవసరమైన రెండు అక్షరాలు ఉన్నాయి.
13. ఇందులో ఒత్తివేసి...దీపం వెలిగిస్తారు. దీపావళికి ఇవి చాలా ముఖ్యం.

జవాబులు: 1. ప్రజలు, 2. ప్రార్థన, 3. ప్రణామం, 4. ప్రకృతి, 5. ప్రగతి, 6. ప్రభాస, 7. ప్రతిభ, 8. ప్రమోదం, 9. ప్రమాదం, 10 ప్రథమ, 11. ప్రదేశం, 12. ప్రమదలు, 13. ప్రమిద

నిర్వహణ: వి. దుర్గ

| | | | |
|---|---|---|---|
| 1 | ప్ర | | |
| 2 | ప్ర | | |
| 3 | ప్ర | | |
| 4 | ప్ర | | |
| 5 | ప్ర | | |
| 6 | ప్ర | | |
| 7 | ప్ర | | |
| 8 | ప్ర | | |
| 9 | ప్ర | | |
| 10 | ప్ర | | |
| 11 | ప్ర | | |
| 12 | ప్ర | | |
| 13 | ప్ర | | |



# ఒక లైఫ్ చూస్తున్నట్లు అనిపించింది

## ఎన్.టి.ఆర్. కథానాయకుడు చిత్రంపై సూపర్‌స్టార్ కృష్ణ


నరేష్, కృష్ణ, విజయనిర్మల

ఎన్.టి.ఆర్.కథానాయకుడు చిత్రాన్ని చూశాను. చాలా బావుంది. సినిమా చూసినట్లు కాకుండా ఒక లైఫ్‌ను చూసినట్లు అనిపించింది అని సూపర్‌స్టార్ కృష్ణ అన్నారు. నందమూరి బాలకృష్ణనటించి, నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చిత్రాన్ని సూపర్‌స్టార్ కృష్ణ, విజయనిర్మల ప్రత్యేకంగా వీక్షించారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ, ఇందులో బాలకృష్ణ వందశాతం ఎన్.టి.ఆర్.లా కనిపించారు. ఆయన వేసిన అన్ని గెటప్స్‌లోనూ బావున్నారు. తప్పనిసరిగా సినిమా పెద్ద విజయాన్ని సాధిస్తుందని ఆశిస్తున్నాను అని అన్నారు. విజయనిర్మల మాట్లాడుతూ, నాకు పన్నెండేళ్ల వయసు ఉన్నప్పుడు ఎన్.టి.ఆర్.తో కలిసి పాండురంగ మహత్యం చేశాను. ఆ సినిమాలో కృష్ణుడిగా నటించాను. ఈ బయోపిక్ చూస్తుంటే ఎన్.టి.ఆర్.ను చూస్తున్నట్లుగానే బాలకృష్ణ నటించారు. సినిమా చాలా బావుంది అని అన్నారు.

నటుడు నరేష్ విజయకృష్ణ మాట్లాడుతూ, ఈ బయోపిక్‌లో వేషం వేయాలని నన్ను అడిగినపుడు చాలా సంతోషం వేసింది. అది కూడా బి.ఎ.సుబ్బారావుగారి వేషం. ఆ సన్నివేశాలను నేను చేస్తున్నప్పుడు థ్రిల్ ఫీలయ్యాను. క్రిష్ ప్లానింగ్‌తో అనుకున్న సమయంలో సినిమాను పూర్తిచేశారు. బాలయ్యగారిని అన్నదమ్ముల అనుబంధం సినిమా సమయంలో కలిశాను. తనతో మంచి అనుబంధం ఉంది. ఈ సినిమాతో ఆయన మహానటుడిగా అవతరించారు అని అన్నారు.


కాజల్

# అందాల రాణి అని పిలుస్తారు..!

దశాబ్దంన్నర కాలంగా వెండితెరపై అందాల విందు చేస్తోంది కాజల్ అగర్వాల్. భాషలకు అతీతంగా నటిస్తూ సినిమాల సంఖ్యలో శతకం దిశగా దూసుకెళ్తోంది. నటిగా తానిప్పుడు పరిణితి సాధించానంటోంది కాజల్. ఇకపై చేసే సినిమాలను మరింత జాగ్రత్తగా ఎంచుకుంటానని చెబుతోంది. గతంలో చేసిన కొన్ని చిత్రాలు చూస్తే ఇలా నటించానేంటి అనిపిస్తుంటుందని, కాలంతో పాటు ఎదిగానని తెలిపింది. ఇటీవల కాజల్ స్పందిస్తూ...మనుషులుగా మనం కాలంతో పాటే ఎదుగుతుంటాం. నటిగా నేను ఇప్పుడు ఒక స్థాయికి వచ్చాను. నటనలో పరిపక్వత సాధించాను. నా తొలినాళ్ల చిత్రాలు చూస్తుంటే...నేనేనా ఇలా నటించింది అనిపిస్తుంటుంది. అలా నటించి ఉండాల్సింది కాదు. అప్పుడు ఆ సమయాన్ని ఆస్వాదించినా....ప్రస్తుతం మెరుగుపడాల్సింది అనే భావన కలుగుతుంటుంది. కానీ అప్పుడూ ఇప్పుడూ నేను ఒకటేగా. నేను బాలీవుడ్ సినిమాలు ఎక్కువ చేయలేదు. నాకొచ్చిన అవకాశాల్లో మంచివి ఎంచుకున్నాను. వాటిలో కొన్ని హిందీ సినిమాలూ ఉన్నాయి. అయితే హిందీ సినిమా చేయాలని అక్కడి చిత్రాలు అంగీకరించను. నిజంగా బాగుంటే తప్పకుండా నటిస్తా. తెలుగు, తమిళంలోనే నచ్చిన చిత్రాలు వచ్చాయి. వాటితోనే తీరిక లేకుండా నా ప్రయాణం కొనసాగింది. నేను బాలీవుడ్‌లోనే సినిమాలు చేస్తే....దక్షిణాదిని వదిలేశారా అంటారు. ఎలాగైనా విమర్శిస్తారు. ఎప్పటికప్పుడు నటనలో, అందంలో కొత్తగా కనిపించాలని శ్రమిస్తుంటాను. నన్ను ప్రేక్షకులు, మీడియా అందాల రాణిగా అభివర్ణిస్తుంటారు. అలా పిలిచినందుకైనా పేరు నిలబెట్టుకోవాలి కదా. అని చెప్పింది.



# సంక్రాంతి అల్లుళ్ళుగా నవ్వించబోతున్నాం

## ఎఫ్2 ప్రీ రిలీజ్ వేడుకలో వెంకటేష్, వరుణ్‌తేజ్

ఈ సంక్రాంతి పండుగకు ఎఫ్ 2 చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుండటం ఆనందంగా ఉంది. సాధారణ పండుగలకు వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లను ప్రేక్షకులు ఆదరిస్తుంటారు. అయితే ఈ తడవ మేమిద్దరం ఎఫ్ 2 సినిమా రూపంలో సంక్రాంతి అల్లుళ్ళుగా వస్తున్నాం. అందరినీ నవ్వించబోతున్నాం అని చిత్ర కథానాయకులు విక్టరి వెంకటేష్, వరుణ్‌తేజ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రం శనివారం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, పెద్ద హీరోలా నేనెప్పుడూ అనుకోను. కథ, దర్శకుడ్ని నమ్మి సినిమా చేశాను. దిల్‌రాజుతో కూడా మంచి అనుబంధం ఉంది. ఈ చిత్రానికి నేను పనిచేస్తున్నప్పుడు ఓ సహ నిర్మాతలా, మేనేజర్‌లా చిత్రబృందం అందరితో కలసిపోయి పనిచేశాను. దృశ్యం, గురు సినిమాల తర్వాత చేసిన సినిమా ఇది. చాలా సహజంగా నటించాను. వరుణ్‌తేజ్, రాజేంద్రప్రసాద్‌లతో కలిసి పనిచేయడం ఆనందంగా అనిపించింది అని అన్నారు. హీరో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ, ఈ సినిమాలో వరుణ్‌తేజ్‌లా కాకుండా వరుణ్‌యాదవ్‌లా కనిపిస్తాను. మొదటిసారి కామెడీతో కూడుకున్న ఓమాస్ పాత్ర చేశాను. సినిమా ఎప్పుడు మొదలై...ఎప్పుడు అయిపోయిందో తెలియడం లేదు. ఈ జర్నీ నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ బేనర్‌లో మరిన్ని సినిమాలు చేయాలనుకుంటున్నాను. మా పెదనాన్న సమకాలీకులైన వెంకటేష్‌గారితో సినిమా చేయాలంటే ఎక్కడో చిన్న భయం ఉండేది. కానీ ఆయన మాతో ఓ స్నేహితుడిలా చాలా హాయిగా కలిసిపోయారు. ఈ తడవ కథ అడగకుండానే ఆయనతో సినిమా చేయడానికి నేను సిద్ధం. మా ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చే సన్నివేశాలకు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు. ఈ సంక్రాంతికి అన్ని సినిమాలు బాగా ఆడాలని కోరుకుంటున్నాను అని అన్నారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ, ఓ సినిమా రూపొందడానికి 24 శాఖల శ్రమ ఉండాల్సిందే. ఈ సినిమాకు మేము కూడా అలానే కష్టపడ్డాం. కలియుగ పాండవులుతో వెంకటేష్‌గారి అభిమానినయ్యా. ఆయనతో రెండోసారి సినిమా చేసే అవకాశం దక్కింది. కథ విన్న వెంటనే నా పాత్ర ఏంటి? అని అడగకుండా వరుణ్ ఒప్పుకున్నారు. అనిల్ దగ్గర ఓ మేజిక్ ఉంది. పూర్తి స్క్రిప్టు లేకుండా సినిమా తీయడానికి నేను ఒప్పుకోను. అలాంటి నన్ను సన్నివేశాలు చెప్పి అనిల్ ఒప్పించేస్తుంటారు అని అన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ, ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తే సినిమా ఇది. 80 శాతం చిత్రాన్ని కామెడీతోనే నింపేశాం. టైమింగ్ ఉన్న మంచి నటులు ఈ చిత్రానికి పనిచేశారు. వెంకటేష్, తమన్నా మధ్య ఉండే కెమెస్ట్రీ, కామెడీని ప్రేక్షకులు చాలాబాగా ఆస్వాదిస్తారు. వరుణ్ తెలంగాణ యాసతో ఆకట్టుకుంటారు అని అన్నారు. కథానాయిక తమన్నా మాట్లాడుతూ, కొన్ని సినిమాలు మైలురాళ్లులా అలానే నిలిచిపోతాయి. ఈ సినిమా నాకు అలాంటిది. ఊపిరి తర్వాత నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను. చాలా షేడ్స్ ఉండే పాత్ర. ఎఫ్ 3 చేస్తే బావుంటుంది. మళ్లీ మేమంతా కలిసి పనిచేయవచ్చు అని అన్నారు.

# కల్యాణ్‌రామ్ కొత్త కోణంలో 118

నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 118. నివేదాథామస్, షాలినిపాండే కథానాయికలుగా నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ కె.వి.గుహన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై



రూపొందుతున్న ఈ చిత్రం మార్చి 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ విషయాన్ని నిర్మాత మహేష్ కోనేరు తెలియజేస్తూ...ఇప్పటికే ఈ చిత్రం టైటిల్ లోగో, ఫస్ట్‌లుక్, టీజర్‌ను విడుదలచేశాం. చాలా మంచి స్పందన లభించింది. షూటింగ్ పార్ట్ పూర్తయిన ఈ చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. కల్యాణ్‌రామ్ పాత్ర లుక్‌తో పాటు సినిమా ఏ జోనర్‌లో తెరకెక్కిందనే విషయాన్ని టీజర్‌లో చూపించాం. సీట్ ఎడ్జింట్ థ్రిల్లర్ ఇది. కల్యాణ్‌రామ్ ఇప్పటివరకు చేయనటువంటి జోనర్. వెంకట్, అన్బరివు, రియల్ సతీష్‌ల అద్భుతమైన యాక్షన్ పార్ట్ చిత్రంలో కీలకంగా ఉంటుంది. దర్శకత్వంతో పాటు గుహన్ కథ, కథనం, సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి అందిస్తున్నారు. శేఖర్‌చంద్ర సంగీతం అలరిస్తుంది అని అన్నారు. ఈ చిత్రానికి మాటలు: మిర్చి కిరణ్, ఎడిటింగ్: తమ్మిరాజు, ఆర్ట్: కిరణ్‌కుమార్.

# కలిసి నడుద్దాం!





ప్రధాని నరేంద్ర మోదీ హిందీ చిత్ర పరిశ్రమ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాలీవుడ్‌లోని పలు సమస్యలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో దర్శకులు కరణ్ జోహార్, రోహిత్ శెట్టి, అశ్వనీ అయ్యర్ తివారీ, ఏక్తా కపూర్, మహవీర్ జైన్, నటులు రన్వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్, వరుణ్ ధావన్, రాజ్ కుమార్ రావ్, వికీ కౌశల్, ఆయుశ్మాన్ ఖురానా, భూమీ ఫడ్నేకర్, సిద్ధార్థ్ మల్హోత్రా తదితరులు పాల్గొన్నారు. సినిమా టికెట్‌లపై జీఎస్‌టీ తొలగించాలనేది ప్రధానంగా చర్చకు వచ్చింది. టికెట్‌లపై జీఎస్‌టీ తొలగిస్తామని ఈ సందర్భంగా ప్రధాని బాలీవుడ్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. దేశ అభివృద్ధిలో తామూ భాగస్వామ్యులం అవుతామని హిందీ తారలు ఈ సందర్భంగా మోదీతో అన్నారు. సమావేశం అనంతరం కరణ్ జోహార్ మాట్లాడుతూ...ఒక కుటుంబంగా జాతి నిర్మాణంలో భాగమవ్వాలనే బలమైన కోరిక మాలో ఉంది. అభివృద్ధిలో మా వంతు పాత్ర పోషిస్తాం. అయితే మేమెలా భాగమవ్వాలనే విషయంలో చర్చ ద్వారానే స్పష్టత వస్తుంది. ప్రపంచంలో అతి పెద్ద చిత్ర పరిశ్రమ మనది, అత్యంత ఎక్కువ సంఖ్యలో యువజనులు ఉన్నారు. ఇద్దరం కలిస్తే గొప్ప ప్రగతికి బాటలు వేయొచ్చు. అన్నారు.

# భరతనాట్యం నేపథ్యంలో ప్రణవం


శ్రీ, అవంతిక హరి నల్వా

శ్రీమంగం (ఈ రోజుల్లో ఫేమ్), శశాంక్, అవంతిక హరి నల్వా, గాయత్రి అయ్యర్ ప్రధాన పాత్రలలో తెరకెక్కుతున్న చిత్రం ప్రణవం. కుమార్.జి. దర్శకత్వం వహిస్తున్నారు. చరిత అండ్ గౌతమ్ ప్రొడక్షన్స్ పతాకంపై తను.ఎస్. నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు కుమార్.జి. మాట్లాడుతూ, చండీఘర్‌కు చెందిన మోడల్ అవంతిక హరి నల్వా హీరోయిన్‌గా నటిస్తోంది. భరతనాట్యం నేపథ్యంలో ప్రేమ, సస్పెన్స్ అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. సంగీతం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఆర్.పి.పట్నాయక్, ఉష ఒక డ్యూయెట్‌ను ఆలపించారు. త్వరలో ఆడియో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం అని అన్నారు. ఈ చిత్రంలో ఇంకా జెమిని సురేష్, నవీన, జబర్దస్త్ బాబి, దొరబాబు, సమీర నటిస్తుండగా....ఈ చిత్రానికి సంగీతాన్ని పద్మనావ్ భరద్వాజ్, ఛాయాగ్రహణాన్ని ఎం.డేవిడ్ అందిస్తున్నారు. సహ నిర్మాతలుగా వైశాలి, అనుదీప్ వ్యవహరిస్తున్నారు.

# విభిన్నమైన ప్రేమకథతో రావే నా చెలియా



నెమలి అనిల్, సుబాంగిపంథ్ హీరోహీరోయిన్లుగా తెరకెక్కుతున్న చిత్రం రావే నా చెలియ. ఎన్.మహేశ్వరరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యచంద్ర ప్రొడక్షన్స్ పతాకంపై నెమలి సురేష్ సమర్పణలో నెమలి అనిల్, నెమలి శ్రవణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం లోగో ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన నిర్మాత రాజ్ కందుకూరి చేతులమీదుగా లోగో విడుదలైంది. ఈ సందర్భంగా రాజ్ కందుకూరి మాట్లాడుతూ, చిన్న సినిమాల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సినిమా కూడా అందులో చేరింది. టైటిల్ బావుంది. కంటెంట్ కూడా బావుంటుందనే అనుకుంటున్నాను. చిత్రబృందానికి అంతటికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా అని అన్నారు. హీరో నెమలి అనిల్ మాట్లాడుతూ, ఇది నా మొదటి సినిమా. మా బేనర్ కూడా కొత్తగా ఏర్పాటు చేసిందే. మా నాన్న, బాబాయ్ ఇద్దరూ నిర్మాతలుగా ఎంతో అభిరుచితో ఈ చిత్రం చేశారు. చిన్న సినిమా అయినా మంచి సినిమా కావడంతో ప్రేక్షకులు ఆదరిస్తారని విశ్వసిస్తున్నాం అని అన్నారు. నిర్వాహకుడు నెమలి సురేష్ మాట్లాడుతూ, మంచి కథతో వస్తున్నాం. అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాం అని అన్నారు. దర్శకుడు ఎన్.మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ సినిమాకు కెమెరా పనితనం చాలాబాగా కుదిరింది. విభిన్నమైన ప్రేమకథతో వస్తున్నాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్, రవి ఎన్., విరాజ్, సుబాంగి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. చిత్రానికి ఛాయాగ్రహణాన్ని విజయ్ దగ్గుబాటి అందిస్తుండగా...సంగీతాన్ని ఎం.ఎం.కుమార్ సమకూరుస్తున్నారు.